PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 206 | విజయవాడ, గురువారం 27 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 27 February 2025 | Rs

గిరిజన హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం

- అటవీ భూముల నుంచి బలవంతంగా గెంటివేత
- వాణిజ్య అవసరాలకు ప్రకృతి సంపద ధారాదత్తం
- చట్టాలను కార్పొరేట్లకు చుట్టాలుగా మారుస్తున్న సర్కార్

7



ఆఫ్ఘన్ అదుర్స్

- ఇంగ్లండ్ ఇంటికి • రూట్ పోరాటం వృథా
- జద్రాన్ సెంచరీ, అజ్మతుల్లాకు ఐదు వికెట్లు

8

'స్వర్ణాంధ్ర విజన్'కు జోరుగా కసరత్తు

సచివాలయాల్లో మిగులు సిబ్బంది గుర్తింపు

నియోజకవర్గానికి ఐదుగురు చొప్పన కేటాయింపు?



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వర్ణాంధ్ర విజన్ -2047 అమలు దిశలో రాష్ట్రప్రభుత్వం జోరుగా కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో మిగులు సిబ్బందిని గుర్తించింది. వీరిని క్షేత్రస్థాయిలో విజన్ అమలు యంత్రాంగం (యాస్పిరేషనల్ ఫంక్షనరీస్)గా వినియోగించుకోవాల ని భావిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 15,498 మందిని మిగులు ఉద్యోగులు ఉన్నట్లు ప్రభుత్వం లెక్కలు తేల్చింది. ఇందులో గ్రామ సచివాలయాల్లో 12,126 మంది, వార్డు సచివాలయాల్లో 3,372మంది మిగులు ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. గ్రామ సచివాలయాల్లో మిగులు ఉద్యోగుల్లో అత్యధికంగా సర్వేయర్లు (గ్రేడ్-3) 4,722మంది, గ్రామ మహిళా పోలీసులు 2,107 మంది, విఆర్ఓలు 2,899 మంది వార్డు ప్లానింగ్, రెగ్యులరేషన్ కార్యదర్శులు 1,336మంది ఉన్నారు. వార్డు సచివాలయాల్లో అత్యధికంగా వార్డు రెవెన్యూ కార్యదర్శులు 1,006మంది, వార్డు, ప్లానింగ్ రెగ్యులేషన్ కార్య దర్శులు 1,336మంది మిగులు సిబ్బందిగా తేలారు. వీరిలో అర్హులను 'విజన్-2047' విధుల్లో వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలిదశలో ఒక్కో నియోజకవర్గానికి ఐదుగురు సిబ్బందికి విజన్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయిం చినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో విజన్ లక్ష్యాల అమలు తీరును పర్యవేక్షించడం, అందుకు అవసర మైన సూచనలు చేయడం వీరి ప్రధాన పనిగా ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలు మారుమూల గ్రామాల్లో సైతం అమలయ్యేలా మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

మార్చి నెలాఖరు నుండే...

విశ్వసనీయ సమాచారం ప్రకారం మార్చి నెలాఖరు నుండే 'విజన్' అమలు ప్రక్రియ క్షేత్రస్థాయిలో ప్రారంభం కానుంది. మిగులు ఉద్యోగులుగా ఇప్పటికే గుర్తించిన వారి వివరాలను అందజేయాలని ప్రణాళికా శాఖ సచివాలయాల శాఖను ఇప్పటికే కోరింది. మిగులు ఉద్యోగుల్లో బిటెక్, ఎంటెక్ వంటి ఉన్నత విద్యార్హతలు ఉన్న వారితో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, గ్రీన్ ఎనర్జీపై అవగాహన ఉన్న వారిని గుర్తించి విజన్ అమలు కోసం వినియోగించుకుంటామని అధికారులు చెబుతున్నారు.

నటుడు పోసాని అరెస్ట్

- హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న ఎపి పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సినీ నటుడు పోసాని కృష్ణ మురళిని ఆంధ్రా పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ రాయదుర్గం మైహోం భుజా అపార్ట్ మెంట్స్‌లో ఉంటున్న ఆయనను బుధవారం రాయచోటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని రాయదుర్గం పోలీసులకు సమాచారం తెలియజేసిన తర్వాత పోసానిని రాయచోటికి తరలించారు. గతంలో అన్నమయ్య జిల్లా ఓబులవారిపాలెంలో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీందతో పాటు ఆంధ్రలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఆయనపై పలు కేసులు ఉన్నాయి. పోలీసుల కథనం ప్రకారం... వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఎపిఎఫ్‌టివిడిసి చైర్మన్‌గా పనిచేసిన పోసాని వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ఎపి సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు మంత్రి నారా లోకేశ్‌ను అసభ్యకరంగా దూషించారు. టిడిపి కూటమి నేతల ఫిర్యాదు మేరకు పోసానిపై సిఐడి కేసు నమోదు చేసింది. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడిని ఏకవచనంతో సంబోధించడమే గాక, తిరుమల కొండపై దోపిడీ చేయడానికి వచ్చారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో, పోసానిపై బాపట్ల, అనంతపురం, పల్నాడు జిల్లా నరసరావుపేట, చిత్తూరు జిల్లా యాదమరి, తిరుపతి జిల్లా పుత్తూరులో పోలీసులకు ఫిర్యాదులు అందాయి. వీటిపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో పోసాని ఇటీవల విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాజకీయలకు దూరంగా ఉంటున్నట్టు ప్రకటించారు.

ముందంజలో పిడిఎఫ్

ఆత్మరక్షణలో టిడిపి కూటమి

యధేచ్ఛగా ప్రలోభాలు, బెదిరింపులు


కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతున్న అధికార గణాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

గురువారం (ఫిబ్రవరి 27) పోలింగ్ జరుగుతున్న మూడు ఎంఎల్‌సి నియోజకవర్గాల్లో పిడిఎఫ్ అభ్యర్థుల పట్ల సానుకూలత వ్యక్తమవుతోంది. హంగు ఆర్భాటాలకు దూరంగా ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా సమస్యలపై పిడిఎఫ్ నిర్వహించిన ప్రచారం అమితంగా ఆకట్టుకుంది. ఆయా వర్గాల సంక్షేమం, ప్రయోజనాలు, హక్కుల సాధన కోసం గతంలో పిడిఎఫ్ నెరపిన పోరాటాల వారసత్వం అభ్యర్థులకు బాగా కలిసొస్తోంది. శాసన మండలిలో పిడిఎఫ్ సభ్యులు గళమెత్తిన విధానాన్ని ఆయా వర్గాలు నెమరువేసుకుంటున్నాయి. తమ తరపున ప్రశ్నించే, గళం విప్పే పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతివ్వాలన్న ఆకాంక్షను ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థి, యువత వెలిబుచ్చుతున్నారు. శాసన మండలిలోన, వెలుపల తమ గొంతుకై అవిశ్రాంతంగా పని చేస్తున్న పిడిఎఫ్‌ను ఆదరించి అక్కున చేర్చుకుంటున్నారు. నామినేషన్ల నాటి నుంచి పోలింగ్ మధ్య రోజు రోజుకూ పిడిఎఫ్‌కు ఓటర్ల నుంచి మద్దతు పెరుగుతూ వచ్చింది. తొలుత ఉన్న హోరా హోరీ పోరు వాతావరణం చివరికొచ్చేసరికి ప్రత్యర్థుల కంటే పిడిఎఫ్ అభ్యర్థులను ముందంజకు తీసుకుపోయిందన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. మూడు నియోజకవర్గాల్లోనూ ఇతర అభ్యర్థులు పోటీలో వున్నా పిడిఎఫ్‌కు, టిడిపి కూటమికి మధ్య ద్విముఖ పోటీ వాతావరణం ఏర్పడింది.

ప్రభుత్వంపై అసంతృప్తి

ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికుల్లో టిడిపి కూటమి ప్రభుత్వం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలైనా వారికి సంబంధించిన ఒక్క హామీనీ నెరవేర్చకపోవడమే అం దుక్కారణం. సిపిఎస్ రద్దును టీచర్లు, ఉద్యోగులు కోరుతుండగా వేరే ఏదో ఆలోచిస్తున్నామంటున్న ప్రభుత్వ ధోరణి మభ్యపెట్టేదిగా ఉంది. డిఎ బకాయిలు అలానే ఉన్నాయి. పిఆర్‌సిపై ఎలాంటి ప్రకటనా లేదు. టీచర్ల కంటిపై కునుకు లేకుండా చేస్తున్న వివిధ రకాల యాప్‌లను రద్దు చేస్తామన్న హామీ అలాగే ఉంది. గిరిజన ప్రాంతాల్లో గిరిజను లకే ఉద్యోగాలిచ్చేందుకు ఉద్దేశించిన జిఒ 3 పునరు ద్ధరణ జరగలేదు. గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌తో వాటిలో పని చేస్తున్న ఉద్యోగుల మెడపై కత్తి వేలాడుతోంది. కాంట్రాక్టు, ఔట్‌సోర్స్‌కు సంబంధించి ఆప్కాస్ ఎత్తేసే ప్రాతిపాదన ఉద్యోగుల్లో ఆగ్రహం కలిగిస్తోంది. సిబ్బంది కొరత వలన ప్రభుత్వ విభాగాల్లో సిబ్బందిపై పని భారం ఎక్కువైంది. ప్రభుత్వ తొలి సంతకం మెగా డిఎస్‌సిపై సర్కారు ఫీట్లు ఉద్యోగార్థులను అయోమయంలో పడేశాయి. గ్రూపు-2 పరీక్షపై గందరగోళం అంతా ఇంతా కాదు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేస్తున్న మిగతా 2లో



నాజ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆలపాటి స్టిక్కర్లు (సర్కిల్లో)

గురవయ్య కాలేజి వద్ద శిబిరంలో ఆలపాటికి చెందిన కరపత్రాలు

నేడు 'ఎంఎల్‌సి' పోలింగ్

- ఓటు హక్కు వినియోగించుకోనున్న 6,84,593మంది ఓటర్లు

2

పాలకులు మారినా

తగ్గని యాప్‌ల భారం

- అమలుకు నోచుకోని కూటమి హామీ
- ఉపాధ్యాయులకు పెరుగుతున్న బోధనేతర పనులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



యాప్‌తో సతమతమవుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

తాము అధికారంలోకి వస్తే ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని తొలగిస్తామంటూ ఎన్నికల ముందు తెలుగుదేశం కూటమి నేతలు ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించుకోవడం పట్ల కూడా ఎన్నికల ముందు ఆగ్రహం వ్యక్తం చేసిన టిడిపి నేతలు అధికారంలోకి వచ్చిన తరువాత అవే విధానాలను కొనసాగించడంతో పాటు మరింత భారం వేసే విధంగా వ్యవహరిస్తుండటం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ తీరు మారకపోవడం తో పాఠశాల ప్రారంభమైన నుంచి ముగిసే వరకు యాప్‌లతో ఉపాధ్యాయులు కుస్తీ పట్టడం కొనసాగుతోంది. మొత్తం 64 రకాల యాప్‌లను ఇప్పుడు కూడా ఉపయోగిస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఉదయం పాఠశాలకు రాగానే విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు నుంచి మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థుల కిట్లు, హాజరు, చిక్కీలు, కోడిగుడ్లు ఎన్ని వచ్చాయి అనే సమాచారం అప్‌లోడ్ చేయాలి. ఉదాహరణకు మధ్యాహ్న భోజనం విషయం తీసుకుంటే ప్రతిరోజూ ఎంత సరుకు వచ్చింది?. ఎంత వినియోగించారు?. అందుకు ఎంత బిల్లు అవుతుంది?. గుడ్లు ఎన్ని అందాయి అనే అంశాలను రికార్డుల్లో పొందుపరచాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రతి తరగతిలో ఎంతమంది పిల్లలు హాజరయ్యారు అనే వివరాలను స్టూడెంట్స్ అటెండన్స్ యాప్‌లో నమోదు చేయాలి. ఇవి కాకుండా ఉపాధ్యాయులు దీక్ష యాప్‌లో పిల్లలకు పాఠాలు ఎలా బోధిస్తున్నారు, వారికి పరీక్షల్లో వచ్చిన మార్కుల వంటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. వీటిని అప్‌లోడ్ చేయడం కోసం ప్రాథమిక పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు, పెద్ద ఉన్నత పాఠశాలల్లో ఇద్దరు చొప్పున ఉపాధ్యాయులు పనిచేయాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో అమలైన పద్ధతే దాదాపుగా ఇప్పుడూ కొనసాగుతోంది.

ఒక్కటి రద్దు చేసి ... పది పనులు అప్పగించి...!

గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను బాత్‌రూమ్‌లను ఫోటో తీసి అప్‌లోడ్ మిగతా 2లో

ప్రైవేట్‌కు తిరుపతి ఎయిర్‌పోర్టు

- అదానికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం!
- వచ్చే ఏడాది మార్చిలోపు ప్రక్రియ పూర్తి?

3

సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

- కడప సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

3

అమెరికా పౌరసత్వం @ 50 లక్షల డాలర్లు

- సంపన్న వలసదారులకు ట్రంప్ గోల్డ్ కార్డ్ ఆఫర్



వాషింగ్టన్ : సంపన్నులైన వలసదారులు అమెరికా పౌరసత్వం పొందేందుకు గానూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త ఆఫర్ ప్రకటించారు. 50 లక్షల డాలర్లతో గోల్డ్ కార్డు కొంటే పౌరసత్వం లభిస్తుందని చెప్పారు. గ్రీన్ కార్డ్ నివాస హోదాను ఇవ్వడంతోపాటు విదేశీయులకు అమెరికా పౌరసత్వానికి ఈ గోల్డ్ కార్డులు బాట వేస్తాయని చెబుతున్నారు. 10 లక్షల కార్డులు అమ్ముడవుతాయని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ చొరవ తీసుకోవడం వల్ల జాతీయ రుణాలను త్వరగా తీర్చివేయగలుగుతామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇబి-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా కార్యక్రమం స్థానంలో ఈ గోల్డ్ కార్డులను ప్రవేశపెట్టనున్నట్లు ట్రంప్ విలేకర్లతో చెప్పారు. అమెరికా ఉద్యోగాలను సంరక్షించే లేదా సృష్టించేంత పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించే విదేశీ పెట్టుబడిదారులు ఈ గోల్డ్ కార్డులతో శాశ్వత నివాసులుగా మారడానికి అనుమతించబడుతుంది. అమెరికా వ్యాపారాల్లో పెట్టుబడులు పెడతామనే హామీలతో విదేశీయులకు గ్రీన్ కార్డులను ఇబి-5 ప్రొగ్రామ్ కింద ఇప్పటివరకు మంజూరు చేస్తూ వచ్చారు. సంపన్నులు ఈ కార్డును కొనుగోలు చేసి తమ దేశంలోకి ప్రవేశించవచ్చని చెప్పారు. రెండు వారాల్లో ఈ పథకం అమల్లోకి రానుంది. అప్పుడు మొత్తం వివరాలు తెలుస్తాయని ట్రంప్ చెప్పారు. రష్యన్లు ఈ పథకానికి అర్హులా అని ఒక విలేకరి ప్రశ్నించగా, అర్హులేనని చెబుతూ రష్యన్ సంపన్నుల్లో కొందరు చాలా మంచివారని వ్యాఖ్యానించారు.

'శివరాత్రి' విషాదం

- వేర్వేరు చోట్ల నీట మునిగి 11 మంది దుర్మరణం
- ఇద్దరు గల్లంతు

ప్రజాశక్తి- యంత్రాంగం



తూర్పుగోదావరి జిల్లా తాడిపూడిలో గోదావరి నది వద్ద రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

శివరాత్రి వేడుకల్లో రాష్ట్రంలోని పలుచోట్ల బుధవారం విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. నదులు, వాగుల్లో స్నానానికి దిగిన 11 మంది మృతి చెందారు. చెరువులో స్నానం చేస్తున్న ఇద్దరు గల్లంత య్యారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. తూర్పుగోదావరి జిల్లా తాడిపూడికి చెందిన 11 మంది స్నేహితులు మహా శివరాత్రి సందర్భంగా స్నానం చేసేందుకు బుధవారం తెల్లవారుజామున తాళ్లపూడి మండలం తాడిపూడిలోని గోదావరి నదిలో స్నానానికి దిగారు. వీరిలో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో పడాల దేవదత్తసాయి (18), అనిశెట్టి పవన్ గణేష్ (19), గర్రె ఆకాష్ (18), తిరుమలశెట్టి శ్రీరామ విజయ పవన్ (20), పడాల దుర్గాప్రసాద్ (19) ఉన్నారు. వీరంతా డిగ్రీ చదువుతున్నారు. చిన్ననాటి నుంచి స్నేహితులు. ఈ ఘటనపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యువకులు ఘాట్‌లో కాకుండా ఇతర ప్రాంతంలో స్నానానికి దిగారని, లోతు ఉండడంతో ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు గ్రామానికి చెందిన పక్కుర్తి చరణ్ (20) గ్రామానికి చెంతనే ఉన్న వరహా నదిలో స్నానం చేసేందుకు తన తమ్ముడు, మేనమామ కొడుకుతో కలిసి వెళ్లారు. వీరు ముగ్గురు నీట మునిగిపోయారు. వారిలో ఇద్దరిని అక్కడున్న వారు రక్షించి ఒడ్డుకు చేర్చారు. చరణ్ మృతి చెందారు.

ఏలూరు జిల్లా పెదవేగి మండలం నడిపల్లి వద్ద తమ్మిలేరులో స్నానానికి దిగిన మిగతా 2లో

నివాసప్రాంతంలో కూలిన సైనిక విమానం

- సూడాన్‌లో 46 మంది మృతి

కైరో : సూడాన్‌లోని వాడి సయిద్నా వైమానిక స్థావరం నుండి టేకాఫ్ అవుతుండగా సైనిక విమానం కూలిపోయి 46 మంది మరణించారు. ఈ విషయాన్ని ప్రాంతీయ ప్రభుత్వ అధికారులు బుధవారం తెలిపారు. సూడాన్‌కు చెందిన మిలటరీ విమానం ఖార్టూమ్ శివార్లలో నివాస ప్రాంతాల్లో కూలిపోవడంతో ఈ ఘోరం చోటు చేసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు కలిగిన రెడ్ సీ సిటీకి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ విమానంలో ఉన్నత స్థాయి సైనికాధికారులు వున్నారని స్థానిక మీడియా పేర్కొంది. అయితే ఆ వార్తలను మిలటరీ ధ్రువీకరించనూ లేదు, ఖండించనూ లేదు. మొత్తంగా 46 మంది మరణించగా, 10 మంది గాయపడ్డారని ఖార్టూమ్ రీజనల్ ప్రభుత్వ మీడియా విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది. గాయపడిన వారిలో చిన్నారులు కూడా వున్నారని, అందరికీ ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. సాంకేతిక లోపమే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తున్నట్లు పేరు వెల్లడించడానికి ఇష్టపడని సైనిక వర్గాలు తెలిపాయి. పెద్ద శబ్దం వినిపించిందని, ఆ వెంటనే నల్లని దట్టమైన పొగ కమ్ముకుపోయిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి. ఈ కారణంగా ఆ ప్రాంతమంతా విద్యుత్ తీగలు తెగి అంధకారం అలుముకుంది.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

- కోటప్పకొండలో పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం
- విద్యుత్ తీగలకు చిక్కుకున్న డ్రోన్- తప్పిన ప్రమాదం
- శ్రీశైలానికి తరలివచ్చిన పొరుగు రాష్ట్రాల యాత్రికులు

ప్రజాశక్తి - యంత్రాంగం



విద్యుత్ కాంతుల్లో శ్రీశైల క్షేత్రం

మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలు యాత్రికులతో కిక్కిరిసిపోయాయి. దాదాపు 30 శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆనం తెలిపారు. ఆలయాల్లో సామాన్య యాత్రికులకు పెద్దపీట వేసేలా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కోటప్పకొండ దేవాలయం యాత్రికులతో కిటకిటలాడింది. మూడు లక్షల మంది యాత్రికులు తరలివచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయాణరెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు, సాధారణ ప్రభలు కొండకు తరలివచ్చాయి. భారీ విద్యుత్ ప్రభలు 22, మొక్కుబడి ప్రభలు 80 వరకు వచ్చాయి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఆయా గ్రామాల రైతులు విద్యుత్ ప్రభలను నిర్మించి కొండకు తీసుకురావడం ఆనవాయితీగా వస్తుంది. యాత్రికులకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. నెల్లూరులో మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ఆనం పూజలు నిర్వహించారు.

శ్రీశైల క్షేత్రానికి తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర , ఒడిశా నుంచి యాత్రికులు భారీగా తరలివచ్చారు. మూడున్నర లక్షల నుంచి నాలుగు లక్షల వరకు యాత్రికులు మిగతా 2లో

నేడు 'ఎంఎల్‌సి' పోలింగ్

- ఓటు హక్కు వినియోగించుకోనున్న 6,84,593మంది ఓటర్లు
- ఉండవల్లిలో ఓటు వేయనున్న సిఎం చంద్రబాబు, లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేడు పోలింగ్ జరగనున్న ఉపాధ్యాయ, పట్టభద్ర నియోజకవర్గాల్లో అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. తూర్పు - పశ్చిమ గోదావరి, కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గాలకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. పోలింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమై సాయంత్రం 4గంటల వరకు కొనసాగనుంది. ఈ మూడు నియోజవర్గాల్లో 6,84,593మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో తూర్పు, పశ్చిమ గోదావరి గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 3,14,984మంది, కృష్ణ, గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో 3,47,116మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం ఉపాధ్యాయ నియోజకవర్గంలో 22,493మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఉదయం 9.15 గంటలకు , ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఉదయం 9 గంటలకు ఉండవల్లి పంచాయితీ ఆఫీసు సమీపంలోని ఎంపియుపి స్కూల్‌లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



రంగంలోకి బాబు

ఈ ఎన్నికల్లో టిడిపికి ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయన్న వార్తల నేపథ్యంలో స్వయంగా సిఎం చంద్రబాబునాయుడు రంగంలోకి దిగారు. పార్టీ నేతలతో సమీక్షలు నిర్వహించడంతోపాటు, ఓటర్లకు ఐవిఆర్ఎస్ మెసేజ్‌లు సైతం పంపారు. లోకేష్ నేరుగా ఎన్నికలను పర్యవేక్షిస్తున్నారు. అయినా క్షేత్రస్థాయి పరిస్థితుల్లో పెద్దగా మార్పులేదని, పిడిఎఫ్ పట్ల సానుకూలత రోజురోజుకీ పెరుగుతోందని వార్తలు వస్తున్నాయి. మరోవైపు అన్ని నియోజకవర్గాల్లో కూటమి నేతలు అధికార దుర్వినియోగానికి దిగుతున్నారు.

హెల్ప్ డెస్క్‌ల ముసుగులో ఎన్నికల క్యాంపెయిన్

- పోలింగ్ కేంద్రాల వద్దే మకాం వేసిన ఆలపాటి అనుయాయులు

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తూ టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వర్గీయులు హెల్ప్ డెస్క్‌ల ముసుగులో గుంటూరు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల క్యాంపెయిన్ చేపట్టారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకే ప్రచారం ముగిసినా బుధవారం హెల్ప్‌డెస్క్‌ల పేరుతో ప్రచారం నిర్వహించారు. ఇందుకోసం ఎన్ఆర్ఐ, కిట్స్ కాలేజీ విద్యార్థులు, సిబ్బందిని వినియోగించారు. ఇందులో ఎన్ఆర్ఐ కాలేజీ ఆలపాటికి చెందిన విద్యా సంస్థ కావడం గమనార్హం. నాజ్ సెంటర్ కూడలిలో టెంటు, టేబుళ్లు వేసి, ఆలపాటి స్టిక్కర్లు అంటించి మరీ ప్రచారం నిర్వహించారు. సిబ్బంది బ్యాగులలో ఆలపాటికి చెందిన కరపత్రాలు కనిపించాయి. స్థానిక ఏటి అగ్రహారంలో ఏకంగా ఎస్‌కెబిఎం హైస్కూల్ ప్రాంగణంలోనే హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల గేట్ల వద్ద టేబుళ్లు వేసి క్యాంపెయిన్ చేసినా అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. అనేక పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం వరకూ ప్రచారం కొనసాగింది. దీంతో పలుచోట్ల ప్రజాసంఘాల నాయకులు ఆ ప్రచారాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గురవయ్య కాలేజీ పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలోని ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నించే క్రమంలో సమీపంలో ఉన్న టిడిపి నాయకులు అక్కడికి చేరుకొని వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వం ఓటరు స్లిప్పులు ఇవ్వనందున తాము ఇస్తున్నామని, ప్రచారం చేయట్లేదని చెప్పే ప్రయత్నం చేశారు. కానీ వారి బ్యాగుల్లో దాచిన కరపత్రాలను ప్రజా సంఘాల నాయకులు బయటకు తీసి చూపించడంతో అక్కడి నుండి వెళ్లిపోయారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఈ ప్రచారంపై లక్ష్మణరావు తరపున చీఫ్ ఎన్నికల ఏజెంట్ రమేష్ రిటర్నింగ్ అధికారికి, ఎలక్షన్ అబ్జర్వర్‌కు ఫిర్యాదు చేశారు.

కెఆర్ఎంబి భేటీకి ఆంధ్ర గైర్హాజరు

- నేడు మళ్లీ సమావేశం

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) సమావేశానికి ఆంధ్రప్రదేశ్ సాగు నీటి పారుదల అధికారులు గైర్హాజరయ్యారు. దీంతో గురువారం మళ్లీ భేటీ కావాలని బోర్డు చైర్మన్ అతుల్‌జైన్ నిర్ణయించారు. ఈ మేరకు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సమావేశానికి హాజరైన తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఇంజనీర్ ఇన్ చీఫ్ జి.అనిల్‌కుమార్ వచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అధికారుల వైఖరిని తప్పుబట్టారు. కృష్ణా బోర్డు సమావేశానికి ఎలాంటి సమాచారం లేకుండా గైర్హాజరు కావడం సరికాదన్నారు. ఎపి అధికారులు రాకపోవడంపై రాహుల్ బొజ్జా అసంతృప్తి వ్యక్తం చేశారు. 'బోర్డు సమావేశం ఏర్పాటు చేస్తే..ఉద్దేశపూర్వకంగానే ఆంధ్రప్రదేశ్ అధికారులు రాలేదని' వ్యాఖ్యానించారు. కృష్ణా జలాలు, 119 టిఎంసిలను తాగు, సాగు నీటికి కేటాయించే విషయమై తాము చేసిన వాదలను రికార్డు చేసి కేంద్ర ప్రభుత్వానికి, సిడబ్ల్యూసికి పంపాలని డిమాండ్ చేశారు. శ్రీశైలంతోపాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి వచ్చే మే నెల వరకు తమకు 55 టిఎంసిల నీరు కావాలని ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సర్కారు ప్రతిపాధించిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా ఎస్ఎల్‌బిసి కుడి ప్రధాన కాల్వ ద్వారా ఎపి తీసుకుంటున్న జలాలను తక్షణమే 7000 క్యూసెక్కులకు తగ్గించాలని ఆదేశించింది. అలాగే శ్రీశైలం జలాశయం నుంచి తీసుకుంటున్న జలాలను కూడా ఆ రాష్ట్రం తక్షణమే తగ్గించాలనీ, కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని సూచించింది. ప్రస్తుత సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ తన వాటాకు మంచి కృష్ణా నీటిని వాడుకుందనీ, ఇకపై శ్రీశైలం, సాగర్ నుంచి ఆ రాష్ట్రం నీళ్లు తీసుకోకుండా నిలువరించాలని తెలంగాణ ఫిర్యాదు చేసింది.



పలు ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేసిన గిఫ్టుల వద్ద టిడిపి నాయకులు

ఉపాధ్యాయులకు ఎర

- ఓటర్లకు ఎపిటిఎఫ్ అభ్యర్థి, టిడిపి కూటమి మద్దతుదారు వర్మ గిఫ్టులు
- మంత్రి గొడౌన్లో దాచి ఉంచి పంపిణీ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని టిడిపి కూటమి మద్దతుతో పోటీలో ఉన్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎపిటిఎఫ్ అభ్యర్థి పి.రఘువర్మ ప్రలోభాలకు దిగారు. ఉపాధ్యాయులకు పంపిణీ చేసేందుకు గంట్యాడ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు చెందిన రైస్‌మిల్లు గొడౌన్లో వందలాది గిఫ్ట్ బాక్స్‌లను దాచి ఉంచారు. ఇప్పటికే కొన్ని గిఫ్ట్ బాక్సులను పంపిణీ చేసినట్లు సమాచారం. ఈ సమాచారం తెలుసుకున్న పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి మద్దతుదారులు బుధవారం రాత్రి ఆ గొడౌన్ వద్దకు వెళ్లి పరిశీలించారు. గొడౌన్‌కు తాళం వేసి ఉండడంతో దాన్ని తెరిచి గిఫ్ట్‌లను స్వాధీనం చేసుకోవాలని గంట్యాడ పోలీసులకు, డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తికి ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులకు పంపిణీ చేసేందుకు ఈ గొడౌన్లో గిఫ్టులను దాచి ఉంచారని, టిడిపి మండల అధ్యక్షులు కొండపల్లి భాస్కరనాయుడు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లు విజయ్‌కుమార్, కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ అధ్యక్షులు మురళీరాజు ఈ గిఫ్ట్‌లను దగ్గరుండి ఉదయం నుంచి వివిధ ప్రాంతాలకు తరలించారని, ఇంకా గొడౌన్‌లో ఉన్న గిఫ్టు బాక్స్‌లను స్వాధీనం చేసుకోవాలని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎపిటిఎఫ్ అభ్యర్థి రఘువర్మపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి 9.30 గంటలకు ఫిర్యాదు చేసినా రాత్రి 11.30 గంటల వరకూ అధికారులెవరూ సంఘటనా స్థలానికి రాలేదు.




తోట సంతోష్ కుమార్ కూరపాటి లిఖిత్

పండగరోజు విషాదం

- ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ద్విచక్ర వాహనం
- ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

పండుగ రోజు విషాదం చోటుచేసుకుంది. ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తెనపల్లి పట్టణంలోని వడవల్లి ప్రాంతానికి చెందిన తోట సంతోష్ కుమార్ (15) కూరపాటి లిఖిత్ (10) శివరాత్రి సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేందుకు అచ్చంపేట రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్కూటీపై వెళ్లారు. అక్కడ విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో తిరిగి ఇంటికి వస్తుండగా పట్టణంలోని సాయి కృష్ణ థియేటర్ సమీపంలో రోడ్డుపై నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న సంతోష్ కుమార్, లిఖిత్ అక్కడికక్కడే మృతి చెందారు. సంతోష్ కుమార్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుండగా, లిఖిత్ పట్టణంలోని ఓ ప్రయివేట్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు

రూ.70 కోట్లతో ఉడాయించిన తాపీ మేస్త్రి..!

- చిట్టీలు, అధిక వడ్డీ పేరుతో దందా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిట్టీ ఫైనాన్స్, అధిక వడ్డీ పేరుతో జనం నుంచి డబ్బులు కట్టించుకుని రూ.70 కోట్లతో ఓ వ్యక్తి కనిపించకుండా పోయారు. ఈ సంఘటన ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుత్తికి చెందిన పుల్లయ్య 20 ఏళ్లుగా భవన నిర్మాణ మేస్త్రీగా పని చేస్తూ హైదరాబాద్‌లోని ఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉన్నాడు. పరిసర ప్రాంతాల్లో మేస్త్రీగా పరిచయాలు పెరిగాయి. ఆ పరిచయాలతోనే 15 ఏళ్లుగా చిట్టీ ఫైనాన్స్ వ్యాపారాన్ని బికె గూడ, ఎస్ఆర్ నగర్‌లో నిర్వహించాడు. అధిక వడ్డీ పేరు చెప్పి దాదాపు 300 మందితో చిట్టీలు, ఫైనాన్స్ నడిపినట్టు తెలిసింది. అలా దాదాపు రూ.70 కోట్లతో ఉడాయించినట్టు సమాచారం. బాధితుల నుంచి డబ్బుల కోసం ఒత్తిడి పెరగడంతో పుల్లయ్య ఈ నెల చివరి వారంలో చెల్లిస్తానని చెప్పాడు. కానీ, 23వ తేదీనే ఓ క్యాబ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిపోయినట్టు సమాచారం. ఈ విషయం తెలుసుకొని బాధితులు గగ్గోలు పెడుతూ బికె గూడలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఎస్ఆర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారని తెలిసింది. ఇంతవరకు తమకు ఈ విషయమై ఎటువంటి ఫిర్యాదూ అందలేదని ఎస్ఆర్ నగర్ పోలీసులు చెబుతున్నారు.

కూటమికి మద్దతివ్వడం లేదు

- సిద్ధిక్‌తో మాకు సంబంధం లేదు
- నిరుద్యోగుల ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ, జెఎసి పేరును వాడుకుంటూ మోసగిస్తున్న షేక్ సిద్ధిక్‌కు, తమకు సంబంధం లేదని నిరుద్యోగులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు షేక్ సిద్ధిక్ మద్దతు తెలపడాన్ని ఖండిస్తూ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులు (ఎం నాగార్జున, ఎన్ రాజీవ్‌కుమార్), లైబ్రేరియన్ అభ్యర్థులు (జి శ్రీధర్, కె జగదీశ్), డిఎస్‌సి అభ్యర్థులు (ఎం సురేష్, ఎస్‌సి ప్రవీణ, రఘు), ఎహెచ్ఎ అభ్యర్థులు (ఎస్ రఫీ, హరికృష్ణ), గ్రూప్స్ అభ్యర్థులు (ఎస్ శివ, ఎం నాని) బుధవారం ఉమ్మడిగా ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్-2 నోటిఫికేషన్ కోసం పెద్దఎత్తున పోరాడింది నిరుద్యోగులేనని, వారికి అండగా ఉన్నది యువజన, విద్యార్థి సంఘాలు అని గుర్తుచేశారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష వాయిదా కోసం నిరుద్యోగులు పెద్దఎత్తున పోరాడితే కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని విమర్శించారు. పైగా చివరి క్షణం వరకూ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులు, రాష్ట్రప్రభుత్వ పెద్దలు వీడియోలు లీక్ చేసి హైడ్రామా నడిపారని పేర్కొన్నారు. గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల వాయిదా కోసం పోరాడిన డివైఎఫ్ఐ నాయకులను, నిరుద్యోగులను విజయనగరం, విశాఖపట్నం, కడప జిల్లాల్లో అర్ధరాత్రి అరెస్టు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం మెగా డిఎస్‌సి పేరు చెప్పి ఎనిమిది నెలలు గడిపేసిందని, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని విమర్శించారు.

పోలీస్ కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో వయసు, ఎత్తు సమస్యతోపాటు, హోంగార్డు రిజర్వేషన్లు తగ్గించి నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వాలని కోరారు. వయోపరిమితి పెంచి ఖాళీగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. లైబ్రేరియన్, జెఎల్, డిఎల్, పిఎల్, యానిమల్ హస్బండరీ అసిస్టెంట్ పోస్టులతో సహా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా నిరుద్యోగ భృతి జాడ లేదని పేర్కొన్నారు. ఆప్కాస్ రద్దు చేసి వేల మంది ఉద్యోగుల భవిష్యత్తు అంధకారం చేయనుందని ఆందోళన వ్యక్తం చేశారు. షేక్ సిద్ధిక్ నిరుద్యోగుల పక్షాన నిలబడకుండా తన రాజకీయ భవిష్యత్తు కోసం ప్రభుత్వానికి వత్తాసు పలకడం అన్యాయమని తెలిపారు. నీతి నిజాయితీగా పనిచేసే వారికి, నిరుద్యోగ సమస్యలపై అవగాహన ఉండి పోరాడే వారికి, పార్టీలు మారకుండా, సొంత వ్యాపారాలు లేకుండా, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించేవారికి, ప్రశ్నించేవారికే తమ మద్దతు అని వెల్లడించారు.

'శివరాత్రి' విషాదం

(మొదటి పేజీ తరువాయి)

లింగపాలెం మండలం తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన మునియా (24) మారేషు (22) గల్లంతయ్యారు. వారి మృతదేహాలను పోలీసులు, ఫైర్ సిబ్బంది వెలికితీశారు. శ్రీశైలం మల్లన్న దర్శనానికి వచ్చిన ఎన్‌టిఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం కొలిక్కి కొల్ల గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు గురవయ్య (33), వాసు (11) శ్రీశైలం డ్యాం వద్ద కృష్ణా నదిలో స్నానానికి దిగి నీటమునిగి మృతి చెందారు. ముందుగా కుమారుడు ఈతరాక నీటి మునిగిపోయాడు. కుమారుడిని కాపాడబోయిన తండ్రి కూడా మునిగిపోయారు. వీరిద్దరూ శివ మాలలో ఉన్నారు. సంఘటన స్థలం తెలంగాణ పరిధిలోకి రావడంతో అక్కడి పోలీసులకు పెనుగంచిప్రోలు పోలీసులు ఈ సమాచారం తెలియజేశారు.

చెరువులో ఇద్దరు గల్లంతు

ఏలూరు నగరంలోని మూడో పట్టణ పరిధి వట్లూరు గ్రామానికి చెందిన బజ్జవరపు వెంకటేశ్వరరావు స్నానం చేసేందుకు స్థానికంగా ఉన్న చెరువులోకి దిగి ఊబిలో ఇరుక్కుపోయారు. ఇది గమనించిన ఆయన అన్నయ్య కుమారుడు సుబ్రమణ్యం తన బాబాయ్‌ను కాపాడేందుకు చెరువులోకి దిగారు. ఇద్దరు చెరువులో గల్లంతయ్యారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అంతర్జాతీయ నిపుణులతో సహాయక చర్యలు

- ప్రమాద స్థలానికి 15 కిలోమీటర్ల దూరంలో రెస్క్యూ టీమ్‌లు
- గ్యాస్ కట్టర్‌తో డ్రిల్లింగ్ మిషన్ తొలగింపు
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అంతర్జాతీయ నిపుణులతో సహాయక చర్యలు చేపట్టినట్టు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఘటనా స్థలంలో బుధవారం ఉదయం పనులను మంత్రులు పర్యవేక్షించారు. అనంతరం అధికారులు, నిపుణులు, సహాయక బృందాల ప్రతినిధులతో సమీక్షించారు. ఆ తర్వాత ఎస్ఎల్‌బిసి క్యాంప్ కార్యాలయం దగ్గర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి, జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎంతటి ఉన్నత స్థాయి పరిజ్ఞానాన్ని అయినా ఉపయోగించి సొరంగంలో చిక్కుకున్న వారిని బయటకు తీసుకురావాలన్న ముఖ్యమంత్రి ఆదేశానుసారం న్యూఢిల్లీలోని బోర్డర్స్ రోడ్స్ ఆర్గనైజేషన్, టన్నెల్ వర్క్స్‌లో నిష్ణాతులైన వారిని పిలిపించామని మంత్రి ఉత్తమ్..చెప్పారు. రెస్క్యూ టీమ్‌లు నిరంతరం తీవ్రంగా శ్రమిస్తున్నాయన్నారు. తోడిన కొద్దీ మట్టి, నీరు ఉబికి వస్తుండటంతో సహాయక పనులు ముందుకు సాగడం లేదన్నారు. మట్టి దిబ్బలు, రాళ్లు పడి బోరింగ్ మిషన్ పూర్తిగా దెబ్బ తిన్నదని, దీనిని బయటకు తెస్తేనే కార్మికులను కాపాడే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గ్యాస్ కట్టర్‌తో బోరింగ్ మిషన్‌ను ముక్కలు చేసి బయటికి పంపాల్సి ఉంటుందని, ఈ పని చేయడానికి రెస్క్యూ టీమ్‌కు కొంత సమయం పడుతుందన్నారు. రెండ్రోజుల్లో ఆపరేషన్‌ను విజయవతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని, నిపుణులు కూడా సొరంగంలో అత్యంత ప్రమాదకరమైన స్థలంలో పనులు చేస్తున్నారని చెప్పారు. బోరింగ్ మిషన్‌ను పగలగొట్టడానికి రేపటి నుంచి పని వేగవంతం చేస్తామన్నారు. జాతీయ, అంతర్జాతీయంగా వివిధ ప్రాంతాల్లో సొరంగ ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించారో.. వారి సహాయ సహకారాలతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ ప్రమాదం నుంచి గట్టెక్కే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటికే రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్లతో, నేవీ అధికారులతో చర్చలు జరిపి ఉన్నతమైన విధానం ద్వారా సొరంగం నుంచి కార్మికులను వెలికి తీసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ముందుగా డీ వాటరింగ్ చేసి తర్వాత మట్టిని తొలగించి బోరింగ్ మిషన్‌ను ముక్కలుగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఘటన స్థలానికి 15 మీటర్ల దూరంలో రెస్క్యూ టీమ్ ఉందని, ఇప్పుడే అత్యంత జాగ్రత్తగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. టన్నెల్‌లో ఉన్న నీటిని భారీ పంపులతో బయటికి పంపడం, బురదను తొలగించడం ద్వారా డిబిఎం ముందుభాగానికి చేరుకోనున్నట్టు చెప్పారు. ఈ సహాయక చర్యల్లో దేశంలోని మైనింగ్ రెస్క్యూ సిబ్బంది, ఇండియా బోర్డర్స్ ఆర్గనైజేషన్ సేవలను వినియోగించుకుంటున్నట్టు తెలిపారు. ఆర్మీ, నేవీ, ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ ర్యాట్ మైనర్ సేవలను వినియోగించుకొని పూర్తి ప్రణాళికతో రెండ్రోజుల్లో ఆపరేషన్ పూర్తి చేసేందుకు సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు రోజులుగా సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతోందని, అన్ని వ్యవస్థలనూ ఇక్కడే కేంద్రకరింపజేసి పనిచేస్తున్నట్టు వివరించారు. ఇండియన్ మెరైన్ కమాండో ఫోర్స్ (మార్కోస్ టీమ్)బలగాలు కూడా రంగంలోకి దిగాయని తెలిపారు. తద్వారా సానుకూలంగా పరిణామాలు మారవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రమాద ప్రదేశంలో నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్న జిల్లా యంత్రాంగాన్ని, కలెక్టర్‌ను, ఎస్‌పిని మంత్రులు అభినందించారు.



రెస్క్యూటీమ్స్‌తో సమీక్షిస్తున్న మంత్రి, కోమటిరెడ్డి

ప్రభుత్వ వైఫల్యం వల్లే సొరంగం కూలిందని ప్రతిపక్షాలు విమర్శలు చేయడం తగదన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ ఎలా కూలిందో రాష్ట్ర ప్రజలకు తెలుసునని అన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు పూర్తిగా దిగజారుడుగా ఉన్నాయని విమర్శించారు. సమీక్ష సమావేశంలో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్‌పి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, టీఎస్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషరఫ్ అలీ, ఢిల్లీ నుంచి వచ్చిన ఆర్మీ అధికారులు కల్నల్ బ్లాక్ స్మిత్ మెహ్రా, లెఫ్టినెంట్ కల్నల్ హర్పల్, ఎన్‌డిఆర్ఎఫ్ డిఐజి మోహ్సిన్ షహది, ఎన్‌డిఆర్ఎఫ్ కమాండెంట్ ప్రసన్న, నేవీ అధికారి వికె.ప్రసాద్, రాబిన్సన్ టన్నెల్ అధికారి గ్లెన్, ర్యాట్ మైనర్స్ బృందం ప్రతినిధి ఫిరోజ్ కురేషి పాల్గొన్నారు.



కోటప్పకొండలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

పాలకులు మారినా తగ్గని యాప్‌ల భారం

(మొదటి పేజీ తరువాయి)

చేయాల్సిరావడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బాత్‌రూమ్‌లను ఫొటో తీయడాన్ని నిషేధించింది. దాని స్థానంలో గూగుల్ ఫాం పేరుతో 10 రకాల పనులను అదనంగా ప్రవేశపెట్టింది. దీంతో పాఠశాల మొదలైన నుంచి యాప్‌ల నిర్వహణకే సమయం సరిపోతుందే తప్ప బోధనకు సమయం ఉండటం లేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌ల గోల తగ్గించాలని ఎనిమిదేళ్ల నుంచి ప్రభుత్వం దృష్టికి పలుమారు ఉపాధ్యాయ సంఘాలు తీసుకొచ్చాయి. ఉన్నవాటిని తొలగించకపోగా ప్రతి ఏటా కొత్త యాప్‌లను విద్యాశాఖ రూపొందిస్తుండటాన్ని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఎక్కడ దొరుకుతారా? ఎలాంటి చర్యలు తీసుకుందామనే ఆలోచనతో ప్రభుత్వ తీరు కనపడుతోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేసి సెల్‌ఫోన్ లేని బడిగా ఉంచితేనే నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, పరీక్ష మార్కుల అప్‌లోడ్ తప్ప మిగిలిన పనులు అప్పగించకూడదని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పెరుగుతున్న ఒత్తిడి

వివిధ పథకాల అమలుకోసం ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ కూడా వారిపై ఒత్తిడి పెంచుతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. సమన్వయం లేకపోవడమే దీనికి కారణం. పాఠశాల విద్య, సమగ్ర శిక్ష, ఎస్‌సిఇఆర్‌టి మధ్య ఏ మాత్రం సమన్వయం ఉండటం లేదని ఉపధ్యాయులు చెబుతున్నారు. ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ పేర్లతో ఉపాధ్యాయులు, లీడర్ షిప్ ట్రైనింగ్ పేరుతో ప్రధానోపాధ్యాయులకు నిర్బంధ శిక్షణ ఇచ్చారు. దీనివల్ల ఉపాధ్యాయులు చాలా మంది ఇబ్బందిపడ్డారు. లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఏలూరులో నవంబర్‌లో నిర్వహించిన రెసిడెన్షియల్ శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయుడు రత్నాకర్ మరణించారు. ప్రతి మూడో శనివారం కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. మధ్యాహ్నం పూట విద్యార్థులను ఇళ్లకు పంపించి మరీ ఈ సమావేశాలను నిర్వహిస్తోంది.

ట్రంప్ తొలి కేబినెట్ భేటీ

- ఎలాన్ మస్క్ హాజరు

వాషింగ్టన్ : రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ తొలిసారి కేబినెట్ సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి ప్రపంచ కుబేరుడు, డోజ్ బాధ్యతలు చూస్తున్న ఎలాన్ మస్క్ సైతం హాజరయ్యారు. మస్క్‌కు ఎలాంటి మంత్రిత్వ శాఖ లేదా నిర్ణయాలు తీసుకునే అధికారం లేకపోయినప్పటికీ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రత్యేక ఉద్యోగి, అధ్యక్షుడికి సీనియర్ సలహాదారు హోదాలో మస్క్ ఈ భేటీలో పాల్గొన్నట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. డోజ్‌కు నేతృత్వం వహిస్తున్న మస్క్.. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఫెడరల్ ఉద్యోగులకు హెచ్చరికలు సైతం జారీ చేశారు. ఉద్యోగులు తమ పనిపై వివరణ ఇవ్వాలని మెయిల్స్ పంపి గడువు విధించారు. మరోవైపు మస్క్ నిర్ణయాలను ట్రంప్ సమర్థిస్తున్నారు. అధికారులు మస్క్ మెయిల్‌కు వివరణ ఇవ్వకుంటే పాక్షికంగాగానీ, పూర్తిగాగానీ ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ట్రంప్ పేర్కొన్నారు.

ముందంజలో పిడిఎఫ్

(మొదటి పేజీ తరువాయి)

కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రంగంలోకి దిగి పరీక్ష వాయిదా వేయించానని, ముఖ్యమంత్రి, లోకేష్‌ను సైతం సోషల్ మీడియాలోకి లాగారు. ఇది గ్రూపు-2 అభ్యర్థుల్లో కలకలానికి కారణమైంది. నిరుద్యోగ భృతి హామీపై స్పష్టత లేదు. ప్రత్యేక హోదా వస్తే యువతకు ఉద్యోగాలొస్తాయని ఆశపెట్టి, ఇప్పుడు మౌనంగా ఉండటం పట్ల కూటమి ప్రభుత్వంపై యువతలో అసహనం వ్యక్తమవుతోంది.

కూటమిలో అనైక్యత

అధికార కూటమి పార్టీల మధ్య ఎంఎల్‌సి ఎన్నికల్లో అనైక్యత కనిపిస్తోంది. కొన్ని చోట్ల ఒక పార్టీ ఒకరికి మద్దతిస్తే మరో పార్టీ ఇంకొకరిని బలపరిచిన ఉదంతాలు నెలకొన్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల టీచర్స్ నియోజకవర్గంలో ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న అభ్యర్థికి బిజెపి మద్దతిస్తోంది. అక్కడే వేరొకరికి టిడిపి జైకొట్టింది. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా-గుంటూరు పట్టబద్రుల స్థానాల్లో కూడా ఇలాంటివే కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల కూటమి పార్టీల మధ్య తగాదాలే కాదు, టిడిపిలో స్థానికంగా ఉన్న ముఠాలు అధిష్టానం బలపర్చి నిలబెట్టిన అభ్యర్థుల విజయం కోసం పని చేయట్లేదు. ఎంఎల్ఎలు, మంత్రులు, ముఖ్య నేతలు వచ్చిన సందర్భాల్లోనూ క్షేత్ర స్థాయి శ్రేణులు దూరంగా ఉంటున్నాయి.

అధికార దుర్వినియోగం

కొన్ని గంటల్లో పోలింగ్ ఉందనగా అధికార దుర్వినియోగానికి, ప్రలోభాలకు, కోడ్ ఉల్లంఘనలకు కూటమి అభ్యర్థులు ఒడిగడుతున్నారు. గుంటూరులో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు చెందిన ఎన్ఆర్ఐ, కిట్స్ విద్యాసంస్థల సిబ్బంది పోలింగ్ బూత్‌ల వద్ద తిష్టవేసి ల్యాప్‌టాప్‌లతో హెల్ప్ డెస్క్‌లు పెట్టి నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తుండగా ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. చాలా చోట్ల తమకు ఓట్లు వేయాలని అధికారపార్టీ ఎంఎల్ఎలు, మంత్రులు, నాయకులు ఓటర్లను బెదిరిస్తున్నారు. ఉత్తరాంధ్రలో పోలింగ్ కేంద్రాల్లోకి అధికార కూటమి నాయకులు, కార్యకర్తలు అక్రమంగా వెళ్లే అవకాశాలున్నందున, చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారికి, ఇసికి పిడిఎఫ్ ఫిర్యాదు చేసింది. కూటమి అధికార దుర్వినియోగం, కోడ్ ఉల్లంఘనలు, ప్రలోభాలు, బెదిరింపులు, హామీలు అటకెక్కించడం వంటివి ఓటర్ల ఆగ్రహాన్ని మరింత పెంచుతున్నాయి.

కిటకిటలాడిన శైవక్షేత్రాలు

(మొదటి పేజీ తరువాయి)



కోటప్ప కొండకు బయలుదేరిన ప్రభ

వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. కాలినడకన వచ్చే వారు ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి బైర్లూటి, నాగలూటి, పెచ్చెరువు, భీముని కొలను మీదుగా ఆలయానికి చేరుకున్నారు. 11 రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు బుధవారం శ్రీస్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ప్రభోత్సవం, నంది వాహన సేవ, లింగోద్భవకాల మహారుద్రాభిషేకం, పాగాలంకరణ, ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం వంటి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుపతి శ్రీకాహస్తీశ్వర ఆయలంలో వాయులింగేశ్వరుడి రూపంలో శివుడిని అలంకరించారు. ఉదయం ఐదు గంటల నుంచి 10.30 గంటల మధ్య స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించారు. స్వర్ణముఖినదిలో యాత్రికులు స్నానాలు ఆచరించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని కోటప్పకొండ తిరుణాళ్లలో అపశృతి చోటు చేసుకుంది. శాంతి భద్రతలు పర్యవేక్షణ కొరకు పోలీసులు ఉపయోగించిన డ్రోన్‌లో సాంకేతిక సమస్యతో కొండపైన ఉన్న అల్పాహారశాలపైగా వెళుతున్న విద్యుత్ తీగలకు చిక్కుకుంది. దీంతో ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి. పెద్ద శబ్దం రావడంతో భోజనశాలలోని యాత్రికులు భయంతో ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. పోలీసులు తక్షణం స్పందించి యాత్రికులకు భద్రత కల్పించారు.

'ఉక్కు' జోలికొస్తే ఊరుకోం

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తే ఊరుకునేది లేదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1476వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, పలు విభాగాల ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికుల పట్ల స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. తీరు మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సొంత గనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో కర్మాగారాన్ని నడిపితే లాభాల బాట పడుతుందని తెలిపారు.

బడ్జెట్‌లో చేనేతకు రూ. రెండు వేల కోట్లు

- ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఈ నెల 28న ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత కార్మికులకు రూ. రెండు వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శివదుర్గారావు, పి. బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాలకుల విధానాలతో చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతోందని విమర్శించారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని, రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని కోరారు. 200 యూనిట్ల ఉచిత కరెంటుకు వెంటనే జిఒ విడుదల చేయాలని, సహకార సంఘాలకు చెల్లించాల్సిన యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ రిబేటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 30 శాతం రిబేటు సంవత్సరం మొత్తం కొనసాగించాలని, మగ్గం నేస్తున్న ప్రతి చేనేత కార్మికునికి 'నేతన్న నేస్తం' ఇవ్వాలని, బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలని, వెల్ఫేర్ ఫండ్ బోర్డు ఏర్పాటు చేసి సహకార సంఘాల అప్పులు రద్దు చేయాలని కోరారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సాగునీటి వనరుల అభివృద్ధికి

రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-కడప అర్బన్

సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని, రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి బడ్జెట్లో పది శాతం నిధులు కేటాయించాలని, ప్రాజెక్టులకు నిధులు, నికర జలాలు కేటాయించాలని, నిర్మాణంలో ప్రభుత్వ అలసత్వాన్ని వీడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. కడప ప్రెస్‌క్లబ్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించాలని బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్ మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ భాషా ప్రయుక్త రాష్ట్రంగా విడిపోవడానికి తెలుగు ప్రాంత అభివృద్ధి నిర్లక్ష్యం కారణమన్నారు. మరోమారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పడడానికి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విస్మరించడమే కారణమని చరిత్ర హెచ్చరిస్తోన్న పాలకులు, ప్రభు త్వాలు పట్టించుకోకుండా, అభివృద్ధి వికేంద్రీకరణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. 48 సంవత్సరాలుగా రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికి, రిజర్వాయర్ల పంట కాలవలు, పిల్ల కాలువలు పూర్తికి శ్రద్ధపెట్టడంలేదని తెలిపారు. రాయలసీమలో రాష్ట్ర జనాభాలో 30 శాతం జనసాంద్రత కలిగి ఉందని, 36 శాతం వ్యవసాయానికి అనుకూలంగా భూమి ఉందని, కానీ ఏడు శాతం భూమికి మాత్రమే నీరు అందు తోందని ప్రభుత్వ లెక్కలు తెలుపుతున్నాయన్నారు. ఈ సమస్య



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్

పరిష్కారానికి పాలక ప్రభుత్వాలు రాష్ట్ర బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి మాట్లాడుతూ జిల్లాలో 3.03 లక్షల ఎకరాలు సాగుకు అవకాశం ఉందని తెలిపారు.

కేవలం లక్ష ఎకరాలు మాత్రమే సాగవుతోందని, ఇది ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర మాట్లాడుతూ గాలేరు-నగరి, హంద్రీ నీవా ప్రాజెక్టులు ప్రభుత్వాలు పూర్తి చేయడానికి 30 ఏళ్లుగా అటవీశాఖ క్లియరెన్స్ తీసుకుని రాకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. సిపిఐ (ఎంఎల్ లిబరేషన్) సమన్వయకర్త బి ఓబయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో విదేశీ దిగుమతులకు రాయితీలిస్తూ స్వదేశీ దిగుమతులను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు బి నారాయణ మాట్లాడుతూ రాయలసీమ, ఉత్తరాంధ్ర డెల్టాలోనూ మెట్ట ప్రాంతాలలో నీటిపారుదల సౌకర్యాలు లేక వెనుకబాటుత నానికి గురవుతున్నాయని అన్నారు. హేతువాద సంఘం జిల్లా నాయకులు సిఆర్‌వి ప్రసాద్, బిఎస్‌పి జిల్లా నాయకులు ఎస్ గుర్రప్ప, లోక్‌సత్తా నాయకులు కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, ముస్లిం జెఎసి నాయకులు బాబుభాయ్ మాట్లాడారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ రామ్మోహన్, బి మనోహర్, వి అన్వేష్ పాల్గొన్నారు.

యుజిసి ప్రతిపాదనలకు వ్యతిరేకంగా తీర్మానం

- విసి నియామకాలపై ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశ్వవిద్యాలయాల్లో వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ప్రతిపాదనలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎ అశోక్, కె ప్రసన్నకుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నత విద్యలో ప్రమాణాల పరిరక్షణ పేరుతో జనవరి 6వ తేదీన యుజిసి ముసాయిదా డ్రాఫ్ట్‌ను విడుదల చేసిందని తెలిపారు. నేటి వరకూ విసి నియామకాలకు రాష్ట్రప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉన్నాయని, ఇప్పుడు సవరించడం ద్వారా రాష్ట్ర గవర్నర్లకు ఎక్కువ అధికారాలను ఇస్తున్నారని పేర్కొన్నారు. తాజా ప్రతిపాదనలు రాష్ట్రాల పాత్రను నామమాత్రం చేస్తున్నాయని విమర్శించారు. నియామకాల్లో నాన్ అకడమిక్ వ్యక్తులను నియమించాలని ముసాయిదా సిఫార్సు చేస్తుందని పేర్కొన్నారు. పరిశ్రమలు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ప్రభుత్వ విధానాల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో కనీసం పదేళ్ల అనుభవం ఉంటే సరిపోతుందని ప్రతిపాదిస్తుందని తెలిపారు. ఈ నూతన ప్రతిపాదనల్లో రిజర్వేషన్ల అంశాన్ని పూర్తిగా మరిచారని పేర్కొన్నారు. 55 శాతం మార్కులతో మాస్టర్స్ సాధించిన వారిని యుజిసి నెట్‌లో అర్హత సాధించకపోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నేరుగా నియమించుకోవచ్చని తెలిపారు. మాస్టర్స్ చేసిన వారికి సంబంధిత సబ్జెక్టుల్లో ఎంతమేరకు విషయ అవగాహన ఉంటుందో ప్రశ్నార్థకమేనని పేర్కొన్నారు.

దీంతో బోధనా ప్రమాణాలు తగ్గుతాయని, ఈ ముసాయిదా పూర్తిగా యూనివర్సిటీలను నిర్వీర్యం చేసేవిధంగానూ, కేంద్రీకరణ, ప్రైవేటీకరణ వైపుగా అడుగులు వేయించే విధంగానూ ఉందని భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యను, నిర్ణయాధికారాన్ని ఈ ముసాయిదా బలహీనపరుస్తుందని పేర్కొన్నారు. ఇది పూర్తిగా ఫెడరల్ స్ఫూర్తిని ఉల్లంఘిస్తూ రాజ్యాంగ మూలసూత్రాలను బలహీనపరుస్తున్నదని తెలిపారు. రాష్ట్రాల నిధులతో అభివృద్ధి చెందే యూనివర్సిటీల్లో కేంద్రం పెత్తనం తగదని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల అసెంబ్లీలు తీర్మానించాయని వివరించారు. రాష్ట్ర అసెంబ్లీ కూడా యుజిసి ముసాయిదాను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి ఉన్నత విద్యను కాపాడేందుకు దోహదపడాలని కోరారు.



విరాళాన్ని అడిషనల్ ఇఒకు అందిస్తున్న దాతలు

టిటిడి ప్రాణదాన ట్రస్టుకు రూ.81 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి ప్రాణదాన ట్రస్టుకు బుధవారం రూ.81 లక్షలు విరాళంగా అందాయి. చెన్నైకు చెందిన యాక్సెస్ హెల్త్ కేర్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ టిటిడి ఎస్‌వి ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.70 లక్షలు, వర ఫ్యూచర్ ఎల్‌ఎల్‌పీ సంస్థ రూ.11 లక్షలు విరాళంగా అందించాయి. ఈ మేరకు దాతలు చెక్కులను టిటిడి అడిషనల్ ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరికి తిరుమలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అదనపు ఇఒ అభినందించారు.

అధికార దుర్వినియోగాన్ని అరికట్టండి

- ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఆర్‌ఒకు అజశర్మ లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న ఎన్నికల్లో అధికార పార్టీ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, ఎన్నికలను నిష్పక్షపాతంగా జరపాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి హరేంధిర ప్రసాద్‌ను పిడిఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి ఎన్నికల ఏజెంట్ ఎ.అజశర్మ కోరారు. ఈ మేరకు ఆయన ఆర్‌ఒకు ఓ లేఖ రాశారు. దానిని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఆన్‌లైన్‌లో పంపారు. లేఖలోని వివరాలను బుధవారం మీడియాకు అజశర్మ వివరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో అధికార పార్టీ శాసన సభ్యుల అధికార దుర్వినియోగంపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. గురువారం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కొన్ని చోట్ల రాష్ట్ర మంత్రులు కూడా ఓటర్లపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆర్‌ఒ జోక్యం చేసుకుని నిష్పక్షపాతంగా ఎన్నికలు సాగేలా చూడాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకూ తావివ్వకుండా చర్యలు చేపట్టాలని కోరారు. పోలింగ్ స్టేషన్లలోకి అధికార పార్టీకి చెందిన వారు ప్రవేశించి, ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. అందువల్ల పోలింగ్ బూత్‌ల్లోకి పోలింగ్ సిబ్బంది, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్లు, అభ్యర్థులు, వారి ఎన్నికల ఏజెంట్లు, ఒక్కొక్క ఓటరు మినహా ఎవరినీ అనుమతించరాదని విజ్ఞప్తి చేశారు. ఆ విధంగా ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు, పోలీసు సిబ్బందికి తగు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

పేదలకు అందుబాటులో కంటి వైద్యం

- కంటి ఆస్పత్రి ప్రారంభోత్సవంలో జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్



కంటి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

పేదలకు అందుబాటులో కంటి వైద్యం అందించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్‌ఆర్ జిల్లా పులివెందుల లోని వైఎస్ రాజారెడ్డి ఆస్పత్రి స్థానంలో నూతనంగా నిర్మించిన రాజారెడ్డి ఐ ఇనిస్టిట్యూట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఆస్పత్రిలోని మొత్తం ఏర్పాట్లను పరిశీలించారు. కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పులివెందులలో కొన్ని దశాబ్దాలుగా రాజారెడ్డి ఆస్పత్రి సేవలు అందిస్తోందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ఆస్పత్రిలో పనిచేస్తూ రూపాయి వైద్యుడిగా పేరు తెచ్చుకున్నారని గుర్తుచేశారు. ఈ ఆస్పత్రిని ఇప్పుడు అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారని వివరించారు. ప్రముఖ ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, వైఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆస్పత్రిని అధునీకరించారని తెలిపారు. తక్కువ ఖర్చుతో అత్యాధునిక సౌకర్యాలతో ఇక నుంచి రాజారెడ్డి ఆస్పత్రిలో కంటి వైద్య సేవలు అందుతాయన్నారు. పులివెందుల నియోజకవర్గంలో కంటికి సంబంధించి ఆధునికమైన ఆస్పత్రి లేకపోవడంతో రాజారెడ్డి జ్ఞాపకార్థం ఆ స్థలంలో ఆస్పత్రిని నిర్మించి పేద ప్రజలకు అందించాలని ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. ఆస్పత్రి ఎండి నాగేశ్వరరావుతో పేదలకు అందించే వైద్యసేవలపై చర్చించారు. జగన్ రెండ్రోజుల పర్యటన ముగించుకొని బుధవారం ఉదయం 11 గంటలకు పులివెందుల నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్ కుమార్‌రెడ్డి, ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రి వైస్ ఛైర్మన్ డాక్టర్ రాజా, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, వైసిపి నాయకులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు తిరుపతి ఎయిర్‌పోర్టు

- అదానికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధం!
- వచ్చే ఏడాది మార్చిలోపు ప్రక్రియ పూర్తి?

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసిన తిరుపతి విమానాశ్రయాన్ని వచ్చే ఏడాది మార్చిలోపు ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. గత పరిణామాలను బట్టి చూస్తే ఈ ఎయిర్‌పోర్టుకు అదానికి కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనట్టు చర్చ జరుగుతోంది. దీంతో, ప్రత్యక్షంగా వెయ్యి మంది, పరోక్షంగా 500 మంది ఉద్యోగ భద్రత కోల్పోనున్నారు. తిరుమలకు దేశ, విదేశాల నుంచి యాత్రికులు వస్తున్నారు. వీరి కోసం 1971లో ఈ విమానాశ్రయాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. 1993లో కొత్త టెర్మినల్, రన్‌వే పనులను అప్పటి ప్రధానమంత్రి పివి నరసింహారావు ప్రారంభించారు. 1999లో అప్‌గ్రేడ్ అయ్యింది. 2017లో అంతర్జాతీయ విమానాశ్రయంగా గుర్తింపు లభించింది. దేశంలోని 13 విమానాశ్రయాలను 2026 మార్చికల్లా ప్రైవేట్‌కు అప్పగించేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా రంగం సిద్ధం చేసింది. దీనికి కేంద్ర కేబినెట్ కూడా ఇప్పటికే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.. మొత్తం 772 ఎకరాల్లో విస్తరించి ఉన్న తిరుపతి ఎయిర్‌పోర్టు కూడా ఇందులో ఉంది.



తాజాగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లోనూ 13 ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌కు అప్పగించడం ద్వారా పది లక్షల కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మొదటి విడతలో తిరుపతి, భువనేశ్వర్‌లోని విమానాశ్రయాలను ప్రైవేట్‌కు అప్పగించనున్నారు. అనంతరం ఔరంగబాద్, రాయపూర్, గయా, ఖుషినగర్, అమృత్‌సర్ ఎయిర్‌పోర్టులను ప్రైవేట్‌కు ఇచ్చేయనున్నారు.

పథకం ప్రకారం తొలి నుంచి నిర్వీర్యం

పేరుకే తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం. డైరెక్టర్ స్థాయి ఉన్న ఈ ఎయిర్‌పోర్టుకు ఆ క్యాడర్‌ను తగ్గించి మేనేజర్ స్థాయి క్యాడర్‌తో సరిపెట్టేశారు. అంతర్జాతీయ విమానాశ్రయంగా ప్రకటించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ విదేశాలకు ఇక్కడి నుంచే విమానాలు వెళతాయని, శ్రీవారి చెంత దేదీప్యమానంగా తిరుపతి విమానాశ్రయం విరాజిల్లుతుందని, ఇక విదేశాలకు విమానాలే విమానాలు అంటూ ఊదరగొట్టారు. అయితే, ఇప్పటికీ నేరుగా ఇక్కడి నుంచి విదేశాలకు ఒక్క విమానమూ వెళ్లడం లేదు.

అభివృద్ధి చేసి... బంగారం పళ్లెంలో పెట్టి...

ఈ విమానాశ్రయాన్ని 2022లో అదానికి అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. టెర్మినల్, రన్‌వే, ఇతరత్రా అభివృద్ధి పనులు పెండింగ్ ఉండడంతో అమ్మకం వాయిదా వేసింది. 2,300 మీటర్ల రన్‌వే గతంలో ఉండేది. మూడు ఎకరాల్లో గరుడ టెర్మినల్ ఉండేది. ప్రస్తుతం ఆరు ఎకరాలకు విస్తరించారు. రన్‌వే 3,200 మీటర్లకు పెంచి అతి పెద్దదిగా తీర్చిదిద్ది 2023లో ప్రారంభించారు.పూర్తి స్థాయిలో కేంద్ర నిధులతో రూ.370 కోట్లతో అభివృద్ధి చేసిన ఈ విమానాశ్రయాన్ని వచ్చే ఏడాది మార్చి కల్లా అదానికి అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

పెరిగిన విమానాల సంఖ్య

తిరుపతి ఎయిర్‌పోర్టుకు విమానాల ట్రాఫిక్ పెరిగింది. గతేడాది రోజూ ఏడు విమానాలు వచ్చి పోతుండేవి. ప్రస్తుతం 16 విమానాలకు ఈ సంఖ్య పెరిగింది. ఇండిగో, ఎయిర్ ఇండియా, స్పైస్‌జెట్, స్టార్ ఎయిర్, అలయన్స్ ఎయిర్‌కు చెందిన విమానాలు నడుస్తున్నాయి. ఢిల్లీ, హైదరాబాద్, ముంబయి, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం, సూరత్, బెల్‌గాం, గోవా, కొల్హాపూర్, నాగపూర్, గుల్బర్గ ప్రాంతాలకు ఇక్కడి నుంచి సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రోజూ ఐదారు వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.

బంగారానికి అధిక ధరల దెబ్బ

- సగానికి తగ్గిన దిగుమతులు..!
- బలహీన డిమాండ్ ప్రభావం

న్యూఢిల్లీ : పేద, సామాన్యులకు బంగారం ధరలు అందుబాటులో లేకుండా పోవడంతో పసిడికి డిమాండ్ పడిపోతోంది. దీంతో దిగుమతులు సగానికి తగ్గనున్నాయని రిపోర్టులు వస్తోన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో బంగారం దిగుమతులు 15 టన్నులకు పరిమితం కానుందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఏడాది క్రితం నాటి దిగుమతులతో పోల్చితే 85 శాతం క్షీణించి.. 20 ఏళ్ల నాటి కనిష్ట స్థాయికి పడిపోవచ్చని అంచనా వేసింది. ఈ ఏడాది జనవరిలోని 30-35 టన్నుల దిగుమతులతో పోల్చితే దాదాపుగా సగానికి క్షీణించొచ్చని విశ్లేషించింది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్‌లో సోమవారం ఔన్స్ ధర రికార్డ్ స్థాయిలో 2,956 డాలర్లకు ఎగిసింది. అధిక ధరల కారణంగా డిమాండ్ భారీగా తగ్గింది.

అమెరికా వాణిజ్య సుంకాల దాడికి తోడు ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఆందోళనలు బంగారం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. వీటికి



తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ భారీగా క్షీణించి పసిడి ధరలను ఎగిసిపడేలా చేస్తోన్నాయి. 2025 జనవరిలో బంగారం దిగుమతులు 30-35 టన్నులకు పడిపోయి.. ఆరు నెలల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత నెలలో డిమాండ్ మరింత సన్నగిల్లిందని రిద్ధిసిద్ధి బులియన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీరాజ్ కొఠారి పేర్కొన్నారు. దేశీయంగా డిమాండ్ తక్కువగా ఉండటం, రికార్డు స్థాయిలో పెరిగిన ధరల కారణంగా ఈ నెలలో బంగారం దిగుమతులు 50 శాతం తగ్గొచ్చన్నారు. దేశంలో వివాహాల సీజన్ కొనసాగుతున్నప్పటికీ డిమాండ్ తక్కువగానే ఉందన్నారు. ధరలు పెరగక ముందు కొన్ని బ్యాంక్‌లు దిగుమతి చేసుకున్న బంగారాన్ని తిరిగి అమెరికాకు పంపిస్తున్నాయన్నారు. దీంతో అధిక రాబడులను పొందుతున్నాయన్నారు. భారత్‌లోని ఆభరణాల తయారీదారుల కోసం టోకుగా ఒక్క ఔన్స్‌పై 23 డాలర్ల తగ్గింపును అందిస్తోన్నాయన్నారు.

గతేడాది దీర్ఘకాలంగా అస్థిరంగా ఉన్న ధరలు.. నవంబర్‌లో అకస్మాత్తుగా తగ్గినప్పటికీ.. తిరిగి ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత బంగారం ధరలకు రెక్కలు వచ్చాయి. ట్రంప్‌తో ప్రపంచ దేశాల్లో అనిశ్చిత్తి నెలకొనడంతో సురక్షిత పెట్టుబడి కోసం బంగారంపై సెంట్రల్ బ్యాంక్‌లు, బులియన్ వర్తకులు పెట్టుబడులు పెంచారు. దీంతో రెండు, మూడు నెలల్లోనే బంగారం ధరలు 14 శాతం మేర పెరిగాయి. దేశీయంగా బుధవారం 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.270 తగ్గి రూ.87,970 వద్ద నమోదయ్యింది. 22 క్యారెట్ల ధర రూ.250 తగ్గి రూ.80,650 వద్ద ముగిసింది. వచ్చే నెలలో 10 గ్రాముల ధర రూ.87,300 నుంచి 89,000 వరకు చేరొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ అనలిస్ట్-కమోడిటీ రీసెర్చ్ మానవ్ మోడీ తెలిపారు.

సమీప కాలంలో మార్కెట్లలో అస్థిరత..!

- పిఎల్ క్యాపిటల్ అంచనా

ముంబయి : భారత స్టాక్ మార్కెట్లు సమీప కాలంలో అస్థిరంగా ఉంటాయని ప్రముఖ ఫైనాన్సియల్ సర్వీసెస్ సంస్థ పిఎల్ క్యాపిటల్ ప్రభుదాస్ లీలాధర్ అంచనా వేసింది. గతేడాది డిసెంబర్‌తో ముగిసిన నాలుగో త్రైమాసికంలో సూచీలు స్థిరీకరణ స్థాయికి చేరాయని పేర్కొంది. భవిష్యత్తులో అధిక మూలధనం వ్యయం, పన్ను కోతలు, వినియోగదారుల డిమాండ్ పునరుద్ధరణ నేపథ్యంలో విదేశీ సంస్థాగత మదుపర్ల పెట్టుబడులు సానుకూలంగా మారే అవకాశం ఉందని విశ్లేషించింది. వచ్చే 12 నెలల్లో నిఫ్టీ 25,689కి చేరొచ్చని భావించింది. మంగళవారం నాటికి ఈ సూచీ 22,547కు పడిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు పెంచడం ద్వారా రూ.1 లక్ష కోట్లు వినిమయంలోకి రావొచ్చని తెలిపింది. పెంచిన ప్రభుత్వ వ్యయాలు మార్కెట్లకు మద్దతును అందించే అవకాశం ఉందని పేర్కొంది.

ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 20 శాతం వేతనం పెంపు

బెంగళూరు : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ తన ఉద్యోగులకు తీపికబురు అందించింది. అర్హులైన ఉద్యోగులకు వేతనాలు పెంచుతున్నట్లు తెలిపింది. ఉద్యోగులకు సగటున 5 నుంచి 8 శాతం వరకు జీతాన్ని పెంచినట్లు తెలుస్తోంది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు 20 శాతం వేతనాలు పెంచినట్లు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. ఉద్యోగులను మూడు విభాగాలుగా వర్గీకరించింది.. సంస్థ లక్ష్యాలను అందుకున్న వారికి 5-7 శాతం జీతాన్ని పెంచింది. అంతకంటే మెరుగ్గా పని చేసిన వాళ్లకు 7-10 శాతం, అత్యుత్తమ ప్రదర్శన చూపిన వారికి 10-20 శాతం వరకు వేతనం పెంచింది. మరోవైపు అతి తక్కువ పనితీరు కనబర్చిన ఉద్యోగులకు జీతాన్ని పెంచలేదని తెలుస్తోంది. నూతన వేతన పెంపు జనవరి ఒక్కటో తేది నుంచే అమల్లోకి వచ్చింది. చివరి సారిగా 2023 నవంబర్‌లో వేతన పెంపుదల చేసింది.

ఎంజి నుంచి కామెట్ బ్లాక్‌స్టార్మ్ ఎడిషన్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన కామెట్ విద్యుత్ కారును బ్లాక్‌స్టార్మ్ ఎడిషన్‌లో ఆవిష్కరించింది. ఈ నలుపు రంగు బుజ్జి కారు ఎక్స్ షోరూం ధరను రూ.7.8 లక్షలుగా నిర్ణయించింది. అయితే బ్యాటరీకి అదనంగా చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది.

కాగా బ్యాటరీ ధర ఎంతనేది స్పష్టం చేయలేదు. కామెట్ ఎగ్జిక్యూటివ్ వేరియంట్ ధర రూ.4.99 లక్షలతో (బ్యాటరీ రెంట్ అదనం) పోలిస్తే దీని ధర దాదాపు 2.8 లక్షలు ఎక్కువ.

కొత్త ఎంజి కామెట్ బ్లాక్‌స్టార్మ్ ఎడిషన్‌ను రూ.11,000తో బుకింగ్ చేసుకోవచ్చని ఆ కంపెనీ తెలిపింది. 55 రకాల కనెక్టెడ్ ఫీచర్లు కలిగిన ఈ కారు సింగిల్ ఛార్జీతో 230 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని పేర్కొంది.

రెండో రోజూ వంశీ విచారణ

ప్రజాశక్తి - విజయవాడ

గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను రెండో రోజు పోలీసు కస్టడీ బుధవారమూ కొనసాగింది. గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై దాడి, ఆ కార్యాలయంలో పనిచేసే సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో పోలీసులు ఆయనను విచారిస్తున్నారు. మూడు రోజులపాటు పోలీసు కస్టడీకి విజయవాడలోని ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టు అనుమతించడంతో విజయవాడ కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో వంశీతోపాటు మరో ఇద్దరు నిందితులు శివరామకృష్ణ ప్రసాద్, లక్ష్మీపతిని సుమారు ఐదు గంటలపాటు ముగ్గురు ఎసిపిలు వేర్వేరుగా విచారించినట్లు తెలిసింది.

సత్యవర్ధన్ కిడ్నాప్, బెదిరింపుల వెనుక ఎవరున్నారని పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. సాంకేతిక సాక్ష్యాల ఆధారంగా నిందితుల నుంచి సమాధానాలు రాబట్టేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. సత్యవర్ధన్‌ను హైదరాబాద్, విశాఖకు ఎవరు తీసుకెళ్లారని వంశీని ప్రశ్నించినట్లు సమాచారం. సుమారు 20 ప్రశ్నలను పోలీసులు సంధించినట్లు తెలిసింది. తనపై ఉన్న కేసులు తప్పుడువేనని వంశీ చెప్పినట్లు సమాచారం. తనపై పెట్టిన కేసులన్నీ ఆరోపణలేనని, వీటిని ఎందుకు పెడుతున్నారో అందరికీ తెలిసిందేనని చెప్పినట్లు తెలిసింది. అనంతరం వంశీకి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి విజయవాడ జైలుకు తరలించారు. తాజాగా గన్నవరంలో ఓ స్థలాన్ని వంశీ కబ్జా చేసినట్లు గన్నవరంలో పోలీసు స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు.

ప్రతిపక్ష గుర్తింపుపై నిరంకుశ వైఖరి వద్దు

- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు విషయంలో ప్రభుత్వం నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తోందని, అసెంబ్లీలో ప్రతిపక్షం లేకపోతే ఎలాగని వైసిపి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి క్యాంపు కార్యాలయంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం వస్తుందనే ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు కావాలని కోరుతున్నామని, దీనిని వక్రీకరించడం అన్యాయమని అన్నారు. ప్రజల గొంతుకగా నిలదీస్తారనే భయంతోనే ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తోందని, పదిశాతం సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్ష గుర్తింపు ఇవ్వాలని చట్టంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షమంటే రాజకీయపరమైన హోదాగా కూటమి పార్టీలు విషప్రచారం చేస్తున్నాయని తెలిపారు. ఎపి అసెంబ్లీలో నాలుగు పార్టీలు ఉంటే దానిలో మూడు పార్టీలు ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నాయని, మిగిలిన వైసిపిని ప్రతిపక్షంగా గుర్తించాల్సి ఉందని చెప్పారు. 1977 చట్టం ప్రకారం సభలో సభ్యుల సంఖ్యతో పనిలేకుండా ప్రధాన ప్రతిపక్షాన్ని గుర్తించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం దీన్ని ఏమాత్రమూ ఖాతరు చేయడం లేదని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి పార్టీలు అమలు చేయడం లేదని, దీన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా చేస్తున్నారని పేర్కొన్నారు.

ప్యూర్ ఇవిలపై రూ.40వేల క్యాష్ బ్యాక్

హైదరాబాద్ : ప్రముఖ ఇవి ద్విచక్ర వాహన కంపెనీల్లో ఒక్కటైన ప్యూర్ ఇవి సరికొత్త ఆఫర్‌ను ప్రకటించింది. తమ ఉత్పత్తుల అమ్మకాలను మరింత పెంచుకునేందుకు 'ప్యూర్ పర్ఫెక్ట్ 10' రెఫరల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. మార్చి 31 నాటికి లేదా సంబంధిత అవుట్‌లెట్లలో స్టాక్స్ ఉన్నంత వరకూ ప్యూర్ ఇవి వాహనాన్ని కొనుగోలు చేసే కొత్త వినియోగదారులకు కూడా ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ స్కీమ్ కింద కస్టమర్లు ఇవి వాహనాన్ని కొనుగోలు చేసి తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు రెఫర్ చేయడం ద్వారా రూ.40,000 వరకు క్యాష్ బ్యాక్ రివార్డులను పొందవచ్చని తెలిపింది.

సంపాదకీయం


కొర్రీల కేంద్రం!

పీకల్లోతు కష్టాల్లో ఉన్న మిర్చి రైతులను బేషరతుగా ఆదుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టడం క్రూరత్వమే! లక్షల రూపాయలు పెట్టుబడి పెడితేగాని మిర్చి సాగు సాధ్యం కాదు. నారు నాటినప్పటి నుండి పంట చేతికివచ్చేంతవరకు మిర్చి రైతుది దినదిన గండం బతుకే! చీడ, పీడలు, తెగుళ్ల బెడద ప్రతిరోజూ వెంటాడుతున్నది. వీటన్నింటిని అధిగమించి యార్డు దాకా తెచ్చిన సరుకుకు నామమాత్రపు ధర కూడా పలకకపోతే సాగు చేసిన రైతు పరిస్థితి ఏమిటి? దిక్కుతోచక ఆదుకోవాలని కోరితే, కేంద్ర ప్రభుత్వం పండిన పంటలో పావు వంతే కొంటామనడం ఏమిటి? మిగిలిన పంటను ఎవరికి అమ్ముకోవాలి? గత ఏడాది గరిష్టంగా క్వింటాకు 28 వేల రూపాయలు ధర పలికితే, ఇప్పుడు కేవలం 11,781 రూపాయల రేటు ఎలా నిర్ణయించారు. దీనికి ప్రాతిపదిక ఏమిటి? అది కూడా నెలరోజుల వరకే కొంటామని చెప్పడం ఏమిటి? ఒకసారి రైతు ఈ ధరకు పావు వంతు సరుకును అమ్మిన తరువాత మిగిలిన సరుకుకు ఎంత ధర పలుకుతుంది? ట్రేడర్లు ఎంతకు కొంటారు? అంతకన్నా తక్కువకే కదా! నెలరోజుల గడువు ముగిసిన తరువాత మార్కెట్‌కు వచ్చే సరుకు పరిస్థితి ఏమిటి? ఉదయం లేచింది మొదలు మార్కెట్ ఎకానమి సూత్రాలను వల్లించే కేంద్ర ప్రభుత్వ పెద్దలకు టోకు కోనుగోలుదారులు ఎలా స్పందిస్తారో, ఎందుకు స్పందిస్తారో తెలియదా? జోక్యం (ఇంటర్‌వెన్షన్) పేరిట కేంద్ర ప్రభుత్వం చేసిన ఈ విన్యాసం అంతిమంగా ట్రేడర్లకు లాభాల పంటను, రైతులకు నష్టాల మంటను మిగల్చడం కాదా? ఆర్థికంగా రాష్ట్రం అనేక కష్టాలు ఎదుర్కుంటుంటే వర్కింగ్ కేపిటల్‌ను ఏర్పాటు చేసుకోవాలనడం, ఖర్చులో సగభాగాన్ని రాష్ట్రమే భరించాలని కేంద్రం షరతులు పెట్టడం మరింత దుర్మార్గం. ఇంత నిర్దయగా కేంద్రం వ్యవహరించినా, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పెదవి విప్పడానికి సైతం సిద్ధపడకపోవడం బాధాకరం! తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదంతో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ తీరుతో పలువురు అవాక్కవుతున్న పరిస్థితి!

గుంటూరు మిర్చి యార్డు నుండి చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లకు మిర్చి ఎగుమతులు అత్యధికంగా జరుగుతాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం నుండి 1.79 లక్షల టన్నుల మిర్చిని చైనా దిగుమతి చేసుకుంది. వీటి విలువ 4,123 కోట్ల రూపాయలు! అయితే, అమెరికాతో అంటకాగే విధానాల్లో భాగంగా చైనాతో పాటు పలు ఇతర దేశాలకు చేసే ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టింది. ఫలితంగా ఎగుమతుల మార్కెట్ భారీ స్థాయిలో క్షీణించి, నిల్వలు పేరుకుపోయాయి. రైతాంగం ఆందోళన నేపథ్యంలో చైనాతో ఆర్డర్లను పునరుద్ధరించడానికి రాష్ట్ర మార్కెటింగ్ అధికారులు ప్రయత్నించినప్పటికీ కేంద్రం నుండి సానుకూల స్పందన రాలేదని చెబుతున్నారు. కృష్ణపట్నంలోని కంటైనర్ టెర్మినల్‌ను అదాని పోర్టు యాజమాన్యం చెన్నైకు తరలించడంతో ట్రేడర్లకు ఇబ్బందులు వచ్చాయని చెబుతున్నారు. నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఎవరి ప్రయోజనాలు ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు కదా! ఏకపక్షంగా కేంద్రం అనుసరిస్తున్న ఈ తరహా విధానాలు మిర్చి రైతాంగానికి పెనుశాపంగా మారాయి.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 11,781 రూపాయలను ప్రామాణికంగా తీసుకుని గత ఏడాది ధరలతో పోలిస్తే ఎకరాకు రెండు లక్షల రూపాయల నష్టం వస్తుందని రైతులు లెక్కలు వేసి చెబుతున్నారు. ఇంత ఘోరంగా పరిస్థితులు ఉంటే, రాష్ట్రంలో ఏ రైతు కూడా కష్టాల్లో లేరని ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలో గవర్నర్ చేత రాష్ట్ర ప్రభుత్వం చెప్పించడం మరీ దారుణం! ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులను ప్రభుత్వం గుర్తించాలి. తక్షణం నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దించి రైతాంగం కోరుతున్నట్లు క్వింటాకు కనీసం 20 వేల రూపాయల చొప్పున చెల్లించి, మొత్తం పంటను కొనుగోలు చేయాలి. అన్ని రకాల షరతులను ఎత్తివేయాలి. దీనికోసం అవసరమైతే కలిసివచ్చే శక్తులను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావాలి. పాలక కూటమికి రాజకీయంగా ఇబ్బంది అనుకుంటే రైతులను, అన్ని రాజకీయ పార్టీలను సమీకరించి కేంద్రం వద్దకు వెళ్లాలి. ఢిల్లీ పాలకుల మెడలు వంచి మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చూడాలి.

మహనీయుల మాట



కార్మిక వర్గం చేసే పోరాటాల విజయం అది సాధించే తక్షణ ఫలితాలలో లేదు. ఈ పోరాటాల క్రమంలో అది సాధించే అపూర్వ ఐక్యతే అతి గొప్ప విజయం.

- కార్ల్ మార్క్స్

Karl Marx

వెలుగొండ ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయాలి

సమస్య



ఎన్ఎస్‌పి రెండవ దశ ద్వారా 'మీ దశ తిరుగుతుందన్నారు'. అయితే తొలి దశకే నీళ్లు అందని పరిస్థితి నెలకొంది. కృష్ణా నదిలో వృధాగా పోతున్న నీటిని ప్రకాశం జిల్లాకు మరలించి నీటి సమస్యను పరిష్కరించడంలో అలసత్వం ఏంటో అర్థం కాని పరిస్థితి. ఈ ప్రక్రియకు అవసరమైన నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నదో తెలీదు. జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఈ విషయమై ఎందుకు నోరు మెదపడం లేదు. వామపక్షాల ఉద్యమాలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకొని సుమారుగా ముప్పయ్యేళ్లు అవుతున్నది. దీన్ని పూర్తి చేయడానికి మాటలు తప్ప చర్యలు లేవు. ప్రాజెక్టు పూర్తవ్వాలంటే తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం నల్లమల సాగర్ జలాశయం నిండేందుకు చర్యలు చేపట్టాలి. దీనికి రూ. 4 వేల కోట్లు అవసరం కాగా, తక్షణ సాయంగా ఈ ఏడాది బడ్జెట్లో కనీసం రూ. 3 వేల కోట్లు కేటాయించాలి. ప్రజా ప్రతినిధులు నిధుల మంజూరుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. వెలుగొండ పూర్తయ్యేందుకు, ఆ మేరకు నిధులు రాబట్టేందుకు జిల్లా వాసులు ఉద్యమం చేపట్టవలసిన అవసరం ఉంది.



పెంట్యాల హనుమంతరావు

కరువు పీడిత ప్రాంతాల 'ప్రాణదాయని', ఆ ప్రాంత ప్రాణ కోటికి దాహార్తి తీర్చే సకల జనులకు 'సుఖదాయని' అయిన 'వెలుగొండ ప్రాజెక్టు'ను వేగిరం పూర్తి చేయాల్సిన అవసరముంది.

1989 మార్చి 8న వెలుగొండ పథకానికి సంబంధించిన ప్రాథమిక నివేదికను తెలుగుగంగ ప్రాజెక్టు ఓఎస్‌డిగా పనిచేస్తున్న డాక్టర్ కె.రామకృష్ణయ్య ప్రభుత్వానికి అందించారు. అప్పటి మార్కాపురం శాసనసభ్యులు పూలసుబ్బయ్య విజ్ఞప్తి మేరకు నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు 'ఖోస్లా 'కమిషన్'ను నియమించారు. ప్రకాశం జిల్లా పశ్చిమ సమస్యకు పరిష్కారం 'వెలుగొండ' అని పుచ్చలపల్లి సుందరయ్య 1954లో మొదటగా 'ఖోస్లా కమిషన్'కి సూచించారు. కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో 1996లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు.

వెలుగొండ పథకం గురించి.....

ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల పరిధిలో 4,47,300 ఎకరాలు సాగునీరు, 15.25 లక్షల మందికి తాగునీరు అందించే ప్రాజెక్టుగా రూపకల్పన చేశారు. కొల్లం వాగు ఎగువన హెడ్ రెగ్యులేటర్ నిర్మించి అడ్డగా ఉన్న కొండను తొలిచి 7 మీటర్లు, 9.2 మీటర్ల వ్యాసార్థంగల రెండు సొరంగ మార్గాలను 19.8 కి.మీ మేర ఏర్పాటు ద్వారా 20 కిలోమీటర్ల వరద కాలువ నుంచి 'నల్లమల రిజర్వాయర్'కు నీరు చేరుతుంది.

సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల దగ్గరున్న కొండల మధ్య ఖాళీలను పూడ్చడం ద్వారా 'సహజ రిజర్వాయర్'గా రూపుదిద్దుకుంటుంది. దీని నీటి నిల్వ సామర్థ్యం 53 టిఎంసిలుగా నిర్ణయించారు. వర్షాకాలంలో కృష్ణా నది ద్వారా రోజుకు ఒక టిఎంసి చొప్పున 45 రోజులు పాటు 45 టిఎంసిల నీరు రిజర్వాయర్‌కు చేరుతుంది. ఏడాది పొడవునా వచ్చే వరదనీటి ద్వారా మరో 7 నుంచి 8 టిఎంసిలు వెరసి 53 టిఎంసి లు నిల్వ చేసే అవకాశం వుంది. అక్కడి నుండి తీగలేరు, గొట్టిపడియ ప్రధాన కాలువల ద్వారా రిజర్వాయర్‌కి చేరుతుంది. ఈ నీటి ఆధారంగా రాళ్లపాడు రిజర్వాయర్, గుండ్ల మహేశ్వరం రిజర్వాయర్లకు కూడా నీరందుతుంది. వెలుగొండ పథకంలో భాగంగా ఐదు ఎత్తిపోతల పథకాలు రూపొంది వాటి ద్వారా సాగునీరు, తాగునీటి సౌకర్యం ఏర్పడుతుంది. ఇదంతా రెండు దశల్లో సాగుతుందని మొదటి దశలో 1.19 లక్షల ఎకరాలకు, రెండో దశలో 3,25,300 ఎకరాలకు సాగు నిర్ధారించారు. ఇందుకోసం రూ.980 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనా. దీనికోసం 11 గ్రామాలను ఖాళీ చేయించాలని, 33,545 ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ ప్రకారం గ్రామాలు ఖాళీ చేయించడం, భూసేకరణ ప్రక్రియ పూర్తయింది.

ముప్పయ్యేళ్ల తర్వాత వెలుగొండ ప్రాజెక్టు పరిస్థితి

ప్రాజెక్టు కోసం ఇప్పటి వరకు 6,197 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ప్రాజక్టు పనులు ప్రారంభమై సుమారుగా మూడు దశాబ్దాలు కావస్తున్నా ఇప్పటికీ మొదటి దశ పూర్తికాలేదు. అరకొర నిధులతో ప్రాజెక్టు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. మొదటి సొరంగం దాదాపు పూర్తయింది. 30 శాతం బేలెన్స్ పనులు పూర్తి చేయాలి. రెండో సొరంగం (9.2 మీటర్ల వ్యాసార్థం) 11 కిలోమీటర్ల మేర పని పూర్తయింది. ఏడు కిలోమీటర్ల దూరం మట్టి తొలగించలేదు. మరో రెండు కిలోమీటర్ల సొరంగం తవ్వాలి. రెండు సొరంగాలలో వచ్చిన మట్టిని బయటకు తరలించకుండా, హెడ్ వర్క్ ప్రాంతంలో డంప్ చేశారు. మరికొంత మట్టిని మొదటి సొరంగానికి ఐదు చోట్ల రంధ్రాలు పెట్టి వాటిలో నింపారు. ఇలా అస్తవ్యస్తంగా ఎందుకు చేశారు? దీనికి ఎవరు బాధ్యులు?

నల్లమల రిజర్వాయర్ 2018లోనే పూర్తయింది. తొమ్మిదేళ్ల నుంచి నిరుపయోగంగా ఉంది. సొరంగం నుండి రిజర్వాయర్ వద్దకు వెళ్లే అప్రోచ్ ఛానల్ 2019 లోనే పూర్తయింది. అప్పట్లో తీసిన కాలువలు చెట్లుతో, మట్టితో పూడి పోయాయి. వీటిని వినియోగంలోకి తేవాలంటే మరలా మరమ్మతులు చేపట్టాలి. దీనికి అదనంగా ఖర్చవుతుంది. మొదటి సొరంగాన్ని అప్రోచ్ ఛానల్‌కు కలిపే భాగాన్ని వదిలి వేశారు. అన్నింటికన్నా ముందుగా పూర్తి చేసిన హెడ్‌వర్క్ పనులు పూర్తికాలేదు. హెడ్‌వర్క్ నుండి సొరంగాలకు కలుపుతూ చేయాల్సిన పనులు కూడా పూర్తికాలేదు. అప్రోచ్ చానళ్ళకు లైనింగ్ అవసరం. అవసరమైన కల్వర్టులు లైనింగ్‌లు పూర్తి చేయాలి. సొరంగం తవ్విన యంత్రం (టన్నెల్ బోరింగ్ మిషన్) బయటకు రావడం సాధ్యం కాదని, సొరంగం అవతల మార్గం లోపల ధ్వంసం చేయాలని, దీనికోసం కాంట్రాక్టర్‌కి బిల్లులు చెల్లిస్తే గాని ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉండదని నిపుణుల అభిప్రాయం.

నిర్వాసితులకు పునరావాసం

ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు పునరావాసం కల్పించాలి. దీనికి రూ.1402 కోట్లు అవసరమవుతాయి. ఇవిగాక మొదటి దశ పెండింగ్ పనులకు రూ.1600 కోట్లు అవుతాయి. ఇప్పటి వరకు జరిగిన జాప్యం కారణంగా ప్రాజెక్ట్ వ్యయ అంచనా రూ. 12 వేల కోట్లకు పెరిగింది.

ప్రాజెక్టు నిర్ణీత సమయంలో పూర్తయ్యేనా?

ప్రాజెక్టు పూర్తయినట్లు జంట సొరంగాలను జాతికి అంకితం చేస్తున్నట్లు గత ఏడాది మార్చి ఆరున అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించి ప్రజలను మభ్యపెట్టారు. తాజాగా కూటమి మంత్రులు రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రకటించడం గమనార్హం. ప్రకటించిన రీతిలో రెండేళ్లలో పూర్తి చేయాలంటే సుమారు రూ.4000 కోట్లు అవసరం కాగా 2024-25 బడ్జెట్లో కేవలం రూ.507 కోట్లు కేటాయించి కేవలం రూ 210 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.


తక్షణం రూ. 3000 కోట్లు కేటాయించాలి

ప్రభుత్వం తక్షణ ప్యాకేజీగా రూ.1402 కోట్లు, మట్టి తొలగించేందుకు, లైనింగ్ ప్రక్రియ వంటి ఇతర పనులు పూర్తి చేసేందుకు మరో రూ.1600 కోట్లు వెరసి రూ.3000 కోట్లు కేటాయించాలి. అనేక ఆందోళనలతో ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రభుత్వం ప్రకటించింది. పశ్చిమ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య, సాగునీరు, తాగునీటి సమస్యతో జిల్లా వాసులు ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వలసలు వెళ్లడం పరిపాటయింది. 1000 అడుగులు తవ్వినా చుక్క నీరు పడని పరిస్థితి ఉంది. జిల్లాలో అత్యధిక మండలాల్లో ఫ్లోరైడ్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రకాశం జిల్లా వర్షఛాయ ప్రాంతంగా పేరు ఉంది. జిల్లాలో 80 లక్షల ఎకరాల సాగు భూమి ఉంటే 80 శాతం పైగా వర్షాధారంగానే సాగయ్యే పరిస్థితి. మూసి, పాలేరు, గుండ్లకమ్మ వంటి సహజ వనరులు ఉన్నప్పటికి...సాగునీటి వినియోగం కోసం ప్రాజెక్టులు రూపొందించలేదు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో మినహా, మిగిలిన ప్రాంతమంతా తాగునీరు, సాగునీరుకు వర్షంపై ఆధారపడాల్సిందే.

ఎన్ఎస్‌పి రెండవ దశ ద్వారా 'మీ దశ తిరుగుతుందన్నారు'. అయితే తొలి దశకే నీళ్లు అందని పరిస్థితి నెలకొంది. కృష్ణా నదిలో వృధాగా పోతున్న నీటిని ప్రకాశం జిల్లాకు మరలించి నీటి సమస్యను పరిష్కరించడంలో అలసత్వం ఏంటో అర్థం కాని పరిస్థితి. ఈ ప్రక్రియకు అవసరమైన నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నదో తెలీదు. జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఈ విషయమై ఎందుకు నోరు మెదపడం లేదు? వామపక్షాల ఉద్యమాలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకొని సుమారుగా ముప్పయ్యేళ్లు అవుతున్నది. దీన్ని పూర్తి చేయడానికి మాటలు తప్ప చర్యలు లేవు. ప్రాజెక్టు పూర్తవ్వాలంటే తక్షణ సాయంగా రాష్ట్ర ప్రభుత్వం నల్లమల సాగర్ జలాశయం నిండేందుకు చర్యలు చేపట్టాలి. దీనికి రూ. 4 వేల కోట్లు అవసరం కాగా, తక్షణ సాయంగా ఈ ఏడాది బడ్జెట్లో కనీసం రూ.3 వేల కోట్లు కేటాయించాలి. ప్రజా ప్రతినిధులు నిధులు మంజూరుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. వెలుగొండ పూర్తయ్యేందుకు, ఆ మేరకు నిధులు రాబట్టేందుకు జిల్లా వాసులు ఉద్యమం చేపట్టవలసిన అవసరం ఉంది.

/వ్యాసకర్త రైతు సంఘం ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షులు,
సెల్ : 9490300345 /

వ్యాఖ్య



ఇప్పుడు మనకు ఐన్‌స్టీన్లు లేరు, నెహ్రూలూ లేరు!

"ఒక్క మానవజాతిని మాత్రమే గుర్తుంచుకోండి! మిగిలినవన్నీ మరిచిపోండి" అంటుంది 1955 నాటి రస్సెల్-ఐన్‌స్టీన్ మేనిఫెస్టో. విజ్ఞానశాస్త్రం ఊహాతీత హననానికి రాచబాట వేస్తున్నవేళ సూటిగా గుండెలకు గుచ్చుకునే ఈ రెండు మాటలు వాళ్ళు చెప్పి డెబ్బై ఏళ్ళు ముగుస్తున్నాయి. దాదాపు రెండు లక్షల మందిని క్షణాల్లో భస్మీపటలం చేసిన 1945 నాటి నాగసాకి, హిరోషిమా అణు విధ్వంసాన్ని చూచిన 'మన్‌హట్టన్' ప్రాజెక్టు డైరెక్టర్ ఓపెన్ హైమర్‌కు భగవద్గీత లోని కోటి సూర్య ప్రభాయమాన విశ్వరూపం, ప్రళయ భీకర మృత్యుహేళ గుర్తుకొస్తాయి. మెదడు మొద్దువారి పోతుంది. ఇది జరిగి ఎనభై ఏళ్ళు కావస్తున్నాయి.

సరిగ్గా ఇదే సంవత్సరం 'మనిషికి మారడమో, మరణమో తప్ప మార్గాంతరం కనబడ్డం లేదని' హైడ్రోజన్ బాంబుల పోటీపై ఆవడి కాంగ్రెస్ ప్లీనరీలో జవహర్‌లాల్ నెహ్రూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తాడు. ఇది ప్రపంచ శాంతికే గాదు మానవాళి మనుగడకే ముప్పుగా మారిందంటాడు. రస్సెల్-ఐన్‌స్టీన్‌ల మేనిఫెస్టోని గుర్తుకు తెస్తాడు. దీనికీ ఎనభై ఏళ్ళు నిండుతున్నాయి.

ఇప్పుడు మన ముందున్న ప్రశ్నలల్లా రస్సెల్, ఐన్‌స్టీన్‌లకూ, నెహ్రూలకూ కాలం చెల్లిందా అని. ఇంత నాగరికతా, ఇంత విజ్ఞానం మనల్ని ఈ ఎడారిలోకి తీసుకొచ్చి వదిలేశాయా అని. వర్తమాన చరిత్ర ఇంత నిస్సారమా అని. కానీ ఎక్కడో గుండె పొరల్లో ఒక మూల నుంచి "అదేం కాదు" అని సన్నగానే అయినా ఒక్కోసారి వినిపిస్తుంటది. అదే మానవాళి అసలు సిసలు జీవధర్మం కాబోలు!

ఇప్పుడు మనకు రస్సెల్‌లు లేరు. ఐన్‌స్టీన్‌లు లేరు. నెహ్రూలూ లేరు. ఉన్నదల్లా భూగోళం తమ కనుసన్నల్లోనే పరిభ్రమించాలనే అధికార బధిరాంధ అహంకారులూ, ప్రపంచం పుట్టింది తన లాభాల కోసమేననుకునే అంతర్జాతీయ బేహారులూ, విద్వేషమే మానవ స్వభావమని నిర్వచించే జాత్యున్మాదులూ మాత్రమే.

క్రమంగా మానవత్వం పట్ల, మానవ మనుగడ పట్ల నమ్మకాన్నే మనం కోల్పోతున్నాం. ఇప్పుడు మనకు భవిష్యత్తు గురించి ఆశలు లేవు, భయాలు కూడా లేవు. ఉన్నదంతా విషాద బీభత్స వర్తమానం మాత్రమే. అనంత శూన్యత్వం మాత్రమే! "ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు" అన్న కవి వాక్యం మాత్రమే.

సర్వనాశనం జరిగాక తాపీగా కుదిరిన పాలస్తీనా ఒప్పందాన్ని చూస్తే ఏమనిపిస్తుంది? దేశానికి దేశమే శిథిలాల మధ్య జీవచ్ఛవంగా మారాక ఉక్రెయిన్ పాఠాలు చెప్పే "కొత్త శాంతి దూతలు" తీరిగ్గా పుట్టుకు రావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సిరియా అంతర్యుద్ధం వున్నటుండి తెల్లారేటప్పటికల్లా ఎలా ముగిసిపోయింది?

ఇదంతా చూస్తే అసలేం జరుగుతుందో మనకర్థం కాదు. ఎవరు ముద్దాయిలో, ఎవరు న్యాయమూర్తులో మనకేమీ అంతు పట్టదు. తెర వెనుక ఏం జరుగుతుందో మనకు బోధపడదు. అంతా భ్రాంతిగా, బ్రహ్మపదార్థంగా మాత్రమే కనిపిస్తుంది. జరిగేది చూస్తుండడమే మన పని అన్పిస్తుంది.

ఇప్పుడు మన ముందున్న ప్రశ్నలల్లా రస్సెల్, ఐన్‌స్టీన్‌లకూ, నెహ్రూలకూ కాలం చెల్లిందా అని. ఇంత నాగరికతా, ఇంత విజ్ఞానం మనల్ని ఈ ఎడారిలోకి తీసుకొచ్చి వదిలేశాయా అని. వర్తమాన చరిత్ర ఇంత నిస్సారమా అని.

కానీ ఎక్కడో గుండె పొరల్లో ఒక మూల నుంచి "అదేం కాదు" అని సన్నగానే అయినా ఒక్కోసారి వినిపిస్తుంటది. అదే మానవాళి అసలు సిసలు జీవధర్మం కాబోలు! అదే భవిష్యత్తుకు అంతిమ నిర్ణాయకం కూడా కాబోలు!!

/ 'జన విజ్ఞానం' సంపాదకీయం /

పేరుకే యూనివర్శిటీ హోదా

అభిప్రాయం



డి. రాము

జె.ఎన్.టి.యు.జి.వి కి ప్రత్యేక యూనివర్సిటీ హోదా వున్నప్పటికీ ఎన్నో సమస్యలు వెన్నాడుతున్నాయి.

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ (జె.ఎన్.టి.యు.కె) 1946లో 'ది కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విశాఖపట్నం' పేరుతో ప్రారంభించబడింది. ఇది 1972లో జె.ఎన్.టి.యు హైదరాబాదులో ఒక భాగస్వామ్య యూనిట్‌గా మారింది. జె.ఎన్.టి.యు విభజనకు లోబడి 2008లో చట్టం ద్వారా ప్రత్యేక విశ్వవిద్యాలయంగా ఏర్పడింది. దీనికి అనుబంధంగా జె.ఎన్.టి.యు.కె విజయనగరం ఉండేది.

విద్యలనగరంగా పిలవబడే విజయనగరంలో యూనివర్సిటీ లేకపోవడంతో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్నది స్థానిక విద్యార్థులు, ప్రజల సుదీర్ఘకాల డిమాండ్. అయితే ఉన్నపళంగా యూనివర్సిటీ ఏర్పాటు చేయాలంటే భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుకే గత రాష్ట్ర ప్రభుత్వం తెలివిగా 2022లో జె.ఎన్.టి.యు.కె విజయనగరంకు ప్రత్యేక యూనివర్సిటీ హోదా కల్పిస్తూ 'జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ గురజాడ విజయనగరం'గా నామకరణం చేసింది. అయితే ఈ విభజనలో కొన్ని తప్పిదాలున్నాయి.

సిబ్బంది కొరత

ముఖ్యంగా ఈ క్యాంపస్‌లో 41 మంది రెగ్యులర్ సిబ్బంది వున్నారన్న ప్రాతిపదికన యూనివర్సిటీ హోదా కల్పించారు. జె.ఎన్.టి.యు.జి.వి కి రిక్రూట్ అయిన 15 మంది సేవలను జె.ఎన్.టి.యు.కె ద్వారా వినియోగిస్తున్నారు. అంతేకాకుండా ఇద్దరు నాన్ టీచింగ్ సిబ్బంది జె.ఎన్.టి.యు.కె నుండి ఆరు నెలలకు ఒకసారి రొటేషన్ పద్ధతిలో పరిపాలన విధుల్లో పాల్గొంటున్నారు. డిప్యూటీ రిజిస్టర్, అసిస్టెంట్ రిజిస్టర్ వంటి సిబ్బంది లేకుండా ఒక యూనివర్సిటీ నడపడం చాలా కష్టం. సరిపడా నాన్ టీచింగ్ సిబ్బంది లేకపోవడం వలన అధ్యాపకులే ఆ పని చేయాల్సి వస్తున్నది. దీంతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరం అవుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న అధ్యాపకుల్లో ఎక్కువమంది కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉన్నారు. వీరు నిరంతరం పని ఒత్తిడికి గురవుతున్నారు. వీరి ఉద్యోగ భద్రతకు గ్యారెంటీ లేదు. యూనివర్సిటీ అధ్యాపకులుగా ఉన్నప్పటికీ వీరికి ఇచ్చే జీతాలు చిన్న ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుల జీతాలు కంటే దారుణంగా ఉన్నాయి. కేవలం రూ.12,000 జీతం తీసుకుని పనిచేసే వాళ్ళు అనేకమంది ఉన్నారు. యూనివర్సిటీకే సిబ్బంది సరిపోవటం లేదు. కానీ కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాలకు సిబ్బందిని కేటాయించాలంటే ఎలా సాధ్యం?

క్యాంపస్‌లో 41 మంది రెగ్యులర్ సిబ్బంది వున్నారన్న ప్రాతిపదికన యూనివర్సిటీ హోదా కల్పించారు. జె.ఎన్.టి.యు.జి.వి కి రిక్రూట్ అయిన 15 మంది సేవలను జె.ఎన్.టి.యు.కె ద్వారా వినియోగిస్తున్నారు. అంతేకాకుండా ఇద్దరు నాన్ టీచింగ్ సిబ్బంది జె.ఎన్.టి.యు.కె నుండి ఆరు నెలలకు ఒకసారి రొటేషన్ పద్ధతిలో పరిపాలన విధుల్లో పాల్గొంటున్నారు. డిప్యూటీ రిజిస్టర్, అసిస్టెంట్ రిజిస్టర్ వంటి సిబ్బంది లేకుండా ఒక యూనివర్సిటీ నడపడం చాలా కష్టం. సరిపడా నాన్ టీచింగ్ సిబ్బంది లేకపోవడం వలన అధ్యాపకులే ఆ పని చేయాల్సి వస్తున్నది. దీంతో విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరం అవుతున్నారు.

నిధులు సమస్య

ఒక యూనివర్సిటీని నడపాలంటే కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. యూనివర్సిటీని విభజించినప్పుడు దానికి అనుగుణంగా నిధులు కూడా అందించాల్సిన అవసరం ఉంది. కానీ అరకొర నిధులు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. జె.ఎన్.టి.యు.కె దగ్గర దాదాపు 800 కోట్ల రూపాయలు నిధులు ఉన్నాయి. జె.ఎన్.టి.యు.జి.వి దగ్గర కేవలం నాలుగు కోట్లు మాత్రమే ఉన్నాయి. ఉన్న నిధులు కొత్తగా నిర్మాణం అవుతున్న భవనాలకే సరిపోతున్నాయి. ఎప్పుడో హుదూద్ తుఫాన్‌లో కూలిపోయిన ఇండోర్ స్టేడియం ఇప్పటి వరకు బాగు చేయలేదు. వీటన్నింటితో పాటు యూనివర్సిటీ నిర్వహణకు పెద్దఎత్తున నిధులు అవసరం. నిధులు ఇవ్వమంటే మీకు అనుబంధంగా ఉన్న కళాశాల నుండి వసూలు చేసుకోమని జె.ఎన్.టి.యు.కె ఉచిత సలహా పడేస్తున్నది. జె.ఎన్.టి.యు.జి.వి కి అనుబంధంగా ఉన్న కాలేజీలు చాలా తక్కువ. అందులోనూ కొన్ని



కళాశాలలు ఇప్పటికే మూతపడ్డాయి. ఉన్న కాలేజీలు సకాలంలో చెల్లించడం లేదు. యూనివర్సిటీకి ఆదాయం వచ్చే రెండు మార్గాలు మూసుకుపోవడంతో ఎలా నడపాలో తెలియక వీసీ నుండి రిజిస్టర్ వరకు అందరూ తలలు పట్టుకుంటున్నారు.

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు

యూనివర్సిటీలో నిధులు లేకపోవడం వలన ఆ భారం విద్యార్థుల మీద కూడా పడుతున్నది. ప్రతి సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. రానున్న విద్యా సంవత్సరం నుండి యూనివర్సిటీలో కొత్త కోర్సులు రాబోతున్నాయి. దీంతో విద్యార్థుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఇప్పుడున్న విద్యార్థులకు హాస్టళ్లు సరిపోవడం లేదు. గతంలో ఒక రూమ్‌లో ముగ్గురుంటే ఇప్పుడు ఐదుగురు ఉంటున్నారు. పెరుగుతున్న ధరల మూలంగా మెస్ చార్జీలు పెరుగుతున్నాయి కానీ ప్రభుత్వం నుండి స్కాలర్‌షిప్‌లు అందడం లేదు. ప్రభుత్వం తీసుకు వస్తున్న విద్యుత్ సంస్కరణ వలన విద్యుత్ చార్జీల భారం హాస్టల్ విద్యార్థుల మీద కూడా పడుతున్నది. హాస్టళ్లలో వైఫై సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు నెట్‌వర్క్ కోసం డబ్బులు కట్టాల్సి వస్తున్నది. ప్రతి నెలా ఒక విద్యార్థి 200 రూపాయలు వరకు వైఫై బిల్లు చెల్లిస్తున్నారు. యూనివర్సిటీ ప్రాంగణంలో లైట్ల సదుపాయం లేదు. గతంలో జంక్షన్ నుండి యూనివర్సిటీ వరకు బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు. కానీ బస్సు వెయ్యలేదు. దీనితో ఆటో చార్జీలు ఎక్కువగా చెల్లించాల్సి వస్తున్నది. అంబులెన్స్ సౌకర్యం సరిగ్గా లేదు. పైగా సిటీకి దూరంగా యూనివర్సిటీ ఉండడం వలన అర్థరాత్రి ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సకల అసౌకర్యాలకు మూలం నిధుల లేమి కావున జె.ఎన్.టి.యు.జి.వికి సరిపడా నిధులు అందించాలి. సిబ్బంది కొరత తీర్చాలి. దీనికోసం విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది ఐక్యంగా పోరాడాలి.

/ వ్యాసకర్త ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు,
సెల్: 9705545164 /

కవిత్వం

ఏమో మరి..!?

ఈ సమాజానికి
ఇప్పుడేమయిందో.....
ఏం వచ్చిందో మరి....
గతంలో మనిషికి
కష్టం వచ్చినప్పుడు కష్టాలు తీరాలనో
మంచి రోజులు రావాలనో
మాకు మందులు లేని కాలంలో
అమ్మోరికి ఒక మేకనో
కోడినో బర్రెనో గొర్రెనో
బలి ఇచ్చేవారట
ఈ సమాజానికి
ఇప్పుడేమైందో... ఏమొచ్చిందో....
మనుషులనే ఏకంగా
బలి ఇచ్చేస్తున్నారు
బస్సుల్లో.... రైళ్లల్లో
వెళ్తూ వెళ్తూ...
ఆ అమ్మ వద్దకు ఇంకా చేరకుండానే...
హరీ మనేస్తున్నారు....
ఒక దగ్గర రెండు దగ్గరలా
ఒకరా... ఇద్దరా...
వందలాదిమంది
గతంలో గోదారి పుష్కరాల్లో
మొన్నటికి మొన్న తిరుపతిలో
నిన్న ప్రయాగ్రాజ్ పుణ్యక్షేత్రాల వద్ద
ఈరోజు దేశ రాజధాని రైల్వేస్టేషన్ లోనే
మనుషుల మధ్యలోనే
మాయమైపోయారు....
బహుశా ఆ పరమాత్మకి
కనిపించలేదేమో...
ఏమో మరి.....!?

- నిశితాసి,
సెల్ : 9704570198

భార్యే నిందితురాలు

● హడ్కో కాలనీ హత్య కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అరసవల్లి

శ్రీకాకుళం నగరం హడ్కో కాలనీలో ఈనెల 23వ తేదీన చోటుచేసుకున్న హత్య ఘటనను పోలీసులు ఛేదించారు. మృతుడు మజ్జి రమేష్ భార్య శశి హత్య చేసినట్లు విచారణలో తేలడంతో ఆమెను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి సిహెచ్.వివేకానంద విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం నగరం హడ్కో కాలనీ టీ ఎజెంట్ వీధిలో నివాసముంటున్న మజ్జి రమేష్‌కు భార్య శశి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మజ్జి రమేష్ స్క్రాప్ షాపులో పనిచేస్తూ మద్యానికి అలవాటు పడి ఇంటికి డబ్బులు ఇవ్వకుండా భార్య, పిల్లలను హింసిస్తుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీన రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవపడ్డాడు. మృతుడు ఇంటి తలుపులు తెరవకపోవడంతో, అతని తల్లి మజ్జి విజయకు శశి ఫోన్ చేసి చెప్పారు. ఇంటికి లోపలి నుంచి గడియ పెట్టడంతో వెనుక ద్వారం నుంచి ఇద్దరూ లోపల చూశారు. మృతుని మెడకు, ఎడమ వైపు గాయాలు ఉన్నాయి. భార్య శశి మాటల్లో తేడా ఉండడంతో మృతుని తల్లి విజయ ఈనెల 24వ తేదీన రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమానాస్పద మృతి కేసును నమోదు చేసి విచారణ చేపట్టారు. ఘటనా స్థలం పరిశీలన, వైద్యులు ఇచ్చిన పోస్టుమార్టం నివేదిక ఆధారంగా శశిని విచారణ చేయడంతో ఆమె నేరం అంగీకరించినట్లు తెలిపారు. అనుమానాస్పద కేసును హత్యానేరం కేసుగా నమోదు చేసి మజ్జి శశిని అరెస్టు చేసినట్లు చెప్పారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించి, కొద్దిరోజుల్లో నిందితురాలిని అరెస్టు చేయడంతో ప్రతిభ కనబరిచిన రెండో పట్టణ సిఐ పి. ఈశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ శివాజీ, కానిస్టేబుల్ రమేష్‌ను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, డిఎస్‌పి వివేకానంద అభినందించారు.

బెదిరింపుల భయంతో జార్ఖండ్ నుంచి వచ్చిన

ప్రేమ జంటకు కేరళ ఆశ్రయం



తిరువనంతపురం : లౌకిక సంప్రదాయాలకు ప్రసిద్ధిచెందిన కేరళ మరోసారి తన గుర్తింపును నిలబెట్టుకుంది. హిందుత్వ గుండాల లవ్ జిహాద్ బెదిరింపులతో జార్ఖండ్ నుంచి పారిపోయి వచ్చిన యువ ప్రేమ జంటకు సురక్షితంగా ఆశ్రయం కల్పించింది. జార్ఖండ్‌లోని చిత్తాపూర్‌కు చెందిన 30 ఏళ్ల మహ్మద్ గాలిబ్, 27 ఏళ్ల ఆశా వర్మ ఐదేళ్లుగా అలప్పుజ జిల్లాలోని కాయంకులంలో వుంటూ పెళ్లి చేసుకున్నారు. స్థానికుల సహాయంతో హిందూ, ముస్లిం సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. దశాబ్ద కాల తన ప్రేమను పరిపూర్ణం చేసుకున్నారు. యుఎఇలో ఇంజనీరుగా పనిచేస్తున్న గాలిబ్‌తో ఆశ ప్రేమను ఆమె తల్లిదండ్రులు ముందు అంగీకరించారు. అయితే స్థానిక హిందుత్వ గూండాల భయంతో గత నెలలో ఆశాకు మరొక వ్యక్తితో వివాహాన్ని నిశ్చయించారు. ఈ విషయం తెలిసిన గాలిబ్ తక్షణమే యుఎఇ నుంచి వచ్చాడు. ఆశా తల్లిదండ్రులను ఒప్పించడంలో విఫలమయ్యాడు. మరోవైపు ఈ ప్రేమ విషయం స్థానికంగా మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసింది. దీంతో యుఎఇలో తన సహోద్యోగి సలహాతో గాలిబ్ ఆశాను తీసుకుని కేరళకు చేరుకున్నాడు. ఇక్కడ మహిళా న్యాయవాది సహాయందో వివాహ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు ఆశా బంధువులు కూడా కాయంకులం చేరుకున్నారు. ఆశాను కిడ్నాప్ చేశాడని గాలిబ్‌పై కేసు కూడా పెట్టారు. అయితే అలప్పుజ జిల్లా ఎస్‌పి ఎంపి మోహన్‌చంద్రన్ ప్రేమ జంటకు రక్షణ కల్పించాలని పోలీసుల్ని ఆదేశించారు. కేరళ ప్రభుత్వ చర్యలతో వీరి ప్రేమ నిలబడింది. కేరళ తమకు రక్షణగా నిలబడిందని, ఈ ప్రజలను ఎప్పటికీ మర్చిపోమని ఆశా, గాలిబ్ తెలిపారు.

కాగా, మరోవైపు సంఘ్‌పరివార్ బెదిరింపులు కారణంగా గాలిబ్ తల్లిదండ్రులు చిత్తాపూర్ నుంచి పారిపోయి రాంచీలో జీవనం సాగిస్తున్నారు.

నకిలీ సర్టిఫికెట్ల సూత్రధారి అరెస్ట్

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన కేసులో పలువురిని ఇప్పటికే గద్వాల పోలీసులు అరెస్టు చేయగా, అందులో సూత్రధారి.. మిర్యాల గూడకు చెందిన మాజీ ప్రిన్సిపల్ బాలకృష్ణను కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మొగిలయ్య వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. ఇంకా నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం విచారణ చేస్తున్నట్టు చెప్పారు. బాలకృష్ణ నుంచి ఇంటర్మీడియట్ బిసిఎ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సమావేశంలో గద్వాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి శ్రీను, గద్వాల పట్టణ ఎస్ఐ కళ్యాణ్ రావు ఉన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సులో

భోజనాల కోసం కొట్లాట

భోపాల్: మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ప్రపంచ మదుపరుల శిఖరాగ్ర సదస్సు జరిగింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సును ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు.

దీనికి దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున మదుపర్లు హాజరై రూ.లక్షల కోట్ల మేర పెట్టబడులను ప్రకటించారు. అయితే, ఈ కార్యక్రమంలో ఏర్పాట్లు మాత్రం అరకొరగా ఉన్నాయి.

ఈ సదస్సుకు వచ్చిన అతిథులు భోజన ప్లేట్ల కోసం కొట్లాడుకుంటున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అతిథులు హాజరయ్యారు. అయితే, సరైన సౌకర్యాలు లేకపోవడంతో భోజన సమయంలో వారంతా ప్లేట్ల కోసం పోటీపడ్డారు. దీంతో కొన్ని ప్లేట్లు విరిగి కిందపడ్డాయి. ఈ దృశ్యాలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రపంచస్థాయి సదస్సులో ఇలాంటి ఏర్పాట్లు బాధాకరమంటూ మండిపడ్డాయి.

ఈ నెల 24-25 తేదీల్లో ఈ ఇన్వెస్టర్ల సదస్సు జరిగింది. ఇందులో తమ రాష్ట్రంలో రూ.26.61లక్షల కోట్ల పైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరినట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు..

ఏజెన్సీ గొంతెండుతోంది!

● 120 గ్రామాలకు పైగా నీటి ఎద్దడి

● వేసవికి ముందే తాగునీటికి కటకట

ప్రజాశక్తి-సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

సీతంపేట ఏజెన్సీ పరిధిలో సుమారు 120 గ్రామాల వరకు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. ఇప్పటికే సరిహద్దు గూడ, జెపిబుర్జిగూడ, దిగువ డుంబంగివలస, చావిడి వలస, తెలేబుగూడ ఈతమానుగూడ, నీలంగూడ, పెద్దగూడతోపాటు పోల్ల, దోనుబాయి పరిసర ప్రాంతాల్లో 20 గ్రామాల వరకు తాగునీటి సమస్య ఉందని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు విన్నవించినట్లు తెలిసింది. సీతంపేట మండలంలో 40 గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గుర్తించి, రూ.86.55 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు సమాచారం.

దోనుబాయి గ్రామంలో 500 కుటుంబాలు ఉన్నాయి. ఐదు బోర్లు ఉన్నప్పటికీ నీరు అందడం లేదు. రెండు బావులు ఉన్నప్పటికీ అడుగంటి పోవడంతో నీరు చాలడం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. సీతంపేట ఐటిడిఎకు కూతవేటు దూరంగా ఉన్న కంబగూడులో బోరు నుంచి మోటార్ ద్వారా రక్షిత మంచినీటి పథకానికి నీరు పంపిస్తున్నారు. అయితే మోటారు మరమ్మతుకు గురవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. నాయకమ్మగూడ గ్రామంలో 50 కుటుంబాలు నివశిస్తున్నాయి.



సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెస్తున్న మహిళలు

ఉన్న ఒక్క బోరు నుంచి నీరు తక్కువగా వస్తోంది. ఉన్న బావి అడుగంటి పోయింది. నీరు సరిపోకపోవడంతో గతంలో పిఒ రాహుల్ కుమార్ రెడ్డి గ్రామాన్ని సందర్శించి మోటార్ బోరు ఇస్తామన్నారు. కానీ ఆ సమస్య పరిష్కారం కాలేదు. దుగ్గి పంచాయతీ చాపరాయి గూడలో 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. బావి ఉన్నప్పటికీ నీరు చాలడం లేదు. గ్రావిటేషన్ ఫ్లో నీరు కూడా చాలడం లేదు. కిలోమీటర్ దూరంలో ఉన్న చిన్నపాటి బావి నుంచి గిరిజనులు ఒకరు తర్వాత ఒకరు నీరు పట్టుకుని తెచ్చుకుంటూ గొంతు తడుపుకుంటున్నారు. పెద్దగూడ పంచాయతీ లంబ గూడలో 25 కుటుంబాలు ఉన్నాయి. ఉన్న బావి అడుగంటి పోయింది. ఒక్క బోరు కూడా లేదు. దీంతో ఫిబ్రవరి నుంచి తాగునీటి కష్టాలు ఆరంభమయ్యాయి. బోరు మంజూరు చేయాలని గిరిజనులు కోరుతున్నారు. దేవనాపురం పంచాయతీ సుంబ్ర నాయుడు గూడలో 47 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఉన్న బావికి మోటార్ ఉంది. కరెంటు లేనప్పుడు ఇబ్బంది తప్పడం లేదు. సోలార్ పనిచేయడం లేదు. వాటర్ ట్యాంకు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు పక్క జంతిగూడలో 10 కుటుంబాలు ఉన్నాయి. బావిబోరు లేదు. ఎత్తయిన కొండపై ఈ గ్రామం ఉంది. దీంతో కొండపై నుంచి కిందికి కిలోమీటర్ దూరం నడిచి జగత్ పల్లి బావికి వచ్చి నీరు తీసుకొని వెళ్తున్నారు. ఈ వేసవిలో రెండు గ్రామాల గిరిజనులు జగత్ పల్లి బావినీరు తాగుతున్నారు. పివి ఈతమానుగూడ పంచాయతీ నెల్లిగండిలో 15 కుటుంబాలు ఉన్నాయి. ఎత్తయిన కొండలపైన గ్రామం ఉండటంతో బోర్లు లేవు. 200 మీటర్ల దూరంలో బావి ఉన్నప్పటికీ నీరు అందకపోవడంతో మోటార్ కాలిపోయింది. బావిలో నీరు అందకపోతే గెడ్డ నీటిపై ఆధార పడాల్సి వస్తుంది. వేసవిలో ఆ నీరు చాలదని గ్రామస్తులు వాపోతున్నారు. పెద్దగూడలో రెండు రక్షిత మంచినీటి పథకాలు ఉన్నప్పటికీ నీరు చాలడం లేదు. మరొక ట్యాంకు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎగువ దారబలో నీటి సమస్య అధికంగా ఉంది. రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రసూల్‌పేట కొండపై నుంచి రసూల్‌పేటకు దిగి బావి నుంచి నీరు తీసుకువెళ్తారు. అయితే భవి నుంచి కొండపైన ఉన్న ఎగువ దారబకు మోటార్ బిగించినప్పటికీ నీరు రావడం లేదు.

కెజిబివిల్లో ఎపిసి తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్షా ఎపిసి డాక్టర్ ఎ.రామారావు బుధవారం విజయనగరం జిల్లా రాజాం, వంగర, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి మండలాల్లో కెజిబివిలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో పరిసరాలను, వంటగదిని, తరగతి గదులను పరిశీలించారు. వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. స్టడీ హవర్స్‌ను పరిశీలించారు. అనంతరం వంగర కెజిబివిలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. పదో తరగతి , ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో 'పంచతంత్ర విధానం' అనుసరించి రాష్ట్రస్థాయి లోనే జిల్లా కెజిబివిలను ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో శివతేజకు స్వర్ణం



ప్రజాశక్తి-అనంతపురం సిటీ

బాడీ బిల్డింగ్‌లో చారుగుండ్ల శివతేజ విజయ పరంపర కొనసాగుతోంది. ఈమారు ఏకంగా 80 కిలోల విభాగంలో స్వర్ణం సాధించి సత్తా చాటాడు. హైదరాబాద్‌లో జరిగిన బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో శివతేజ ఆంధ్రప్రదేశ్ తరపు పాల్గొని 80 కిలోల విభాగంలో విజేతగా నిలిచి స్వర్ణ పతకం సాధించాడు. శివతేజ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ బెంగళూరులో జరిగే మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో సత్తా చాటి అనంతపురం నగరానికి జాతీయస్థాయిలో పేరు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. శివతేజ విజయం పట్ల తల్లిదండ్రులు రాయదుర్గం మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, టీచర్ అరుణ, వైద్యాధికారులు, నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు.

యుటిఎస్ యాప్ వాడకానికి రైల్వే ప్రోత్సాహం

● ఆర్-వ్యాలెట్ లావాదేవీలపై 3 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ అన్ రిజర్వ్‌డ్ ప్రయాణాల కోసం మొబైల్ టికెట్ బుకింగ్ ప్రయాణికులను ప్రోత్సహించడానికి ముమ్మర అవగాహన కార్యక్రమాలు, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే యుటిఎస్ యాప్ వాడకాన్ని ప్రోత్సహిస్తోంది. 2016లో ప్రారంభించిన యుటిఎస్ మొబైల్ యాప్ ద్వారా వాల్తేరు డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో ప్లాట్‌ఫారం జర్నీ, సీజన్ టికెట్లను బుక్ చేసుకోవచ్చు. యుటిఎస్ మొబైల్ యాప్ ద్వారా అన్ రిజర్వ్‌డ్ టికెట్ బుకింగ్ కోసం ఆర్-వాలెట్ లావాదేవీలపై 3 శాతం క్యాష్ బ్యాక్ ఆఫర్ ఇస్తున్నారు. ఈ పథకాన్ని రైల్వే మంత్రిత్వ శాఖ ఈ ఏడాది ఆగస్టు 24 వరకూ పొడిగించింది. ఈ బోనస్ తక్షణమే వినియోగదారుడి ఆర్-వాలెట్‌కు క్రెడిట్ చేయబడుతుందని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి యుటిఎస్ మొబైల్ యాప్ డిజిటల్ లావాదేవీలు, కాగిత రహిత టికెటింగ్‌ను మరింత ప్రోత్సహిస్తుంది. ప్రయాణికులు పాపులర్ డిజిటల్ పేమెంట్ ఆప్షన్లను ఉపయోగించి అన్ రిజర్వ్‌డ్ టికెట్లను కొనుగోలు చేయవచ్చు. వాల్తేరు డివిజన్ స్టేషన్లలో వివిధ మీడియా వేదికలు, పోస్టర్లు, బ్యానర్లు మొదలైన వాటిని ఉపయోగించడం ద్వారా యుటిఎస్ మొబైల్ యాప్‌ను ప్రోత్సహించడానికి రైల్వే సమగ్ర చర్యలు చేపట్టింది. అన్ రిజర్వ్‌డ్ టికెట్ల బుకింగ్ కోసం యుటిఎస్ యాప్‌ను ఎలా డౌన్ లోడ్ చేసుకోవాలో, ఎలా ఉపయోగించాలో ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసింది. టికెట్ బుకింగ్స్, డిజిటల్ చెల్లింపుల కోసం యుటిఎస్ యాప్‌ను ప్రయాణికులు త్వరగా యాక్సెస్ చేసుకునేందుకు వీలుగా క్యూఆర్ కోడ్లను అందుబాటులోకి తెచ్చారు.

చీటీల నిర్వాహకుడు అరెస్టు

● మూడు నెలల కిందట కుటుంబమంతా పరారీ

● రాజమండ్రిలో భార్యతో సహా అరెస్ట్

ప్రజాశక్తి - భోగాపురం (విజయనగరం జిల్లా)

చీటీలు, అప్పుల పేరిట ప్రజలను మోసం చేసి కుటుంబంతో పరారైన మోసగాడిని పోలీసులు పట్టుకొని అతనితో పాటు అతని భార్యను కూడా అరెస్ట్ చేసి బుధవారం కోర్టుకు తరలించారు. భోగాపురం గ్రామానికి చెందిన తిరుమరెడ్డి మురళి గ్రామంలో గత కొన్నాళ్లుగా చీటీలు నిర్వహించేవాడు. అనేకమంది వద్ద అప్పులు కూడా చేశాడు. గతేడాది అక్టోబర్ నెలలో తనకు ముగ్గురు వ్యక్తులు మోసం చేశారని లేఖ రాసి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించాడు. దీంతో ఆసుపత్రిలో జాయిన్ చేశారు. కానీ ఆస్పత్రి నుంచే పరారయ్యేందుకు ప్రయత్నించడంతో చీటీలు, అప్పుల బాధితులు ఆసుపత్రిలోనే కాపలా కాయాల్సిన పరిస్థితి వచ్చింది. అనంతరం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టడంతో బాధితులు కూడా నిలదీశారు. అందరికీ డబ్బులు చెల్లిస్తానని చెబుతూనే మూడు నెలల కిందట ఇద్దరు పిల్లలు, భార్య, తల్లితో కలిసి పరార య్యాడు. దీంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. చివరకు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు సిఐ ఎన్.వి ప్రభాకర్ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించారు. రాజమండ్రిలో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు మంగళవారం వెళ్లి ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించారు. రాజమండ్రి నుంచి మురళితోపాటు అతని భార్య తులసినీ బుధవారం ఇక్కడకు తీసుకువచ్చి ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ పాపారావు తెలిపారు.

టమోటా ధరలు పతనం

- నిలకడ లేని ధరలు.. రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

టమోటా ధరలు ఒకేసారి భారీగా తగ్గడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆరుగాలం కష్టపడి రూ.లక్షలు ఖర్చు చేసి టమాటా సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో టమాటా రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట బాగా పండినా ధరలు మాత్రం లేకపోవడంతో రైతుల్లో నిరాశ నెలకొంది. నవంబర్, డిసెంబర్ నెలల్లో 25 కిలోల టమాట బాక్స్ రూ.500 నుంచి రూ.600 ఉండేది. ప్రస్తుతం రూ.150 నుంచి రూ.200 మాత్రమే ఉంది.

కూరగాయల మార్కెట్లో మాత్రం కాయలను బట్టి కిలో రూ.10 నుంచి రూ.20 అమ్ముతున్నారు. రైతు దగ్గర నుంచి మాత్రం రూ.5 నుంచి రూ.10కు కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటా సాగులో పెట్టుబడులు పెరిగి పోతున్నాయి. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతోంది. టమాటా కోతలు, మార్కెట్‌కు తరలింపు, రవాణా, ఎగుమతి దిగుమతి ఖర్చులు లెక్కిస్తే ఒక్కో బాక్స్‌కు రూ.40 వరకు వ్యయమైతుంది. ఒక్కో బాక్సుకు కమీషన్ రూ.10 ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా అన్నింటిని భరించి విక్రయించినా ప్రస్తుత ధరలతో తమకు భారీ నష్టమే వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

స్కీవర్ బ్రంట్ ఆల్‌రౌండ్ షో

- యుపిపై ముంబయి ఘన విజయం
- మహిళల ప్రీమియర్ లీగ్



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో ముంబయి ఇండియన్స్ మరో విజయాన్ని సొంతం చేసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో యుపి వారియర్స్‌తో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ముంబయి జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముంబయి ఆల్‌రౌండర్ స్కీవర్ బ్రంట్ మూడు వికెట్లు తీసి యుపి కట్టడి చేయడంతోపాటు 75పరుగులు చేసి ముంబయి గెలుపులో కీలకపాత్ర పోషించింది. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యుపి వారియర్స్‌ను ముంబయి బౌలర్లు కట్టడి చేశారు. ముఖ్యంగా స్కీవర్ బ్రంట్(3/18)కి తోడు ఇస్మాయిల్(2/33), సంస్కృతి గుప్తా(2/11) బౌలింగ్‌లో చెలరేగారు. దీంతో యుపి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 142 పరుగులు మాత్రమే చేయగలిగింది. యుపి ఇన్నింగ్స్‌లో గ్రేస్ హ్యారిస్(45) టాప్ స్కోరర్‌గా నిలువగా.. వృంద దినేశ్(33) ఓ మోస్తరు స్కోర్ చేసింది. శ్వేతా సెహ్రావత్ (19), ఉమా ఛెత్రీ (13 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేశారు. కిరణ్ నవ్‌గిరే (1), కెప్టెన్ దీప్తి శర్మ (4), తహ్లియా మెక్‌గ్రాత్ (1), చిన్నెల్ హెన్రీ (7), సోఫీ ఎక్లెస్టోన్ (6) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సైమా ఠాకోర్ డకౌట్ కాగా.. క్రాంతి గౌడ్ (5) అజేయంగా నిలిచింది. ఈ మ్యాచ్‌లో యూపీ ఈ మాత్రం స్కోరైనా చేయగలిగిందంటే గ్రేస్ హ్యారిస్, వృంద దినేశ్ చలువే. ఈ ఇద్దరు రెండో వికెట్‌కు 79 పరుగులు జోడించారు. వీరిద్దరు క్రీజ్‌లో ఉండగా.. యుపి భారీ స్కోర్ చేసేలా కనిపించింది. అయితే స్వల్ప వ్యవధిలో వీరు ఔట్ కావడంతో యూపీ ఇన్నింగ్స్ పతనం మొదలైంది. మధ్యలో శ్వేతా సెహ్రావత్, ఉమా ఛెత్రీ కొద్ది సేపు నిలకడగా బ్యాటింగ్ చేయడంతో యూపీ 100 పరుగుల మార్కును దాటగలిగింది.

ఛేదనలో ముంబయి ఓపెనర్ మాథ్యూస్(59) రాణించినా.. యాస్టికా భాటియా(0) నిరాశపరిచింది. ఆ తర్వాత స్కీవర్(75నాటౌట్; 44బంతుల్లో 13ఫోర్లు) మ్యాచ్‌ను ముగించింది. తొలి 2 ఓవర్లలో ఆ జట్టు వికెట్లేమీ నష్టపోనప్పటికీ 2 పరుగులు మాత్రమే చేయగలిగింది. చిన్నెల్ హెన్రీ, సోఫీ ఎక్లెస్టోన్ తొలి రెండు ఓవర్లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(4నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. దీంతో ముంబయి జట్టు 17ఓవర్లలో కేవలం 2వికెట్లు కోల్పోయి 143పరుగులు చేసి విజయం సాధించింది. యుపి బౌలర్లలో ఎక్లెస్టోన్, దీప్తి శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

యుపి వారియర్స్ మమహిళల ఇన్నింగ్స్: నవ్‌గైర్ (సి)ఇస్మాయిల్ (బి)స్కీవర్ బ్రంట్ 1, హ్యారిస్ (సి)ఇస్మాయిల్ (బి)అమేలియా కెరర్ 45, డానిశ్ (సి)కలిత (బి)సంస్కృతి గుప్తా 33, దీప్తి శర్మ (సి)హర్మన్‌ప్రీత్ కౌర్ (బి)మాథ్యూస్ 4, మెక్‌గ్రాత్ (బి)సంస్కృతి గుప్తా 1, శ్వేత సెహ్రావత్ (సి)సంస్కృతి గుప్తా (బి)స్కీవర్ బ్రంట్ 19, ఉమా ఛెత్రి (నాటౌట్) 13, హెన్రీ (సి)కెర్ (బి)స్కీవర్ బ్రంట్ 7, ఎక్లేస్టోన్ (బి)ఇస్మాయిల్, సైమా ఠాకూర్ (బి)ఇస్మాయిల్ 0, క్రాంతి గౌడ్ (నాటౌట్) 5, అదనం 8. (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 142పరుగులు.

వికెట్ల పతనం: 1/2, 2/81, 3/95, 4/87, 5/93, 6/111, 7/123, 8/135, 9/135

బౌలింగ్: స్కీవర్ బ్రంట్ 4-0-18-3, ఇస్మాయిల్ 4-0-33-2, మాథ్యూస్ 4-0-38-1, అమన్‌జ్యోత్ కౌర్ 1-0-3-0, కెర్ 4-0-24-1, కలిత 1-0-12-0, సంస్కృతి గుప్తా 2-0-11-2.

ముంబయి ఇండియన్స్ మహిళల ఇన్నింగ్స్: మాథ్యూస్ (సి)వృందా దినేశ్ (బి)ఎక్లెస్టోన్ 59, యాస్టికా భాటియా (సి)క్రాంతి గౌడ్ (బి)దీప్తి శర్మ 0, స్కీవర్ బ్రంట్ (నాటౌట్) 75, హర్మన్‌ప్రీత్ కౌర్ (నాటౌట్) 4, అదనం 5. (17 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి) 143పరుగులు.

వికెట్ల పతనం: 1/6, 2/139

బౌలింగ్: హెన్రీ 4-0-24-0, ఎక్లేస్టోన్ 4-0-29-1, దీప్తి శర్మ 3-0-25-1, సైమా ఠాకూర్ 1-0-15-0, క్రాంతి గౌడ్ 1-0-8-0, మెక్‌గ్రాత్ 2-0-11-0, హారీస్ 2-0-29-0.



మానవ వనరుల అభివృద్ధే కీలకం

- నేపాల్-భారత్ బంధం మరింత బలోపేతం కావాలి
- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మును మహావర్
- ఎన్ఐఆర్‌డిపిఆర్‌లో నేపాల్ ప్రతినిధులకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఏ దేశం ముందుకెళ్లాలన్నా మానవ వనరుల అభివృద్ధి కీలకమని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, ఐఎఫ్ఎస్ అధికారి మును మహావర్ నొక్కి చెప్పారు. నేపాల్-భారత్ బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డిపిఆర్‌లో పట్టణ పాలనపై నేపాల్ ప్రతినిధుల కోసం అంతర్జాతీయ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇది వచ్చే నెల ఏడో తేదీ వరకు పది రోజులపాటు జరగనుంది. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సౌజన్యంతో నేపాల్ నుంచి ఎంపిక చేసిన పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధుల్లో ముగ్గురు మేయర్లు, ఇద్దరు పట్టణ/గ్రామీణ పురపాలక సంస్థల అధ్యక్షులు, ఏడుగురు సీనియర్ ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ ప్రారంభం సందర్భంగా మును మహావర్ మాట్లాడుతూ..భారతదేశం-నేపాల్ మధ్య ఉన్న ప్రత్యేక భాగస్వామ్యం మరింత బలపడేలా, పరస్పర సహకారం పెరగాలని ఆకాంక్షించారు. నేపాల్ ప్రతినిధులకు వ్యవసాయం, తోటల సంరక్షణ తదితర రంగాల్లో శిక్షణ అవసరమని నొక్కి చెప్పారు. ఈ శిక్షణ రెండు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుందని, పరస్పర అనుభవాలను పంచుకునే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సిపిఆర్‌డిపి, ఎస్ఎస్‌డి, ఎన్ఐఆర్‌డిపిఆర్ హెడ్ డాక్టర్ అంజన్ కుమార్ భాంజా మాట్లాడుతూ. శిక్షణా కార్యక్రమ రూపకల్పన లక్ష్యాలను వివరించారు. హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు నగరాలు, గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్ఐఆర్‌డిపిఆర్ డైరెక్టర్ జనరల్, డాక్టర్ జి.నరేంద్ర కుమార్, ప్రోత్సాహంతో అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయం, తోటల సంరక్షణ, పారిశుధ్య నిర్వహణ, పర్యాటక అభివృద్ధి, స్థానికంగానే నిధుల సమీకరణ, తదితర అంశాలపై తాము నేర్చుకోవాలనే ఉద్దేశంతో ఇక్కడకు వచ్చామని నేపాల్ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్ఐఆర్‌డిపిఆర్ రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ మనోజ్‌కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హమాలీల కూలి రేట్లపై జిఒ విడుదల చేయాలి

- 4, 7 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు
- హమాలీల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పెంటపాడు (పశ్చిమగోదావరి జిల్లా)

సివిల్ సప్లయిస్ హమాలీలకు పెరిగిన కూలీరేట్లు, 14 నెలల ఏరియర్స్ చెల్లింపుకు వెంటనే జిఒలు చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 4వ తేదీన మండల కార్యలయాలు, 7వ తేదీన విజయవాడ ఎండి కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు హమాలీల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. పత్తిపాడు సివిల్ సప్లయిస్ గోడౌమ్స్ వద్ద గత నవంబర్ 20వ తేదీన కూలీరేట్లు క్వింటాల్‌కి రూ.25 నుంచి 28కు పెంచేందుకు ప్రభుత్వానికి హమాలీ కార్మిక సంఘాల మధ్య ఒప్పందం జరిగింది. కానీ నేటికీ జిఒ జారీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కె.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ కూలీరేట్లు జిఒ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరిగిన కూలీరేట్లు 2024 జనవరి నుంచి 14 నెలల ఏరియర్స్ చెల్లింపుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని వారు కోరారు. ఇఎస్ఐ అమలుకు ఆటంకంగా వున్న కోర్టు కేసులను ప్రభుత్వం ఉపసంహరించాలని వారు ప్రభుత్వానికి సూచించారు. కూలీరేట్లు 25 నుంచి 28కి పెంచిన జిఒతో పాటు ఏరియర్స్ చెల్లింపుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, దసరా బోనస్, స్వీట్, యూనిఫాం, టిచ్చింగ్ ఛార్జీ, స్వీపర్ వేతనాల పెంపుకు సంబంధించిన సమస్యల్ని హమాలీ సంఘాల నాయకులతో తక్షణమే చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మార్చి 4వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మండల కార్యాలయాల వద్ద ధర్నాలు, మార్చి 7న విజయవాడ ఎండి ఆఫీసు వద్ద జరిగే ధర్నాలలో పెద్ద ఎత్తున హమాలీలు పాల్గొని జయప్రదం చేయాలని వారు హమాలీలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే మార్చి 20 నుంచి సమ్మెకు దిగుతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మజ్జి సింహాచలం, నిమ్మల వెంకట సుబ్రహ్మణ్యం, కవల గంగరాజు, కొప్పు సత్యనారాయణ, మద్దాల రంగారావు, జడ్జి వరలయ్య, సివిల్ సప్లయిస్ కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న కర్ణాటక పోలీసులు

- తమ సరిహద్దు ప్రాంతమని వాదించిన స్థానికులు

ప్రజాశక్తి - రొద్దం (సత్యసాయి జిల్లా)

కర్ణాటక సరిహద్దులో ఉన్న ఆంధ్ర పెన్నానది నుంచి గృహ నిర్మాణ అవసరాల కోసం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను కర్ణాటక పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయంపై గ్రామస్తులకు, పోలీసులు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈఘటనకు సంబందించిన వివరాలు... మండలంలోని నారనాగేపల్లి సమీపంలో పెన్నానదిలో మంగళవారం రాత్రి సమయం లో నారనాగేపల్లి గ్రామానికి చెందిన వారు ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతుండగా కర్ణాటక పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఇది కర్ణాటక ప్రాంతమని ఇసుకను తరలించడానికి వీలులేదని ట్రాక్టర్లకు స్టేషన్‌కు తీసుకురావాలని తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసులు హెచ్చరించారు. అయితే ట్రాక్టర్ వారికి గ్రామస్తులు మద్దతు పలికారు. ఇది ఆంధ్రప్రాంతమని అడ్డుకోవటానికి వీలులేదని సమాధానమిచ్చారు. అయినా కర్ణాటక పోలీసులు ట్రాక్టర్ యజమానులను బెదిరించారు. ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. దీంతో గ్రామస్తులు స్థానిక విలేకరులకు సమాచారమివ్వగా వారు అక్కడికి వెళ్లారు. ఇసుకను తరలిస్తున్న ప్రాంతం ఆంధ్రకు చెందినదని గూగుల్ మ్యాప్‌ద్వారా చూపించారు. అయినా వినలేదు. దీంతో చివరకు ఇక్కడి విషయాన్ని తిరుమణి పోలీసుస్టేషన్‌కు పోలీసులకు సమాచారమిచ్చారు. ఇసుకను తవ్వుతున్న ప్రాంతం ఆంధ్రకు చెందినదని నిర్ధారించుకుని ఘటనాస్థలంలో ఉన్న పోలీసులకు వెనక్కు పిలిపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం కర్ణాటక పోలీసులు వచ్చి ట్రాక్టర్ యజమానులను బెదిరించి రూ. 15వేలు వసూలు చేసుకుని వెళ్లారని ఈ విషయం తెలిసిన మరో బ్యాచ్ పోలీసులు డబ్బుల వసూలుకు వచ్చి ఉంటారని ఆరోపించారు.

రేషన్ కార్డుదారులకు ఇకెవైసి బెంగ

- కార్డులో ఉన్నవారందరూ వేలిముద్రలు వేయాల్సిందే
- వేయకపోతే కార్డులో పేరు తొలగిస్తారని ప్రచారం
- పనులు వదిలిపెట్టి రేషన్‌షాపుల వద్ద లబ్ధిదారుల పడిగాపులు

ప్రజాశక్తి-పెనుకొండ



శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ డివిజన్‌లో 2,31,862 రేషన్ కార్డులున్నాయి. ఈ కార్డుల్లో దాదాపు 9.5లక్షల మంది ఉన్నట్లు అంచనా. ప్రతినెలా 2,320 క్వింటాళ్ల బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ కేటాయిస్తోంది. ఈ బియ్యాన్ని 502 రేషన్‌షాపుల ద్వారా కార్డులదారులందరికీ పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లక్షలాది మంది కార్డుదారులందరూ కేవలం వారం వ్యవధిలోనే ఇకెవైసి చేయించుకోవాలంటూ ఫోన్లు వస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో ఇప్పటికే కార్డుదారులతో ఇకెవైసి పూర్తి చేయించారు. అధికారుల అలసత్వం, డీలర్ల నిర్లక్ష్యం కారణంగా ఇంత వరకూ సత్యసాయి జిల్లాలో ఈ తంతు పూర్తి కాలేదు. జిల్లా అధికారుల హెచ్చరికలతో పౌరసరఫరాల శాఖ అధికారులు ఆఘమేఘాల మీద ఈ కార్యక్రమం పూర్తి చేసేందుకు ఉపక్రమించారు. వారి నిర్లక్ష్యానికి పేదలను బలి చేస్తూ ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. అధికారుల ఆదేశాలతో డీలర్లు హడావుడిగా కార్డుదారులను భయపెట్టి ఈకేవైసీ చేయించే పనిలో నిమగ్నం అయ్యారు.

ఈనెల 28వరకు గడువు

రేషన్‌కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందూ ఈనెల 28వ తేదీలోపు వేలిముద్రలు వేసి ఇకెవైసి చేయించుకోవాలని డీలర్లు గడువు విధించారు. దీంతో రేషన్ కార్డు దారులు ఆఘ మేఘాలపై ఆధార్ కార్డులు తీసుకుని కుటుంబలోని సభ్యులందరినీ రేషన్‌షాపుల వద్దకు పిలుస్తున్నారు. దీంతో రేషన్‌షాపుల వద్ద జనం పడిగాపులు కాస్తున్నారు. ఒక రేషన్ కార్డులో ఉన్న వారిందరితో వేలిముద్రలు తీసుకోవాలంటే కనీసం 10 నుంచి 15 నిమిషాల వ్యవధి పడుతోంది. సర్వర్ సమస్యలు తోడు కావడంతో ఉదయం నుంచి సాయంత్ర వరకూ 10 నుంచి 20 కుటుంబాలు మాత్రమే ఇకెవైసి చేసే పరిస్థితి క్షేత్ర స్థాయిలో కన్పిస్తోంది.

విద్యార్థులకు ఇబ్బందులు

కార్డుల్లో ఉన్న వారందరూ ఇకెవైసి చేయించుకోవాలనే నిబంధనతో ఇతర ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతుఆన్నరు. ఉన్నఫళంగా చెప్పడంతో వారంతా సెలవులు పెట్టి సొంత ఊరికి వచ్చి ఇకెవైసి చేయించేందుకు ఇబ్బందిపడుతున్నారు. పరీక్షల సమయం కావడంతో వారిని పంపడానికి పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఒప్పుకోవడం లేదు.

చిల్లావారిపల్లిలో ఘర్షణ

- రెండు గ్రామాల మధ్య కొనసాగిన ఆధిపత్య పోరు
- స్థానిక యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - తాడిమర్రి (సత్యసాయి జిల్లా)

శివరాత్రి సందర్భంగా మండల పరిధిలోని చిల్లావారిపల్లి గ్రామ సమీపాన ఉన్న శ్రీ కాటి కోటేశ్వర స్వామి ఆలయ పూజల విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. పూజల విషయంలో రెండు వర్గాల మధ్య గతంలో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని పోలీసులు ఎంతటి బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను చేసిన తిరిగి బుధవారం ఘర్షణ చోటు చేసుకుంది. తమ గ్రామానికి పూజ చేసే అవకాశం దక్కలేదని చిల్లరవారిపల్లికి చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘర్షణకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. ఆలయ నూతన అర్చకుడి నియామకం ఎండోమెంట్ వారి ఆధ్వర్యంలో జరిగింది. నూతన అర్చకుడిగా చిల్లకొండయ్య పల్లి గ్రామానికి చెందిన చిల్లా నాగేశ్వరయ్యను ఎండోమెంట్ డిఇఒ నరసింహ రాజు, వివో బిఆర్ వెంకటేష్ ఇన్స్పెక్టర్ వన్నూరు స్వామి ఆధ్వర్యంలో చిల్ల కొండయ్య పల్లి మాజీ ఎంపిపి కొడిదేల రాజశేఖర్, మాజీ కన్వీనర్ కొడివేల సాయి సమక్షంలో నియమించారు. ఈ నేపథ్యంలో స్వామివారికి సంబంధించిన వెండి ఆభరణాలు, నాగఫణిగలను మునుపు పని చేస్తున్నటువంటి బ్రాహ్మణ అర్చకుడైన అశోక్ శాస్త్రి అందరి సమక్షంలో పొందుపరిచారు. అదే తరుణంలో చిల్లవారిపల్లి గ్రామంలో ఉన్నటువంటి చిల్లా అంకె నల్లపు గంగిరెడ్డి జానగాని ఉరుముల దాసగానిపల్లి ఏడు కాపుల వారికి సంబంధించిన ఉత్సవ గుర్రాల ప్రతిమలను ఊరేగింపు కోసం అందరి అంగీకారంతో పోలీసు వారి సమక్షంలో రెవెన్యూ ఎండోమెంట్ వారి ఆధ్వర్యంలో బొలెరో వాహనంపై మూడు గుర్రాలను తీసుకువెళ్లడానికి సిద్ధమయ్యారు. అయితే చిల్లవారి పల్లి గ్రామస్తులు వాహనాన్ని అడ్డుకున్నారు. గుర్రాల ప్రతిమలను తీసుకుపోతే పెట్రోల్ పోసుకుని తగలబెట్టుకుంటామని కొందరు మహిళలు హెచ్చరించారు. ఈసందర్భంగా మహిళలు పెట్రోల్ ఒంటిపై పోసుకొనడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు.

కొద్దిమంది ప్రజలు బొలెరో వాహనాన్ని అడ్డుకొని రాళ్లతో కట్టెలతో దాడి చేసి బొలెరో వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘర్షణలో వాహన డ్రైవర్‌కు, అందులో ఉన్న వారికి గాయాలు అయ్యాయి. దీంతో పోలీసులు స్పందించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గుర్రాల ప్రతిమను వెనక్కి తీసుకువెళ్లి యదావిధిగా ఉన్న స్థానంలో ఉంచారు. తర్వాత ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు.

మూసీ పునరుజ్జీవనానికి సహకరించండి

- సెమీ కండక్టర్ మిషన్‌కు అనుమతించండి
- ప్రధాని మోడీకి తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడే ముఖ్యమైన ఆరు ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించాలని ప్రధాని మోడీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇందులో హైదరాబాద్ మహానగరంలో మెట్రో రైలు సౌకర్యం అన్ని ప్రాంతాలకూ అందుబాటులోకి ఉద్దేశించిన హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2కు అనుమతించాలని కోరారు. బుధవారం ప్రధాని మోడీతో ఆయన అధికారిక నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మెట్రో రైల్ ఫేజ్-2, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం మంజూరు, మూసీ పునర్జీవన ప్రాజెక్ట్‌కు ఆర్థిక సహకారం, మూసీ-గోదావరి లింక్ ప్రాజెక్ట్‌కు రూ.2 వేల కోట్లు, రాష్ట్రానికి అదనపు ఐపిఎస్‌ల కేటాయింపు, ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టుకు అనుమతి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

హైదరాబాద్ నగరంలో ఫేజ్-2 కింద రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కి.మీ పొడవైన ఐదు కారిడార్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందని తెలిపారు. కేంద్రంతో కలిసి జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్టు వివరించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా 18 శాతం (రూ. 4,230 కోట్లు), రాష్ట్ర ప్రభుత్వ వాటా 30 శాతం (రూ.7,313 కోట్లు), రుణ భాగంగా 48 శాతం (రూ.11,693 కోట్లు)గా ఉందన్నారు. బెంగళూరు సెకండ్ ఫేజ్ (రూ.14,788 కోట్లు)ను 2021లో, థర్డ్ ఫేజ్ (రూ.15,611కోట్లు)ను 2024లో కేంద్రం ఆమోదించినట్టు గుర్తు చేశారు.

ఐటి రంగం, ఫార్మా పరిశ్రమలు, లాజిస్టిక్ పార్క్‌లతో హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) రాబోయే ఐదేళ్లలో మరింత రద్దీగా మారబోతోందని వివరించారు. ఈ నేపథ్యంలో రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో ఇప్పటికే 90 శాతం భూసేకరణ పూర్తయినందున ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగాన్ని వెంటనే మంజూరు చేయాలని ప్రధానికి సిఎం విజ్ఞప్తి చేశారు. మూసీని ప్రక్షాళన చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రానికి కేవలం 61 ఐపిఎస్ క్యాడర్ పోస్టులు మాత్రమే వచ్చాయని, అయితే ఇప్పుడున్న అవసరాలకు ఈ అధికారుల సంఖ్య సరిపోవడం లేదని, తెలంగాణకు అదనంగా 29 ఐపిఎస్ పోస్టులు మంజూరు చేయాలని మోడీని రేవంత్ కోరారు. సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు తెలంగాణలో ఉన్నందున ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు అనుమతించాలని ప్రధానిని కోరారు. ఈ భేటీలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై సీఎం రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీ నివేదిక అందజేశారు. 2017 నుంచి 2022 వరకు తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉంటూ వస్తోన్న అంశాలపై దృష్టి పెట్టాలనీ, వాటిని పరిష్కరించాలని సూచించారు.

ఎన్నికల కోడ్ పట్టదా..?

- నిషేధాజ్ఞలు పట్టని వ్యాపారులు
- ఏరులై పారుతున్న మద్యం
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎన్నికల అధికారుల ఆదేశాలను ప్రయివేట్ మద్యం వ్యాపారులు బేఖాతరు చేశారు. గురువారం గ్రాడ్యు యేట్స్ ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసి వేయాలని ఎన్ని కల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆచరణలో మద్యం షాపులు మూసి వేసినా ప్రత్యామ్నాయంగా విచ్చల విడిగా మద్యం అమ్మకాలను సాగించారు. ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి అంటే 25వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు మద్యం విక్రయాలపై ఎన్నికల సంఘం నిషేధం విధించింది.

అలాగే వచ్చేనెల 3న జరిగే కౌంటింగ్ సందర్భంగానూ మద్యం విక్రయాలను నిషేధించింది. దీనికి సంబంధించి ఎక్సైజ్ శాఖ ఎక్కడా మద్యం దుకాణాలు తెరవకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. క్లబ్బులు, స్టార్ హోటల్స్, రెస్టారెంట్లు, సాధారణ హోటల్స్‌లో కూడా ఆయా తేదీల్లో మద్యం అమ్మకూడదని నిబంధనలు విధించారు.

కోడ్ పట్టని వ్యాపారులు

ఎన్నికల కోడ్ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి కాకినాడ జిల్లాలో 155 ప్రయివేటు మద్యం దుకాణాలు, 20 బార్లు, డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ కోనసీమ జిల్లాలో 169 షాపులు, 10 బార్లు, తూర్పు గోదావరి జిల్లాలో 154 దుకాణాలు, 19 బార్లకు ఎక్సైజ్ అధికారులు సీలు వేశారు. 27న సాయంత్రం 4 గంటల వరకు షాపులు ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవకూడదని యజమానులకు వివరించారు. అయితే మద్యం వ్యాపారులు ఒక అడుగు ముందుకేసి ముందుగానే మద్యం కేసులను షాపుల సమీపంలోనే పక్కన పెట్టారు. సీలు వేసిన రోజు నుంచే వెనక భాగం నుంచి అమ్మకాలు మొదలుపెట్టారు. దాదాపుగా జిల్లాలో ఉన్న అన్ని దుకాణాల్లోనూ ప్రస్తుతం ఈ అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. విక్రయాలు జరుగుతున్నట్లుగా సంబంధిత శాఖ అధికారులకు తెలిసినప్పటికీ చూచి చూడనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే పలుచోట్ల సిండికేట్‌గా మారిన వ్యాపారులు ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు ప్రతి నెలా కొంత మొత్తంలో మామూళ్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కోడ్ నిబంధనలను ఉల్లంఘించి మద్యం వ్యాపారులు ఇష్టారాజ్యంగా అమ్మకాలు జరుపుతున్నప్పటికీ అధికారులు అటువైపు చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధిక ధరలకు అమ్మకాలు

సీలు వేసి ఉన్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలోనే అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మద్యం వ్యాపారులు అధిక ధరలకు వివిధ బ్రాండ్లను విక్రయిస్తున్నారు. క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50 కి అదనంగా అమ్ముతూ ముందు బాబుల జేబులను కొల్లగొడుతున్నారు. ప్రధానంగా కాకినాడ, పిఠాపురం. యు.కొత్తపల్లి, గొల్లప్రోలు, కాకినాడ రూరల్, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, తుని తదితర ప్రాంతాల్లో ఈ విక్రయాలు గత రెండు రోజులుగా జోరుగా సాగుతున్నాయి. బాటిల్‌పై ఎంఆర్‌పికి మించి అమ్ముతున్నప్పటికీ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై మందుబాబులు గగ్గోలు పెడుతున్నారు.

అయితే అదనంగా అమ్ముతున్న సొమ్ములో కొంత ఎక్సైజ్ శాఖ అధికారులకు ముట్టజెప్పితుండడం వల్లనే ఈ వ్యవహారంపై నోరు మెదపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించడంపై ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించినప్పటికీ స్పందించకపోవడం గమనార్హం.

చుక్కలూరులో నేరేడు మొక్కల నరికివేత

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అనంతపురం జిల్లా తాడిపత్రి మండల పరిధిలోని చుక్కలూరు గ్రామంలో 43 నేరేడు మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున నరికి వేశారు. రూరల్ పోలీసులు, బాధితుడు తెలిపిన సమాచారం మేరకు... చుక్కలూరు గ్రామానికి చెందిన మెడికుర్తి శ్రీనివాసులు తనకున్న ఒకటిన్నర ఎకరంలో మామిడి, నేరేడు మొక్కలను సాగు చేసుకున్నారు. రెండు సంవత్సరాల కాలం ఉన్న నేరేడు మొక్కలు వచ్చే ఏడాది దిగుబడికి రానున్నాయి. ఇంతలో గుర్తు తెలియని వ్యక్తులు 43 నేరేడు మొక్కలను నరికేశారు. దిగుబడి వచ్చే మొక్కలు నరికి వేయడంతో బాధిత రైతు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మొక్కలు నరికిన దుండగులను శిక్షించాలి : రైతుసంఘం

చుక్కలూరు గ్రామంలో రైతు శ్రీనివాసులకు చెందిన 43 నేరేడు మొక్కలను నరికేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, నాయకులు జయశేఖర్ రెడ్డి, రెడ్డి రమేష్, శ్రీనివాసులు బుధవారం ఉదయం బాధిత రైతు పొలాన్ని పరిశీలించారు. నరికివేసిన నేరేడు మొక్కలను పరిశీలించి బాధిత రైతుతో మాట్లాడారు. అనంతరం రైతుసంఘం నాయకులు మాట్లాడుతూ ఇటీవల మొక్కలు నరికే సంస్కృతి ఎక్కువైందన్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను ఇలా నరికేయడం, తొలగించడం విష సంస్కృతి అన్నారు. బాధిత రైతు శ్రీనివాసులుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు కారణమైన దుండగులను అరెస్టు చేసి శిక్షించాలన్నారు.

రాయలసీమకే తలమానికం 'స్విమ్స్'

- 32వ వార్షికోత్సవ సభలో వక్తలు
- తొమ్మిది మందికి గోల్డ్‌మెడల్స్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాయలసీమకే తలమానికంగా లక్షలాది మంది ప్రాణాలను కాపాడుతూ మెరుగైన వైద్యం స్విమ్స్‌లో అందుతోందని వక్తలు ఉద్ఘాటించారు. మరో రెండు నెలల్లో శ్రీబయోను అందుబాటులోకి తెస్తామన్నారు. పరిశోధన రంగంలో ఎంతో ప్రగతిని సాధిస్తుందన్నారు. మహతి ఆడిటోరియంలో స్విమ్స్ 32వ వార్షిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సంచాలకులు, ఉపకులపతి ఆర్‌వి కుమార్, డాక్టర్ అరుణ, డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ, ఆర్‌బిట్లా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా కళావత్ సంయుక్తంగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. డాక్టర్ ఆర్‌వి కుమార్ మాట్లాడుతూ ఒకేరోజు మూడు రకాల కీలకమైన ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేయడం దేశంలో ఎక్కడా జరగలేదని, ఆ ఘనత స్విమ్స్‌కే దక్కిందన్నారు. ఎక్కువ డబ్బు ఆర్జించే నైపుణ్యం, శక్తి ఉన్నప్పటికీ శ్రీవారి సంస్థలో పనిచేసి, ప్రజల సేవలో తరించాలన్న గొప్ప ఆలోచనతో స్విమ్స్ వైద్యులు పనిచేస్తున్నారన్నారు. వారి స్ఫూర్తితో వైద్య విద్యార్థులు డబ్బు ప్రదానం కాకుండా పేదలకు సేవలందించేందుకు తమ భవిష్యత్‌ను అంకితం చేయాలన్నారు. స్విమ్స్ నిర్వహణ బాధ్యతను పూర్తిగా టిటిడి తీసుకుందన్నారు. స్విమ్స్ అభివృద్ధికి టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె.శ్యామల సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఐఐటి, ఐసర్, అరవింద ఐ హాస్పిటల్, తిరుపతిలోని అన్ని యూనివర్శిటీలతో ఎంఒయులను కుదుర్చుకున్నట్లు చెప్పారు. అదేవిదంగా యునైటెడ్ కింగ్డమ్ (యు. కె) వారితో స్టూడెంట్స్ ఎక్స్చేంజి ప్రోగ్రామ్ కుదుర్చుకున్నట్లు తెలిపారు. స్విమ్స్ నందు త్వరలో అప్తామాలాజి, డెంటల్, ఇఎన్‌టి విభాగాల పి. జి కోర్స్ లు అందుబాటులో వస్తాయని తెలియజేసారు. రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ వార్షిక నివేదికను సమర్పించారు. ఆకాంక్ష 2025 వార్షిక సీడీని స్విమ్స్ సంచాలకులు ఆవిష్కరించారు. వైద్య విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 7 మంది వైద్యులకు గోల్డ్ మెడల్, ఎంబిబిఎస్ విద్యార్థినికి 1 గోల్డ్ మెడల్, స్టాఫ్ నర్సు కు గోల్డ్ మెడల్ బహుమతి ప్రదానం చేశారు. ఈ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన విద్యా సాంస్కృతిక, సాహిత్య, క్రీడా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విజేతలకు బహుమతులను అందజేశారు. కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్. వనజాక్షమ్మ, దంత వైద్య విభాగాదిపతి డాక్టర్ మధుబాబు, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్. మాధవి పాల్గొన్నారు.

గిరిజన హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం

- అటవీ భూముల నుంచి బలవంతంగా గెంటివేత
- వాణిజ్య అవసరాలకు ప్రకృతి సంపద ధారాదత్తం
- చట్టాలను కార్పొరేట్లకు చుట్టాలుగా మారుస్తున్న సర్కార్



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోడీ తన తాజా 'మన్ కీ బాత్' కార్యక్రమంలో గిరిజనులపై ప్రశంసల వర్షం కురిపించారు. అనేక గిరిజన తెగలు మన చరిత్ర, సంస్కృతిలో అంతర్భాగమయ్యాయని, పలువురు గిరిజనులు దేవతలుగా కీర్తించబడ్డారని కొనియాడారు. అటవీ సంపద పరిరక్షణలో వారంతా భాగస్వాములవుతున్నారని చెప్పారు. ప్రకృతితో ఎలా సహజీవనం చేయాలో వారు ఈ ప్రపంచానికి నేర్పారని తెలిపారు. ఈ నెల 23న ప్రధాని తన 119వ మన్ కీ బాత్‌లో గిరిజనం గురించి చెప్పిన మాటలు అక్షర సత్యాలు. అయితే ప్రకృతితో గిరిజనులకు ఉన్న అనుబంధాన్ని తన ప్రభుత్వం ఎలా తెంచేస్తోందో మాత్రం ఆయన చెప్పలేదు. తమ ఆవాసాలుగా భావించే నదులు, అడవులు, కొండలు, గుట్టలు, పచ్చిక బయళ్ల నుంచి గిరిజనులను ఎలా తరిమేస్తున్నదీ చెప్పలేదు.

నిరాశ్రయులవుతున్న లక్షలాది ఎస్టీలు

2013లో రూపొందించిన ఓ అంచనా ప్రకారం...వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాలు, జాతీయ పార్కుల ఏర్పాటు పేరుతో ఆరు లక్షల మంది గిరిజనులను కేంద్రం నిరాశ్రయులను చేసింది. దేశంలో ఉన్న పులుల సంరక్షణ ప్రాంతాల (టైగర్ రిజర్వ్) నుంచి 64,801 కుటుంబాలను కలిగిన 591 గ్రామాలను ఖాళీ చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని పులుల సంరక్షణ జాతీయ సంస్థ గత సంవత్సరం జూన్ 19న సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సంస్థ కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆజమాయిషీలో నడుస్తోంది. టైగర్ రిజర్వ్‌లలో నివసిస్తున్న వేలాది మంది గిరిజనులు ఆ సంస్థ ఆదేశాలను నిరసిస్తూ ఆందోళన కొనసాగిస్తున్నారు. దేశంలోని యాభై టైగర్ రిజర్వ్‌ల నుంచి ఐదున్నర లక్షల మంది ఎస్టీలు, ఇతరులను బలవంతంగా ఖాళీ చేయించేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇలా షెడ్యూల్డ్ తెగల వారిని టైగర్ రిజర్వ్‌ల నుంచి బలవంతంగా ఖాళీ చేయించడం వన్యప్రాణుల సంరక్షణ చట్టం సహా అనేక చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ ఒప్పందాలకు కూడా ఇది విరుద్ధమే అవుతుందని వారు గుర్తు చేశారు. అయినా కేంద్రం తన ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. కేవలం 2021 తర్వాతే టైగర్ రిజర్వ్‌ల నుంచి ఖాళీ చేయించాల్సిన 2.9 లక్షల మందిని గుర్తించింది.

చట్టానికి తూట్లు

2006 నాటి అటవీ హక్కుల గుర్తింపు చట్టం (ఎఫ్ఆర్ఏ) కింద గిరిజన తెగలన్నింటికీ హక్కులు ఉన్నాయి. తాము స్వచ్ఛందంగా అంగీకరించి ఖాళీ చేస్తే తప్ప ఫారెస్ట్ రిజర్వ్‌లో నివసించే హక్కును వారికి ఆ చట్టం కల్పించింది. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వాలు వారికి టైటిల్ డీడ్స్ కల్పించాల్సి ఉంటుంది. అయితే చాలా మంది గిరిజనులకు నేటికీ అవి అందలేదు. ఎఫ్ఆర్ఏ కేవలం కాగితపు పులిగా మిగిలిపోయింది. గత ఏడాది మహారాష్ట్ర, ఒడిశా, కర్నాటక, అసోం, ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని జిల్లాలలో చేసిన అధ్యయనం ప్రకారం చట్టాన్ని అమలు చేయడంలో వైఫల్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

వాణిజ్య అవసరాలకు అటవీ భూములు

కార్పొరేట్ సంస్థలు, బడా వ్యాపారులు తమ వనరులు, భూములను వాణిజ్య అవసరాల కోసం సేకరించడాన్ని అనేక గిరిజన తెగలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమ అంగీకారం లేకుండానే మైనింగ్ కార్యకలాపాలు జరుపుతున్నారని, పర్సా బొగ్గు గని వద్ద విచక్షణారహితంగా చెట్లను నరికేశారని ఛత్తీస్‌గఢ్‌లోని హస్‌డియో అరంద్ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనం ఆరోపిస్తోంది. గ్రామసభ అనుమతి పొందినట్లు ఫోర్జరీ పత్రాలు సృష్టించి మైనింగ్ చేపట్టారని విచారణలో తేలింది. 2024లో కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అటవీ సంరక్షణ చట్టాన్ని సవరించింది. 'అడవి' అనే పదానికి సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. ఎలాంటి అనుమతులు అవసరం లేకుండా అటవీ భూములను అభివృద్ధి పనుల కోసం సేకరించవచ్చునని స్పష్టం చేసింది. అయితే సుప్రీంకోర్టు అడ్డుపడడంతో గిరిజనులకు కొంత ఊరట లభించింది. అటవీ భూముల్లో సర్వేలు చేపట్టేందుకు, డ్రిల్లింగ్ నిర్వహించేందుకు అనుమతులు ఇచ్చే విషయంలో ఉదారంగా వ్యవహరించాలంటూ గత సంవత్సరం నవంబరులో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పర్యావరణ శాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది.

ఇదేమి సహజీవనం?

గుజరాత్‌లోని గిర్ అడవుల్లో గిరిజనులు పులుల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారు ప్రకృతితో సహజీవనం చేస్తున్నారని చెప్పడానికి ఇది ఓ ఉదాహరణ అని ప్రధాని తన మన్ కీ బాత్‌లో చెప్పారు. కానీ అక్కడ జరిగిందేమిటి? గుజరాత్‌లో 2010లో 411 పులులు ఉండగా 2020 నాటికి వాటి సంఖ్య 676కి పెరిగింది. అయితే అదే సమయంలో గిరిజనుల జీవనాధారమైన పశు సంపదపై పులుల దాడి ఎక్కువైంది. గిరిజనులపై కూడా పులులు దాడి చేసిన ఉదంతాలు ఉన్నాయి. సహజీవనం మాట దేవుడెరుగు...వారు పులులు అంటేనే భయపడే పరిస్థితి తలెత్తింది. వాటి కారణంగా తమ ఆర్థిక పరిస్థితి దెబ్బ తింటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిషేధం ఆరేళ్లు సరిపోతుంది !

- దోషులుగా తేలిన రాజకీయ నేతలపై జీవితకాలం నిషేధం వద్దు
- సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

వివిధ కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలనడాన్ని కేంద్రం తీవ్రంగా వ్యతిరేకించింది. అటువంటి కేసుల్లో సదరు వ్యక్తిపై ఆరేళ్ళ పాటు నిషేధం విధిస్తే సరిపోతుందని తెలిపింది. జీవిత కాలం పాటు ఒక వ్యక్తిని నిషేధించమనేది చాలా కఠినమైనదని వ్యాఖ్యానించింది. ఈ మేరకు కేంద్రం సుప్రీం కోర్టులో బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం పాటు నిషేధం విధించాలని కోరుతూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీం కోర్టులో గతంలో ఒక పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని సుప్రీం కోర్టు విచారించింది. ఆ సందర్భంగా ఈ అంశంపై స్పందన తెలియచేయాలంటూ కేంద్రాన్ని, కేంద్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీం కోర్టు కోరింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని వివరిస్తూ బుధవారం అఫిడవిట్ దాఖలు చేసింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా నిర్ధారించబడిన రాజకీయ నేతలపై జీవితాంతం నిషేధం విధించాలనడం అత్యంత కఠినమైన చర్య అని, ప్రస్తుతం అమల్లో వున్న విధంగా ఆరేళ్ళ పాటు నిషేధం విధిస్తే సరిపోతందని స్పష్టం చేసింది. అయినా, ఇటువంటి రాజకీయ నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలా లేదా అనేది పార్లమెంట్ పరిధిలోని అంశమని స్పష్టం చేసింది. ఇప్పటికే అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని పరిశీలించి ఆరేళ్ళ నిషేధాన్ని విధించాలని పార్లమెంట్ నిర్ణయించిందని కేంద్రం తన అఫిడవిట్‌లో సుప్రీం కోర్టుకు తెలియచేసింది. అయినా, జీవిత కాలం నిషేధానికి పిలుపివ్వడమంటే అది పార్లమెంట్‌ను ఒక ప్రత్యేక తరహాలో చట్టాన్ని రూపొందించాలని ఆదేశించడమే అవుతుందని, అది జ్యుడీషియల్ రివ్యూ అధికారాలకు మించి వుందని కేంద్రం వ్యాఖ్యానించింది.

కాలికట్ డీన్‌గా 'గాడ్సే' భక్తురాలు

- గతంలో గాడ్సేని ప్రశంసిస్తూ వ్యాఖ్యలు



తిరువనంతపురం : కాలికట్‌లోని నిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.శైలజను నిట్ డీన్‌గా నియమించడంపై కేంపస్‌లో వివాదం రేగింది. గతేడాది జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నాథూరామ్ గాడ్సేని ప్రశంసిస్తూ, 'భారతదేశాన్ని కాపాడినందుకు గాడ్సేను చూస్తే గర్వంగా వుంది.' అని ఆమె వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 1 నుండి ఈ నియామకం అమల్లోకి రానుంది. కాగా, ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, ఆందోళన చేపట్టనున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. తక్షణమే ఆమె నియామకాన్ని రద్దు చేయాలని కొజికోడ్ కాంగ్రెస్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కాగా తాజా పరిణామాలపై వ్యాఖ్యనించడానికి శైలజ తిరస్కరించారు. ప్రస్తుతం డాక్టర్ శైలజ నిట్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. గతేడాది గాంధ వర్ధంతి రోజున ఆమె ఫేస్‌బుక్‌లో గాడ్సేపై వ్యాఖ్యలతో పోస్టు పెట్టారు. 'హిందూ మహాసభ కార్యకర్త నాథూరామ్ గాడ్సే భారతదేశంలో చాలా మందికి హీరో' అని ఒక న్యాయవాది పెట్టిన పోస్టుపై ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. శైలజ తర్వాత ఆ వ్యాఖ్యను తొలగించారు. కానీ ఈలోగానే ఆ పోస్టు వైరల్ అయింది. ఆమెపై అనేక ఫిర్యాదులు రావడంతో కొజికోడ్ నగర పోలీసులు ఆమెపై ఐపిసిలోని సెక్షన్ 153 కింద కేసు నమోదు చేశారు. ఆమెను నిట్ నుండి తొలగించాలని వామపక్షాలు, కాంగ్రెస్ తదితర పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

రాజకీయ పార్టీగా జమాతే ఇ ఇస్లామి పునరాగమనం

- త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ

శ్రీనగర్ : కాశ్మీర్‌లో నిషేధిత రాజకీయ మత సంస్థ జమాతే-ఇ-ఇస్లామి (జెఇఐ) రాజకీయ పార్టీగా పునరాగమనం చేయనుంది. జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ ఫ్రంట్ (జెడిఎఫ్) అనే పార్టీని ప్రారంభిస్తున్నట్లు జెఇఐ సభ్యులు తాజాగా ప్రకటించారు. త్వరలో శ్రీనగర్‌లో పార్టీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అలాగే, ఏప్రిల్, మేలో జరిగే పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి జెడిఎఫ్ సన్నాహాలు చేస్తుందని తెలిపారు. 'మేము కాశ్మీర్ ప్రజల కోసం పని చేస్తాం. ఇక్కడి ప్రజల సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరిస్తాము' అని చెప్పారు. విశ్వసనీయుత కలిగిన అభ్యర్థులను ఎన్నికల్లో పోటీకి నిలబెడతామని, అయితే వారు సైద్ధాంతికంగా జెఇఐతో ఉండాల్సిన అవసరం లేదని అన్నారు. కాగా, జెఇఐకి ఎన్నికల్లో పోటీ చేయడం కొత్త కాదు. 1990కు ముందు ఎన్నికల్లో పాల్గొంది. అయితే గణనీయంగా సీట్లను కూడా గెలుచుకోలేదు. 1990 తరువాత జెఇఐ ఎన్నికలకు దూరంగా ఉండటంతో దాని సభ్యులు పిడిపి మద్దతుదారులుగా మారారు. గతేడాది జరిగిన జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో జెఇఐ మద్దతుతో 10 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అయితే పిడిపిని బలహీన పర్చడానికి బిజెపి ప్రోత్సాహంతోనే జెఇఐ అభ్యర్థులు పోటీ చేశారనే వార్తలు కూడా ప్రచారంలో ఉన్నాయి. తాజాగా జెడిఎఫ్ ఏర్పాటు పిడిపిని బలహీనపరుస్తుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఏదేమైనా స్థానిక సంస్థల ఎన్నికల ముందు జెడిఎఫ్ ఏర్పాటు జమ్మూకాశ్మీర్ రాజకీయ దృశ్యాన్ని మారుస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

మరిన్ని చర్చలకు సిద్ధమవుతున్న రష్యా, అమెరికా

- క్రెమ్లిన్ వెల్లడి

మాస్కో : రష్యా, అమెరికా మరిన్ని చర్చలు జరిపేందుకు సమాయత్తమవుతున్నాయని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ప్రకటించారు. ముందుగా ఇరు దేశాల మధ్య నిపుణుల స్థాయి చర్చలు జరిగేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన బుధవారం తెలిపారు. గత వారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశం, అంతకుముందు ఇరు దేశాల అధ్యక్షులు పుతిన్, ట్రంప్‌లు ఫోన్ కాల్ చేసుకున్న నేపథ్యంలో ఈ చర్చలకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత ట్రంప్, పుతిన్‌లు ముఖాముఖి భేటీ జరిపే అవకాశం వుందని పెస్కోవ్ పునరుద్ఘాటించారు. అయితే ఆ సమావేశం ఎప్పుడు జరుగుతుందనే వివరాలు వెల్లడించలేదు.

ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనకుండా ఇయు అడ్డుకుంటోందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన ఖతార్‌లో పత్రికా సమావేశంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం యుఎస్ ప్రతిపాదించిన, భద్రతా మండలి ఆమోదించిన తీర్మానాన్ని సమర్ధించారు. ఉక్రెయిన్ విషయంలో రష్యా చర్యలను ఖండించకుండా రూపొందించిన ఈ తీర్మానాన్ని రష్యా, చైనాలు మద్దతిచ్చాయి. ఉక్రెయిన్ యుద్ధానికి సంబంధించినంతవరకు రాజకీయ దృశ్యం మారిపోయిన వెంటనే యూరప్ ఈ ధోరణిని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని లావ్‌రోవ్ విమర్శించారు. కీవ్‌కు సైనిక సాయం అందచేసేందుకు కొత్త ప్యాకేజీలను ప్రకటిస్తోందన్నారు. అంటే ఉక్రెయిన్ సైనిక కార్యకలాపాలను కొనసాగించేలా రెచ్చగొడుతోందన్నారు. శతాబ్దాల తరబడి సంక్షోభాలను రెచ్చగొట్టడంలో యూరప్ పాత్ర చాలా వుందని, అది ఇప్పటికీ మారలేదని అన్నారు.

ఎంఫిల్, పిహెచ్‌డి డిగ్రీలపై యుజిసి నోటిఫికేషన్ ఉపసంహరించుకోవాలి

- ఎఐఎఫ్‌యుసిటిఓ డిమాండ్

న్యూఢిల్లీ : ఎంఫిల్ లేదా పిహెచ్‌డి డిగ్రీలు పొందడానికి ముందస్తు ఇంక్రిమెంట్ల రూపంలో ఎలాంటి ప్రోత్సాహకాలు వుండబోవని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ స్పష్టం చేస్తూ ఈ నెల 10న జారీ చేసిన లేఖను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎఐఎఫ్‌యుసిటిఓ డిమాండ్ చేసింది. ఈ విషయంలో యుజిసి వైఖరిని తీవ్రంగా ఖండించింది. అదే సమయంలో 2018 డిసెంబరు 7వ తేదీన ఇదే అంశానికి సంబంధించి జారీ చేసిన మరో నోటీసును యుజిసి దృష్టికి తీసుకువచ్చింది. 2009 జులై 11కు ముందు చేరిన, నమోదు చేసుకున్న, పూర్తి చేసిన అభ్యర్థులకు కాస్ కింద ప్రమోషన్‌కు అవసరమైన సంవత్సరాల సంఖ్య యొక్క ప్రయోజనం పొందేందుకు, అలాగే అడ్వాన్స్ ఇంక్రిమెంట్లను ఆమోదించేందుకు సంబంధించిన స్పష్టతను అందులో వివరించారు. ఈ నోటిఫికేషన్‌ను తాజాగా ఈ నెల 10న జారీ చేసిన యుజిసి నోటీసు విస్మరించిందని పేర్కొంది. దీనిపై యుజిసితో చర్చలు జరపాలని ఎఐఎఫ్‌యుసిటిఓ నాయకత్వం భావిస్తోంది. ఈ అంశంపై పద పదే తమ అసంతృప్తిని వ్యక్తం చేశామని తెలిపింది. పరిశోధనా రంగాన్ని నిరుత్సాహపరుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాలకు ప్రస్తుత నోటిఫికేషన్‌కు ప్రత్యక్ష సంబంధం వుందని, ఇది 2020 నూతన విద్యా విధానం అమలు ఫలితమేనని ఎఐఎఫ్‌యుసిటిఓ ఒక ప్రకటనలో విమర్శించింది.



దక్షిణాది రాష్ట్రాలు ఒక్క స్థానాన్ని కూడా కోల్పోవు

- నియోజకవర్గాల పునర్విభజన ప్రభావంపై అమిత్ షా

కోయంబత్తూరు : పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన ప్రభావంపై అఖిల పక్ష భేటీకి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ పిలుపునిచ్చిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. పునర్విభజన ప్రభావం వల్ల దక్షిణాది రాష్ట్రాలు ఒక్క లోక్‌సభ స్థానాన్ని కూడా కోల్పోవని చెప్పారు. కోయంబత్తూరులో బిజెపి కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ప్రో-రెటా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అదనపు సీట్లు లభిస్తాయని ఆయన తెలిపారు. పునర్విభజనతో తమిళనాడుకు లోక్‌సభ స్థానాలు తగ్గుతాయనే స్టాలిన్ ప్రకటనతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని అమిత్ షా పేర్కొన్నారు.

హిమానీనదాలను రక్షించాలి

- ప్రధాని మోడీకి సోనమ్ వాంగ్‌చుక్ లేఖ

న్యూఢిల్లీ : హిమానీనదాల సంరక్షణలో భారత్ ముందుండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్‌చుక్ సూచించారు. ఈ మేరకు ప్రధానికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ జీవనదులకు మూలంగా ఉన్న హిమానీనదాలను సంరక్షించడానికి సరైన చర్యలు తీసుకోలేకపోతే నదులు ఎండిపోయే ప్రమాదముందని, 144 ఏళ్ల తరువాత మరోసారి జరిగే మహా కుంభమేళాను ఇసుకపై చేసుకోవాల్సిన దుస్థితి వస్తుందని హెచ్చరించారు. హిమాలయ హిమానీనదాలను సంరక్షించడానికి కృషి చేస్తున్న వాంగ్‌చుక్ ఇటీవల ఖార్దుంగ్‌లాలోని హిమానీనదం నుంచి మంచు ముక్కను సేకరించి దానిని న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయానికి తీసుకునివెళ్లారు. తరువాత దానిని ఈ నెల 21న అంటే ప్రపంచ హిమానీనదాల దినోత్సవానికి ఒక నెల ముందు న్యూయార్క్‌లోని హడ్సన్, ఈస్ట్ నదుల సంగం వద్ద నిమజ్జనం చేశారు. తాజాగా భారత్‌కు తిరిగివచ్చిన వాంగ్‌చుక్ ఖార్దుంగ్‌లాలోని హిమానీనదం నుంచి మంచు ముక్కను సేకరించడానికి పడిన శ్రమను విలేకరులకు వివరించారు. అనేక ఏళ్ల నుంచి హిమానీనదాల్లో మంచు తగ్గుముఖం పడుతోందని, కానీ దీనిని నివారించడానికి చర్యల్లో జాప్యం జరుగుతూనే ఉందని వాంగ్‌చుక్ విచారం వ్యక్తం చేశారు. హిమానీనదాల సంరక్షణలో భారతదేశం ముందంజలో ఉండాలని ప్రధానమంత్రికి రాసిన బహిరంగ లేఖలో వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. ఆర్కిటిక్, అంటార్కిటికా తర్వాత భూమిపై మూడవ అతిపెద్ద మంచు నిక్షేపాన్ని హిమాలయాలు కలిగి ఉన్నాయని, అందువలన వీటికి 'మూడవ ధ్రువం' అనే పేరు వచ్చిందని వాంగ్‌చుక్ గుర్తు చేశారు. అలాగే, హిమాలయ హిమానీనదాల స్థితిని అంచనా వేయడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని మోడీని వాంగ్‌చుక్ లేఖలో కోరారు. 'మనందరికీ తెలిసినట్లుగా, హిమాలయాల హిమానీనదాలు చాలా వేగంగా కరుగుతున్నాయి. అటవీ నిర్మూలన ప్రస్తుత రేటులోనే కొనసాగితే, కొన్ని దశాబ్దాలల్లో మన జీవనదులైన గంగా, బ్రహ్మపుత్ర, సింధు కాలానుగుణ నదులుగా మారవచ్చు' అని వాంగ్‌చుక్ తెలిపారు. అలాగే, 2025 ఏడాదిని అంతర్జాతీయ హిమానీనదాల సంరక్షణ సంవత్సరంగా ప్రకటించిన ఐరాసకు వాంగ్‌చుక్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికల ప్రచార వ్యయంలో బిజెపి టాప్

- 2023-24లో రూ.1754 కోట్లు ఖర్చు
- ఆదాయంలోనూ ఆ పార్టీదే పైచేయి
- ఎడిఆర్ విశ్లేషణలో వెల్లడి

న్యూఢిల్లీ : 2023-24లో ఎన్నికలు, సాధారణ ప్రచారం కోసం బిజెపి అక్షరాలా రూ.1,754 కోట్లు ఖర్చు చేసింది. ఆ సంవత్సరం వివిధ పార్టీలు చేసిన వ్యయంతో పోలిస్తే బిజెపి పెట్టిన ఖర్చే అధికమని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అనే స్వచ్ఛంద సంస్థ ఓ నివేదికలో తెలిపింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంబంధమైన ఖర్చుల కోసం రూ.619.67 కోట్లు వెచ్చించిందని ఆ నివేదిక వివరించింది. ఆరు జాతీయ పార్టీలు తమ ఆదాయ వ్యయ వివరాలతో ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన ఆడిట్ నివేదికలను ఎడిఆర్ విశ్లేషించింది. ఇతర ఖర్చుల విషయానికి వస్తే అడ్మినిస్ట్రేటివ్ ఖర్చుల కోసం బిజెపి రూ.349.71 కోట్లు, కాంగ్రెస్ రూ.340.70 కోట్లు వెచ్చించాయి.

ఏడిఆర్ నివేదిక ప్రకారం....2023-24లో కాంగ్రెస్‌కు రూ.1,225 కోట్లు, సిపిఎంకు రూ.167.636 కోట్లు, బిఎస్‌పికి రూ.64.7798 కోట్లు, ఆప్‌కు రూ.22.68 కోట్లు, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి)కి రూ.0.2244 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే ఈ ఐదు జాతీయ పార్టీల మొత్తం ఆదాయం కంటే బిజెపికే అధిక ఆదాయం (రూ.4,340.4 కోట్లు) లభించడం గమనార్హం. ఆరు జాతీయ పార్టీలు కలిపి తమకు విరాళాలు లేదా కంట్రిబ్యూషన్ల ద్వారా రూ.2,669.86 కోట్ల ఆదాయం లభించిందని ప్రకటించాయి. బిజెపి, కాంగ్రెస్, ఆప్ పార్టీలకు వాటి మొత్తం ఆదాయంలో 43.36 శాతం (రూ.2,524.13 కోట్లు) ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాల రూపంలో లభించింది. ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపికి రూ.1,685.62 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.828.36 కోట్లు, ఆప్‌కు రూ.10.15 కోట్ల ఆదాయం సమకూరింది.

మనీలాండరింగ్ కేసులో జర్నలిస్టు మహేష్ అరెస్టు

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కేసులో జర్నలిస్టు మహేష్ ప్రభుదాన్ లాంగను అరెస్టు చేసినట్లు ఇడి వెల్లడించింది. అహ్మదాబాద్‌లోని పిఎంఎల్ఎ కోర్టులో ప్రవేశపెట్టగా ప్రత్యేక జడ్జి లాంగకు ఈ నెల 28 వరకూ ఇడి కస్టడీ విధించినట్లు తెలిపింది. అహ్మదాబాద్‌లోని డిసిబి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా కేసు విచారణ చేస్తున్నట్లు తెలిపింది. అలాగే, ది హిందూ దినపత్రిక అహ్మదాబాద్ కరస్పాండెంట్‌గా పని చేస్తున్న మహేష్, ఇతరులపై మోసం, నమ్మకద్రోహం వంటి ఆరోపణలతో అహ్మదాబాద్‌లోని శాటిలైట్ పోలీస్ స్టేషన్‌లో మరొక కేసు కూడా నమోదయిందని ఇడి తెలిపింది.

అన్నదాతపై సుంకాల పిడుగు

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయ ఎగుమతులపై ప్రభావం



న్యూఢిల్లీ : అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై కొన్ని దేశాలు భారీగా సుంకాలు విధిస్తున్నాయని, తాము కూడా ఆ దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదే విధంగా పెద్ద మొత్తంలో సుంకాలు వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా పర్యటనలో మోడీ ఉన్నప్పుడే ఆయన సమక్షంలోనే ఈ విషయాన్ని ట్రంప్ చెప్పడం గమనార్హం. దీని ఫలితంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి మన దేశంలోని పలు ఎగుమతి రంగాలు తీవ్రంగా నష్టపోతాయి. వాటిలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు కూడా ఉన్నాయి. భారత్ నుంచి జరుగుతున్న సముద్ర ఉత్పత్తుల ఎగుమతులపై కూడా గణనీయమైన ప్రభావమే పడబోతోంది.

భారత్, అమెరికా మధ్య వాణిజ్య సంబంధమైన వివాదాలు ఈనాటివి కావు. ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడు అయిన తర్వాత 2018 మార్చిలో భారత్ నుంచి దిగుమతి అవుతున్న ఉక్కు, అల్యూమినియంపై అదనపు సుంకాలు విధించారు. ఫలితంగా మన దేశం నుంచి అమెరికాకు ఉక్కు ఎగుమతులు తగ్గిపోయాయి. ప్రతీకార చర్యగా భారత్ కూడా అమెరికా నుంచి దిగుమతి అవుతున్న యాపిల్స్, వాల్‌నట్స్, బాదం పప్పులపై అదనపు సుంకాలు విధించింది. అయితే బైడెన్ ప్రభుత్వంతో సంప్రదింపుల తర్వాత వాటిని ఉపసంహరించుకుంది. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడు అయిన నేపథ్యంలో సుంకాలపై సంప్రదింపులు జరపడం మరింత కష్టంగా మారింది. ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వైఖరే దీనికి కారణం.

ఎగుమతులు తక్కువే అయినా...

వ్యవసాయోత్పత్తులపై భారత్ విధిస్తున్న సగటు దిగుమతి సుంకం 37.66 శాతం. అదే అమెరికా విధిస్తున్న దిగుమతి సుంకం 5.29 శాతం మాత్రమే. అంటే ఈ రెండింటి మధ్య 32.37 శాతం వ్యత్యాసం ఉందన్న మాట. దేశ జనాభాను, ఆహార భద్రత అవసరాలను గమనంలో ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులను పెద్దగా ఎగుమతి చేయడం లేదు. కొన్ని సందర్భాల్లో వాటిపై ఆంక్షలు కూడా విధిస్తోంది. ఉదాహరణకు గత రెండు సంవత్సరాల కాలంలో బియ్యం, గోధుమలు, చక్కెర, ఉల్లిగడ్డల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. రుతుపవనాలు అనుకూలించడం, ఉత్పత్తి స్థిరంగా ఉండడంతో దేశం నుండి వ్యవసాయ ఎగుమతులు పెరుగుతున్నాయి. గత పది సంవత్సరాల కాలంలో వాటి విలువ 22.70 బిలియన్ డాలర్ల నుంచి 48.15 బిలియన్ డాలర్లకు పెరిగింది. ముఖ్యంగా మన దేశం నుంచి అమెరికాకు సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే అమెరికా కనుక వాటి దిగుమతులపై 32.4 శాతం అదనపు సుంకం విధిస్తే ఎగుమతులు...ముఖ్యంగా రొయ్యల ఎగుమతులు దెబ్బతినే ప్రమాదం ఉంది. అలాగే మన దేశం నుంచి గేదె మాంసం కూడా అమెరికాకు ఎక్కువగానే ఎగుమతి అవుతోంది. దీని ఎగుమతుల ద్వారా 2023-24లో మన దేశం 3.74 బిలియన్ డాలర్లు ఆర్జించింది. అయితే ప్రమాణాలకు అనుగుణంగా లేదన్న కారణంగా ప్రస్తుతం గేదె మాంసాన్ని అమెరికా అనుమతించడం లేదు. కాబట్టి దాని ఎగుమతులపై కూడా ప్రభావం పడుతుంది.

ప్రభావం ఎక్కువే

భారత్ నుంచి అమెరికాకు ప్రతి ఏటా బియ్యం ఎగుమతులు పెరుగుతూనే ఉన్నాయి. 1993-94లో దేశీయ మార్కెట్‌లో ఏడు శాతంగా ఉన్న బియ్యం ఎగుమతులు 2022-23 నాటికి ఇరవై ఐదు శాతానికి పైగా పెరిగాయి. ప్రస్తుతం భారత్ 304.78 మిలియన్ డాలర్ల విలువ కలిగిన బాస్మతి, 45.1 మిలియన్ డాలర్ల విలువ కలిగిన బాస్మతి యేతర బియ్యాన్ని ఎగుమతి చేస్తోంది. అమెరికాకు గ్వార్ గమ్ (గ్వార్ అనే మొక్క నుంచి ఉత్పత్తి చేసిన జిగురు) ఎగుమతులు కూడా గణనీయంగానే జరుగుతున్నాయి. వీటి ద్వారా 2023-24లో 106 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది. గత కొన్ని సంవత్సరాలుగా మన దేశం నుండి తాజా పండ్ల ఎగుమతులు సైతం బాగానే జరుగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో 13.20 మిలియన్ డాలర్ల విలువ కలిగిన పండ్లు ఎగుమతి అయ్యాయి. వీటిలో మామిడి పండ్ల ఎగుమతుల విలువే 10 మిలియన్ డాలర్లు ఉంటుంది. సుంకాల విషయంలో ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు పడిపోయే ప్రమాదం ఉన్నదని నిపుణులు హెచ్చరించారు. దీనివల్ల అంతిమంగా నష్టపోయేది రైతులే.

'మహా'యుతిలో అసమ్మతి

ఫడ్నవీస్, శిండేల మధ్య కొరవడిన సఖ్యత

ముంబయి : మహారాష్ట్రలో బిజెపి, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి, ఏక్‌నాథ్ శిండే శివసేనతో కూడిన మహాయుతి కూటమిలో అంతర్గత కుమ్ములాటలు భగ్గుమంటున్నాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి, శివసేన చీఫ్ ఏక్‌నాథ్ శిండేలకు ఒకరంటే ఒకరికి పడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శిండే, ఆయన గ్రూపు మంత్రుల శాఖల్లో సిఎం జోక్యం చేసుకోవడం, ముఖ్యమంత్రి నిర్వహించే సమావేశాలకు డిప్యూటీ సిఎం డుమ్మా కొట్టటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. గత కొంత కాలంగా కూటమిలో ఇదే పరిస్థితి ఉన్నది. 'ముఖ్య' నేతల మధ్యే ఇలాంటి ఘర్షణ వాతావరణం ఉండటంతో కూటమిలోని కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు డీలా పడిపోతున్నారు. అసలు ఇలాంటి పరిస్థితులతో కూటమి పూర్తికాలం అధికారంలో ఉంటుందా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ముఖ్యమంత్రి పీఠం విషయంలో ఏక్‌నాథ్ శిండే తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వం కొలువుదీరే వేళ శివసేన 14 మంత్రి పదవులను డిమాండ్ చేయగా.. 11 మాత్రమే దక్కటం శిండేకు మరింత కోపాన్ని తెప్పించిందని విశ్లేషకులు వివరిస్తున్నారు. నాశిక్, రాయ్‌గడ్‌కు సంరక్షణ మంత్రులుగా తమ గ్రూపువారైన దాదాజీ భుసే, భరత్ గొగవాలేలను నియమించాలన్న శిండే అభ్యర్థనను కూడా బిజెపి అధిష్టానం తిరస్కరించింది. వాటిని ఫడ్నవీస్ అనుచరుడు గిరీశ్ మహాజన్, ఎన్సీపీ ఏత సునీల్ తాత్కరే కూతురు అదితి తాత్కరేకు కేటాయించింది. ఈ నిర్ణయంపై భరత్ మద్దతుదారులు ముంబయి-గోవా రహదారిని దిగ్బంధించి తమ ఆందోళనను వ్యక్తం చేశారు.

ఇదిలావుంటే ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అధ్యక్షతన జరిగే పలు సమావేశాలకు శిండే డుమ్మా కొడుతూ వస్తున్నారు. ఈనెల 3న జరిగిన క్రిటికల్ క్యాబినేట్ మీటింగ్‌కు కూడా శిండే హాజరుకాలేదు. ఈనెల 12న జరిగి రెండు పట్టణాభివృద్ధి సమావేశాలకూ ఆయన రాలేదు. బదులుగా.. అంబర్‌నాథ్‌లో నిర్వహించిన ఒక మతవేడుకకు హాజరుకావాలని శిండే నిర్ణయించుకోవటం ఇద్దరి మధ్య దూరం పెరిగిందనడానికి బలం చేకూర్చుతోంది. శిండే గ్రూపులోని 20 మంది ఎమ్మెల్యేలకు వై-సెక్యూరిటీని ఫడ్నవీస్ సర్కార్ తొలగించడం కూటమిలో అగ్గిరాజేసింది. అలాగే సిఎం మెడికల్ ఎయిడ్ డెస్క్ హెడ్‌గా ఉన్న శిండే ముఖ్య అనుచరుడు మంగేశ్ చివ్తేను గతేడాది డిసెంబర్‌లో తొలగించారు. దీనికి స్పందనగా.. శిండే ఒక కొత్త మెడికల్ ఎయిడ్ డెస్క్‌ను సృష్టించి, దానికి చివ్తేను హెడ్‌గా నియమించి తన 'ప్రభావం'కు సంబంధించి ఫడ్నవీస్ సర్కారుకు సంకేతాలు పంపాడని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.

సిడ్కో ప్రాజెక్టుపై దర్యాప్తు

గత శిండే సర్కారు హయాంలో అమలు చేసిన కనీస మద్దతు ధర పథకంలో అవకతవకల ఆరోపణలపై ఫడ్నవీస్ దర్యాప్తునకు ఆదేశించారు. అలాగే, శిండే పునరుద్ధరించి రూ.900 కోట్ల సిడ్కో ప్రాజెక్టు పైనా దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశించటం గమనార్హం. పట్టణాభివృద్ధి శాఖ కిందకు వచ్చే ఈ గృహ నిర్మాణ ప్రాజెక్టును 2020లో రద్దు చేయగా.. సీఎంగా ఉన్న సమయంలో శిండే పునరుద్ధరించారు. రాష్ట్రంలో తానే పవర్ సెంటర్ అనే సందేశాన్ని ఫడ్నవీస్ పంపాలనుకుంటున్నాడనీ, ఇందులో భాగంగానే ఫడ్నవీస్ శివసేన పట్ల సీఎం ఈ విధంగా వ్యవహరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్నది మైనారిటీ ప్రభుత్వమనీ, శిండే వద్ద ఉన్న ఏడుగురు ఎంపీలపై ఆయనకు మంచి పట్టు ఉన్నదని అంటున్నారు. మొత్తానికి, ఫడ్నవీస్, శిండేల మధ్య ఘర్షణ వాతావరణ సుస్పష్టమని అంటున్నారు. ఫలితంగా, మహారాష్ట్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయని చెప్తున్నారు.





మీ కోసం

కుక్కర్‌లో అన్నం, పప్పు వండేటప్పుడు అందులో పొడవాటి చెంచా వేస్తే ఎసరు బయటికి రాకుండా ఉంటుంది.

జీవన సౌరభం

ఇంగిత జ్ఞానం లేని మెదడులో ప్రశ్న ఉదయించదు. మౌఢ్యం నిండిన మనసుల్లో ఆలోచన పుట్టదు.

చెట్టు చెప్పిన సంగతులు!



పిరికితనము వదులుకొని
ధైర్యాన్ని నింపుకొని
ఆశయాన్ని సాధించు!
నమ్మకాన్ని పెంచుకొని

గర్వాన్ని మానుకొని
వినయాన్ని ఆనుకొని
మొక్కలాగ జీవించు!
చుక్కలాగ ప్రకాశించు!

చిక్కులన్ని ఎదుర్కొని
హక్కులన్ని కాచుకొని
స్వేచ్ఛగా విహరించు!
న్యాయముకై నినదించు!

వినోదము పంచుకొని
వికాసము ఎంచుకొని
జగతిలో తేజరిల్లు!
జీవితాన వర్ధిల్లు!

మంచి దారి ఎన్నుకొని
సుగుణాలను పుచ్చుకొని
ఆదర్శము చూపించు!
నడవడిని దిద్దుకొని

గురువులను తలచుకొని
వ్యక్తిత్వం మలచుకొని
పదిమందికి బోధించు!
ప్రగతి బాట నడిపించు!

మనిషితనం చాటుకొని
దేశభక్తి నాటుకొని
దేశకీర్తి ప్రకటించు!
గొప్ప స్ఫూర్తి అందించు!

చిరు నవ్వులు పులుముకొని
అందరినీ కలుపుకొని
దేశాభివృద్ధి కాంక్షించు!
దీక్షను కొనసాగించు!

– గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
99664 14580.

సరైన అక్షరాలు రాయండి




పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన జంతువుల పేర్లను ఆంగ్లంలో ఏమంటారో పక్కనే ఉన్న గళ్లల్లో రాయండి. క్లూ ఆధారంగానే రాయాలి మరి.

నేను గీసిన బొమ్మ



జోగ హేమ స్వరూప్,
6వ తరగతి, జెడ్‌పిహెచ్‌ఎస్, కె.కోటపాడు,
కె. కోటపాడు మండలం, అనకాపల్లి జిల్లా.



అడవి దారిలో నడిచి.. అంగన్‌వాడీ నడిపి ...

మొన్నీమధ్య 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆఫీసుకు ప్రతిరోజూ విమానంలో ప్రయాణిస్తున్న మహిళ గురించి వార్తల్లో వచ్చింది. ఆమె వృత్తినిబద్ధతను అందరూ కొనియాడారు. లక్షల్లో జీతం సంపాదిస్తున్న ఆమె జీతంలో చాలా భాగం ప్రయాణానికే ఖర్చు పెడుతోందని ఆశ్చర్యపోయారు. అయితే ఇప్పుడు మనం చెప్పకుంటున్న అన్నాలక్ష్మి అనే మహిళ అంత జీతం అందుకోవడం లేదు. అంతెత్తున విమానంలోనూ ప్రయాణించడం లేదు. చిన్నార్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి సమీపంలో ఉన్న మారుమూల థయన్నకుడి గ్రామ అంగన్వాడీ కార్యకర్తగా రూ.12,500 జీతానికి ఆమె పనిచేస్తోంది.



సహాయకురాలు అల్ఫోన్సాతో అడవి మార్గం గుండా ఇంటికి వెళుతున్న అన్నాలక్ష్మి

పదిహేడేళ్లుగా ఆ కేంద్రంలో పిల్లలకు విద్య చెప్పేందుకు ఆమె ప్రతిరోజూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తోంది. ఆ దారిలో 6 కిలోమీటర్ల మేర రహదారే లేదు. వన్యమృగాలు ఏ వైపు నుండి వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మొన్నీమధ్యే ఫిబ్రవరి 6న ఓ గిరిజనుడిని అడవి ఏనుగు దాడి చేసి చంపేసింది. ఈ ఘటన జరిగిన తరువాత కూడా అన్నాలక్ష్మి ఆ దారి గుండానే ప్రయాణించింది. పదిరోజుల క్రితం, ఆ వ్యక్తిని చంపిన ఏనుగు అన్నాలక్ష్మిని కూడా వెంబడించింది. ఎలాగోలా దాన్ని నుండి తప్పించుకుని మరుసటి రోజు మళ్లీ యథావిధిగా తన ప్రయాణాన్ని కొనసాగించింది ఆమె.

'2007లో 21 ఏళ్ల వయసులో అంగన్వాడీ కార్యకర్తగా ఇక్కడికి వచ్చాను. ఈ ప్రాంతంలోని గిరిజనులు నా జీవితంలో భాగమైపోయారు. మా ఇంటి నుండి అంటే పల్లానాడు నుండి ఉదయం 6:45కి బయల్దేరతాను. మరయూర్ టౌన్ నుండి చిన్నర్ కేంద్రానికి చేరుకుంటాను. అక్కడికి నుండి అంగన్వాడీకి వెళ్లేందుకు మొత్తం 16 కిలోమీటర్లలో 6 కిలోమీటర్లు అడవిగుండా ప్రయాణించాలి. ఇదొక్కటే దారి. తిరిగి మళ్లీ 5 గంటలకు నేను ఇంటికి చేరేవరకు నా ఫోను సిగ్నల్స్ కూడా పనిచేయవు. అంటే మార్గమధ్యంలో నాకు ఏదైనా ప్రమాదం జరిగినా బయట వ్యక్తులకు వెంటనే తెలియదు' అని అన్నాలక్ష్మి తన రోజువారీ దినచర్య గురించి చెబుతున్నారు.

దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ దారిలో ప్రయాణిస్తున్న అన్నాలక్ష్మి అక్కడి గిరిజన కుటుంబాల్లో ఒకరిగా మారిపోయారు. వారితో మాట్లాడుతూ వన్యప్రాణుల కదలికలు, తప్పించుకోవడం వంటి ప్రాణరక్షణ చర్యలను తెలుసుకున్నారు. 'గిరిజనుల నుండి పొందిన ఆ అవగాహనతో జంతువుల పాదముద్రలు గమనిస్తూ వెళతాను. అయినా దాడి జరుగుతూనే ఉంటుంది. నా సహాయకురాలు అల్ఫోన్సాతో వెళ్తున్నప్పుడు మొన్నీమధ్యే ఓ అడవి ఏనుగు మమ్మల్ని వెంబడించింది. చెట్ల చాటున, రాళ్ల మాటున దాక్కుని ఎలాగోలా దాన్నినుండి తప్పించుకున్నాం' అని ఇటీవల జరిగిన ప్రమాదం గురించి ఆమె గుర్తుచేసుకున్నారు.

సాధారణంగా గిరిజన ప్రాంతాల్లో చదువు నేర్చుకునేందుకు పిల్లలను బడికి పంపరు. ఈ విషయం గురించి అన్నాలక్ష్మి తన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. 'ఇక్కడి ప్రజలు తమ పిల్లలను ఓ గుడ్డలో చుట్టుకుని వీపుకి తగిలించుకుని తాము పనిచేసే చోట్లకి తీసుకెళ్లిపోయేవారు. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. తల్లులతో అడవిలోకి వెళ్లేకంటే నాతో స్కూలుకి రావడానికే పిల్లలు ఇష్టపడుతున్నారు' అని అన్నాలక్ష్మి గర్వంగా చెప్పారు.

ఇంత ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్న అన్నాలక్ష్మి ఇప్పుడు ఇద్దరు బిడ్డల తల్లి. ఒకపక్క ఇంటిని చూసుకుంటూ, పిల్లల సంరక్షణ చేస్తూ ప్రమాదకర పరిస్థితిల్లో ఉద్యోగం చేయడం అంత ఆషామాషీ కాదు. '2016లో ఇంటికి తిరిగివస్తుండగా రోడ్డు యాక్సిడెంట్ జరిగింది. నేను మరయూర్ టౌన్ ఆస్పత్రిలో చేరిన సాయంత్రానికి గాని మా కుటుంబసభ్యులకు తెలియలేదు. అప్పుడు నాపై కుటుంబ ఒత్తిడి బాగా పెరిగింది. ట్రాన్స్‌ఫర్ చేయించుకోమని బలవంతం చేశారు.

చాలాసార్లు ప్రయత్నించాను. అయితే ఆ స్కూలు ఆ పిల్లలకు ఉన్న ఏకైక వెలుగు. ఆ దారి మూసుకుపోవడం నాకిష్టం లేదు. అందుకే ఎంత కష్టమైనా భరిస్తున్నాను' అంటున్న అన్నాలక్ష్మి తన జీతంలో రూ.6000 ప్రయాణానికే ఖర్చుపెడుతున్నారు.

విటమిన్ 'డి' లోపాన్ని ఇలా గుర్తించండి..

శరీరంలోని అన్ని అవయవాలు సరిగ్గా పనిచేయడానికి రోజుకు 20-40 ఎంజీ/ఎంఎల్ విటమిన్ డి అవసరం. ఈ స్థాయి తక్కువగా ఉంటే, అది శరీరంలోని వివిధ అవయవాల పనితీరుకు అంతరాయం కలిగిస్తుంది. శరీరంలో విటమిన్ డి లోపాన్ని అనేక లక్షణాల ద్వారా గుర్తించవచ్చు. లోపాన్ని సకాలంలో గుర్తించి జాగ్రత్త పడడం చాలా ముఖ్యం. లేకపోతే ఈ లోపం పెద్ద సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. శరీరంలో తగినంత విటమిన్ డి ఉందా లేదా ఇలా తెలుసుకుందాం..

భరించలేని కండరాల నొప్పి

విటమిన్ డి లోపం వల్ల కండరాల నొప్పి వస్తుంది. చాలా మంది దీనిని అలసిపోతున్నట్టుగా భావిస్తారు. ఇది సహజమే అనుకుని నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే తగినంత విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా ఈ సమస్య తగ్గకపోతే, వెంటనే అప్రమత్తం కావాలి.

ఆందోళన, ఒత్తిడి కలుగుతుందా


వేసవిలో చెమటలు పట్టడం సహజమే, కానీ మామూలు సమయాల్లో నుదిటిపై అనుకోకుండా చెమట కనిపించడం గమనించినట్లయితే జాగ్రత్తపడాలి. 'డి' విటమిన్ సెరోటోనిన్ హార్మోన్ ఉత్పత్తికి, మెదడు సరైన పనితీరుకు చాలా అవసరం. ఈ హార్మోన్ మానసిక స్థితిని నియంత్రించడంలో సహాయపడుతుంది. తగినంత విటమిన్ డి తీసుకోకపోవడం వల్ల మానసిక స్థితిలో మార్పులు, ఆందోళన, నిరాశ కలుగుతాయి.

జుట్టు రాలడం

విటమిన్ 'డి' లోపం వల్ల కూడా జుట్టు రాలుతుంది. చాలామంది దీనిని జన్యుపరమైన సమస్యగా భావిస్తారు. 'డి' విటమిన్ లోపం తలపై ఫోలికల్స్ ఏర్పడటానికి దారితీస్తుంది. ఫలితంగా, జుట్టు సమస్యలు మొదలవుతాయి. ఇంకా విటమిన్ డి లోపం లక్షణాలలో కీళ్ల నొప్పులు కూడా ఒకటి. కడుపు ఉబ్బరం, విరేచనాలు, మలబద్ధకం వంటి సమస్యలు కూడా వస్తాయి.

విటమిన్ 'డి' లోపాన్ని ఇలా అధిగమించాలి

సూర్యకాంతి నుండి విటమిన్ 'డి' పొందవచ్చు. అయితే రోజుకు 15-30 నిమిషాలు మాత్రమే ఎండలో గడపాలి. అది కూడా ఉదయం 7-9 గంటల మధ్య వచ్చే సూర్యకాంతిలోనే ఉండాలి. అలాగే తగినంత మొత్తంలో విటమిన్ 'డి' ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. అంటే చేపలు, పుట్టగొడుగులు, పాల ఉత్పత్తులు, గుడ్డు సొనలు, తృణధాన్యాలు వంటివి. అయినా సమస్య పరిష్కారం కాకపోతే, వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.





వేసవిలో 'ఆదిత్య 369' రీరిలీజ్

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన తొలి భారతీయ సైన్స్ ఫిక్షన్ చిత్రం 'ఆదిత్య 369' రీ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటలైజ్ చేసి రాబోయే వేసవిలో గ్రాండ్ రీ రిలీజ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని మేకర్లు ప్రకటించారు. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ నేపథ్యంలో వచ్చిన మొదటి సినిమాగా పేరొందిన ఈ చిత్రం శివలెంక కృష్ణప్రసాద్ నిర్మాణంలో సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందింది. శ్రీకృష్ణదేవరాయులుగా నందమూరి బాలకృష్ణ నటన, సింగీతం దర్శకనైపుణ్యం, ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం గాత్రం-సమర్పణ, జంధ్యాల సంభాషణలు, ఇళయరాజా అద్భుత సంగీతం, శివలెంకకృష్ణప్రసాద్ నిర్మాణ విలువలు, ఇతర నటీనటుల ప్రతిభ, అబ్బురపర్చే సెట్స్, ఫైట్స్, దుస్తులు, నృత్యం ఇలా ప్రతిఒక్కరూ చరిత్రలో నిలిచిపోయేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దటంలో ముఖ్యపాత్రలు పోషించారు. వేసవిలో ఈ సినిమా అలరించటానికి తుదిమెరుగులు దిద్దుకుంటోందని మేకర్లు ప్రకటించారు.



7న తెలుగులో 'చావా' విడుదల

ఈనెల 14న విడుదలై ప్రేక్షకుల ముందుకు వచ్చిన సినిమా 'చావా'. మరాఠాయోధుడు ఛత్రపతి శివాజీయే కాదు ఆయన తనయుడు శంభాజీ కూడా పరాక్రమవంతుడు, త్యాగశీలి అని సినిమాలో చూపించారు. వారి జీవిత చరిత్ర ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. నిర్మాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో ఈ సినిమాను తెలుగులో డబ్బింగ్ చేయించి విడుదల చేయటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 7వ తేదీన ఛావా తెలుగు వర్షన్ విడుదల కానున్నట్లుగా ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. విక్కీ కౌశల్ పాత్రకు జూనియర్ ఎన్టీఆర్ డబ్బింగ్ చెప్పే అవకాశం ఉన్నట్లుగా చర్చించుకుంటున్నారు. ఈ సినిమాలో విక్కీ కౌశల్, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలు పోషించారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించారు. ఎఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

నిర్మాత కేదార్ మృతి



టాలీవుడ్ యువ నిర్మాత కేదార్ సెలగంశెట్టి (50) మంగళవారం దుబాయ్‌లో ఆకస్మికంగా మృతిచెందినట్లుగా సమాచారం. ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా ఇటీవల విడుదలైన 'గంగం గణేషా' చిత్రాన్ని ఆయన నిర్మించారు. దుబాయ్‌లో జరిగిన టాలీవుడ్‌కు చెందిన సినీ ఫైనాన్షియల్ కుమారుడి వివాహానికి సంబంధించిన ప్రీ వెడ్డింగ్ వేడుకకు పరిశ్రమలోని పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ వేడుక అనంతరం అక్కడి తన ఫ్లాట్‌లో కేదార్ విశ్రాంతి తీసుకున్నారు. నిద్రలోనే ఆయన మృతిచెందినట్లుగా సమాచారం. పరిశ్రమలోని కథానాయకులు అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండలతోపాటు ఇతర సినీ ప్రముఖులు, నిర్మాతలు, దర్శకులు, రాజకీయ ప్రముఖులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయన సినీ నిర్మాతగా మారక ముందు నుంచి హైదరాబాద్‌లోని ఒక పబ్‌లో భాగస్వామిగా ఉన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలోనూ కొనసాగుతున్నారు. మృతికి కారణాలు ఇంకా పూర్తిగా తెలియలేదు.

21న 'టుక్ టుక్' విడుదల



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'టుక్ టుక్'. సి.సుప్రీత్ కృష్ణ దర్శకత్వం వహించారు. రాహుల్‌రెడ్డి, లోక్కు శ్రీ వరుణ్, శ్రీరాములురెడ్డి నిర్మించారు. మార్చి 21ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ప్రస్తుతం జరుగుతోంది. సంతు ఓంకార్ స్వరాలు సమకూర్చారు. హర్ధిక్ శ్రీకుమార్ సినిమాటోగ్రఫీ అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు సుప్రీత్‌కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ నేపథ్యంలో జరిగే న్యూ ఏజ్ లవ్ స్టోరీగా తెరకెక్కించామన్నారు. ఇందులో ముఖ్యంగా స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యూజికల్ పవర్స్ కల్గివుంటుందన్నారు. ప్రతిఒక్కరూ ఈ చిత్రాన్ని ఆదరించి విజయవంతం చేయాలని కోరారు.

సరికొత్తగా సాయిహస్విన్‌బాబు



బాలనటుడు పుప్పాల సాయి హస్విన్ సినిమాల్లోనూ నటిస్తున్నాడు. త్వరలో విడుదల కానున్న 143 ఎఎం సినిమాలో నటించాడు. ఇందులో ఎక్కువ నిడివిలో ఆయన క్యారెక్టర్ సాగుతుంది. మాటల్లో స్పష్టత, డైలాగుల డెలివరీలో వేగం, కంటెంట్ చెబితే దానికి అనుగుణంగా ఎలాంటి సందర్భానికైనా పంచ్ డైలాగులతో అలరిస్తాడు. ఈ పదేళ్ల కుర్రాడు ఇప్పుడు ఏకంగా నాలుగు సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ఇప్పటికే ఐదు షార్ట్ ఫిలిమ్స్ కూడా నటించాడు. తండ్రి అమ్మ రమేష్ దర్శకుడు, కొరియోగ్రాఫర్ కావటంతో చిన్నప్పటి నుంచే యాక్టింగ్‌లో మెళకువలు నేర్చుకుంటున్నాడు. ఇటీవల వెబ్‌సిరీస్ 12 ఎపిసోడ్లకు సంబంధించిన షూటింగ్‌లో ఈ కుర్రాడు తన యాక్టింగ్‌తో అదరగొట్టాడు. రాబోయేకాలంలో మంచి అవకాశాలను అందుకుని రాణించాలని ఆశిద్దాం.

ఆఫ్ఘన్ అదుర్స్

- **ఇంగ్లండ్ ఇంటికి..**
- **రూట్ పోరాటం వృథా**
- **జద్రాన్ సెంచరీ**
- **అజ్మతుల్లాకు ఐదు వికెట్లు**

లాహోర్: ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు మరోసారి సంచలనాన్ని నమోదు చేసింది. వన్డే ప్రపంచకప్‌లో ఇంగ్లండ్‌పై లభించిన విజయం ఆషామాషీ కాదని నిరూపిస్తూ.. ఆఫ్ఘనిస్తాన్ జట్టు మరో మళ్లీ ఆదే జట్టుపై విజయం సాధించడం విశేషం. గడాఫీ స్టేడియంలో బుధవారం ఇంగ్లండ్‌తోపై ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఎనిమిది పరుగుల తేడాతో విజయం సాధించింది. చివరి ఓవర్లో విజయానికి 13పరుగులు చేయాల్సిన ఇంగ్లండ్‌ను కట్టడి చేసి ఆఫ్ఘన్ జట్టు బౌలర్లు చూపిన తెగువ హర్షణీయం. ఇక తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 325పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఆఫ్ఘన్ జట్టు కాపాడుకుంటూ ఇంగ్లండ్ జట్టును 317పరుగులకే ఆలౌట్ చేసింది. ఈ గెలుపుతో ఆఫ్ఘనిస్తాన్ జట్టు సెమీస్ రేసులో నిలువగా.. ఇంగ్లండ్ జట్టు ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమించింది. ఆఫ్ఘన్ బౌలర్లు అజ్మతుల్లాకు ఐదు, నబీకి రెండు వికెట్లు దక్కాయి.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆఫ్ఘనిస్తాన్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్ గుర్బాజ్(6) నిరాశపరిచాడు. ఆ తర్వాత సిద్ధిఖుల్లా(4), రామత్ షా(4) నిరాశపరిచారు. దీంతో ఆఫ్ఘన్ జట్టు 37పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో మరో ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (177; 146బంతుల్లో 12ఫోర్లు, 6సిక్సర్లు) విధ్వంసం సృష్టించాడు. దీంతో అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో జద్రాన్.. ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక స్కోరు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. హష్మతుల్లా షాహిది (40; 67బంతుల్లో 3ఫోర్లు) రాణించారు. క్రీజులో కుదురుకున్న తర్వాత జద్రాన్ జోరు పెంచాడు. 15 ఓవర్లకు 56/3 ఉన్న స్కోరు జద్రాన్ జోరు పెంచడంతో పరుగులు పెట్టింది. అతడు 106 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు, ఒమర్జాయ్ కూడా దూకుడుగా ఆడటంతో 40 ఓవర్లకు స్కోరు 212/5కి చేరింది. సెంచరీ తర్వాత జద్రాన్ చెలరేగి ఆడాడు. ఆర్చర్ వేసిన 44వ ఓవర్‌లో ఒక సిక్స్‌తోపాటు వరుసగా మూడు ఫోర్లు బాదాడు. నబీ కూడా దూకుడు ప్రదర్శించడంతో అఫ్గాన్ భారీ స్కోరు సాధించింది. లివింగ్ స్టోన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో జద్రాన్, నబీ ఔటయ్యారు. దీంతో అఫ్ఘనిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లు ఆర్చర్‌కు మూడు, లివింగ్‌స్టోన్‌కు రెండు, ఓవర్టన్, రషీద్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

ఐసిసి టోర్నీల్లో ఆఫ్ఘనిస్తాన్ అత్యధిక స్కోర్లు

325/7 : ఇంగ్లండ్‌పై, 2025 ఛాంపియన్స్‌ట్రోఫీ, లాహోర్
291/5 : ఆస్ట్రేలియాపై, 2023 వన్డే ప్రపంచకప్, ముంబయి
288/10 : వెస్టిండీస్‌పై, 2019 వన్డే ప్రపంచకప్, లీడ్స్
286/2 : పాకిస్తాన్‌పై, 2023 వన్డే ప్రపంచకప్, చెన్నై
284/10 : ఇంగ్లండ్‌పై, 2023 వన్డే ప్రపంచకప్, ఢిల్లీ

స్కోర్‌బోర్డు...

ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి)ఆర్చర్ 6, జద్రాన్ (సి)ఆర్చర్ (బి)లివింగ్‌స్టోన్ 177, సిద్ధిఖుల్లా (ఎల్‌బి)ఆర్చర్ 4, రామత్ షా (సి)రషీద్ (బి)ఆర్చర్ 4, షాహిదీ (బి)రషీద్ 40, అజ్మతుల్లా (సి)బెంటన్ (బి)ఓవర్టన్ 41, నబి (సి)రూట్ (బి)లివింగ్‌స్టోన్ 40, గుల్బద్దీన్ (నాటౌట్) 1, రషీద్ ఖాన్ (నాటౌట్) 1, అదనం 11. (50ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 325పరుగులు. **వికెట్ల పతనం:** 1/11, 2/15, 3/37, 4/140, 5/212, 6/323, 7/324 **బౌలింగ్:** ఆర్చర్ 10-0-63-3, వుడ్ 8-0-50-0, ఓవర్టన్ 10-0-72-1, రషీద్ 10-0-60-1, రూట్ 7-0-47-0, లివింగ్‌స్టోన్ 5-0-28-2.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)అజ్మతుల్లా 12, డకెట్ (ఎల్‌బి)రషీద్ ఖాన్ 38, స్మిత్ (సి)అజ్మతుల్లా (బి)నబి 9, రూట్ (సి)గుర్బాజ్ (బి)అజ్మతుల్లా 120, బ్రూక్ (సి అండ్ బి)నబి 25, బట్లర్ (సి)రామత్ షా (బి)అజ్మతుల్లా 38, లివింగ్‌స్టోన్ (సి)గుర్బాజ్ (బి)గుల్బద్దీన్ 10, ఓవర్టన్ (సి)నబి (బి)అజ్మతుల్లా 32, ఆర్చర్ (సి)నబి (బి)ఫారూఖీ 14, రషీద్ (సి)నబి (బి)జద్రాన్ 5, వుడ్ (నాటౌట్) 2, అదనం 12. (49.5ఓవర్లలో ఆలౌట్) 317పరుగులు. **వికెట్ల పతనం:** 1/19, 2/30, 3/98, 4/133, 5/216, 6/233, 7/287, 8/309, 9/313, 10/317 **బౌలింగ్:** ఫారూఖీ 10-0-62-1, అజ్మతుల్లా 9.5-0-58-5, నబి 9-0-57-2, రషీద్ ఖాన్ 10-0-66-1, నూర్ అహ్మద్ 10-0-51-0, గుల్బద్దీన్ నైబ్ 2-0-16-1.



జద్రాన్ (177పరుగులు)

కోహ్లి @ 5

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో భారత రన్ మెషీన్ విరాట్ కోహ్లి సత్తా చాటాడు. ఇప్పటిదాకా ఆరోస్థానంలో ఉన్న కోహ్లి.. ఒక స్థానం మెరుగుపరుచుకుని ఐదో స్థానానికి ఎగబాకాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా పాకిస్తాన్‌పై సెంచరీతో కదం తొక్కిన కోహ్లి(743రేటింగ్‌పాయింట్లు)తో 5వ స్థానంలో ఉన్నాడు. ఇక శుభ్‌మాన్ గిల్, బాబర్ అజామ్, రోహిత్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్ వరుసగా మొదటి నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. గిల్(817రేటింగ్ పాయింట్లు) తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అంతేగాక రెండో స్థానంలో ఉన్న అజామ్ (770పాయింట్లు) ఉన్నాడు. గతంలో గిల్‌కు, అజామ్‌కు 23 పాయింట్ల గ్యాప్ ఉండగా.. ఇప్పుడు ఆ గ్యాప్ 47 పాయింట్లకు పెరిగింది. శ్రేయస్ అయ్యర్ 9వ ర్యాంకులోనే కొనసాగుతుండగా.. కేఎల్ రాహుల్ రెండు స్థానాలు మెరుగై 15వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో శ్రీలంక స్టార్ స్పిన్నర్ మహీశ్ తీక్షణ టాప్‌లో ఉన్నాడు. ఆ తర్వాత స్థానాల్లో రషీద్ ఖాన్, కుల్‌దీప్ యాదవ్ ఉన్నారు. అయితే గాయం నుంచి కోలుకుని ఇప్పుడిప్పుడే జట్టులో రాణిస్తున్న టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్ మాత్రం రెండు స్థానాలు దిగజారి 12వ ర్యాంకుకు పడిపోయాడు. షమీ ఒక స్థానం మెరుగై 14వ ర్యాంకుకు చేరాడు.

విదర్భ 254/4

కేరళతో రంజీట్రోఫీ ఫైనల్



మలేశ్వర్(138బ్యాటింగ్)

నాగ్‌పూర్: రంజీట్రోఫీ ఫైనల్లో విదర్భ బ్యాటర్లు రాణించారు. విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో బుధవారం నుంచి కేరళతో ప్రారంభమైన రంజీట్రోఫీ ఫైనల్లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విదర్భకు ఓపెనర్లు నిరాశపరిచారు. పార్త్ రేఖడే(0), ధృవ్ షొరే(16)కి తోడు దర్శన్ నీల్‌కండే(1) కూడా త్వరగా పెవీలియన్‌కు చేరాడు. దీంతో విదర్భ జట్టు 24పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో డానిశ్ మలేశ్వర్(138బ్యాటింగ్)కి తోడు కరణ్ నాయర్(86) ఇన్నింగ్స్‌ను కుదుటపర్చారు. వీరిద్దరూ 4వ వికెట్‌కు 215పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత కరణ్ నాయర్ ఔటయ్యాడు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి మలేశ్వర్‌కి తోడు యశ్ ఠాకూర్(5) క్రీజ్‌లో ఉన్నాడు. కేరళ బౌలర్లు ఎండి నిదీశ్‌కి రెండు, ఈడెన్ ఆపెల్‌కు ఒక వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

విదర్భ తొలి ఇన్నింగ్స్: పార్థ్ రేఖడే (ఎల్‌బి)నిధేశ్ 0, ధృవ్ షొరే (సి)అజారుద్దీన్ (బి)ఈడెన్ ఆప్లే 6, దర్శన్ (సి)నెడుంకుజి (బి)నిధేశ్ 1, దినేశ్ మలేశ్వర్ (బ్యాటింగ్) 138, కరణ్ నాయర్ (రనౌట్)అజారుద్దీన్ 86, యశ్ ఠాకూర్ (బ్యాటింగ్) 5, అదనం 8. (86ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 254పరుగులు. **వికెట్ల పతనం:** 1/0, 2/11, 3/24, 4/23 **బౌలింగ్:** నిధేశ్ 18-7-33-2, ఈడెన్ ఆప్లే 21-5-66-1, ఆదిత్య 12-2-46-0, బసిల్ 14-4-36-0, సక్సేనా 14-0-46-0, అక్షయ్ 7-0-22-0.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68